fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 59 | విజయవాడ, గురువారం 1 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



కార్తీ చిదంబరం అరెస్టు

8

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అదుపులోకి తీసుకున్న సిబిఐ
- బ్యాంకు కుంభకోణాల దృష్టి మళ్లించేందుకే : కాంగ్రెస్

మరో రెండు దగా కంపెనీలు

- ఆర్‌పి సిస్టమ్స్ 10 బ్యాంకులకు ఎగనామం
- వందల కోట్లలో కుచ్చుటోపి
- సిబిఐకి కెనరా బ్యాంకు ఫిర్యాదు
- బెంగాల్ సిఎంతో డైరెక్టర్ చెట్టాపట్టాల్
- శ్రీలక్ష్మీ కోట్సిన్ 4వేల కోట్లకు ఎసరు



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, రొటోమోక్ అధినేత విక్రమ్ కొఠారీ, సింబోలి షుగర్స్ ఛైర్మన్ గుర్మిత్ సింగ్ మన్ బ్యాంకులను ముంచిన వైనం మర్చిపోకముందే ఈ తరహా మరో రెండు కంపెనీలు వెలుగులోకి వచ్చాయి. లేని ఆస్తులు, ఆదాయాలు చూపించి భారీ మొత్తంలో రుణాలు పొంది ఆ తర్వాత చెల్లించకకుండా పోతున్నాయి. ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ 10 బ్యాంకులకు రూ.500 కోట్ల పైగా ఎగనామం పెట్టగా, శ్రీలక్ష్మీ కొట్సిన్ లిమిటెడ్ రూ.4,000 కోట్లు ఎగేసుకుపోయింది. ఈ రెండు కంపెనీలు బ్యాంకులను భారీగా మోసం చేశాయని బుధవారం వెల్లడయ్యింది. ఇందులో ఒక కంపెనీ డైరెక్టర్ ఏకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రితో చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న ఆర్‌పి ఇన్ఫో సిస్టమ్స్, దాని డైరెక్టర్లు రూ.515.15 కోట్లకు పది బ్యాంకులను మోసం చేసినట్లు కేసు నమోదైంది. కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని 10 బ్యాంకుల కన్సార్టియం సిబిఐకి ఫిర్యాదు చేసింది. ఆ కంపెనీ డైరెక్టర్లు శివాజీ పంజా, కౌస్తువ్ రే, వినయ్ బఫ్నా, వైస్ ప్రెసిడెంట్ దేబాంత్ పాల్, గుర్తుతెలియని బ్యాంకు అధికారులపై సిబిఐ కేసు నమోదు చేసింది. సెక్షన్ 120బి రెడ్ విత్ 420 కింద నేరపూరిత కుట్ర, 468, 471 కింద ఫోర్జరీ, ప్రభుత్వ ఉద్యోగుల నేరపూరిత ప్రవర్తల కింద కేసులు పెట్టింది. 2015లో ఇదే కంపెనీ ఐడిబిఐ బ్యాంకును కూడా మోసం చేసింది. అప్పుడు కూడా ఆ కంపెనీపై కేసు నమోదయ్యింది. తాజాగా కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని 10 బ్యాంకుల కన్సార్టియం సిబిఐని ఆశ్రయించింది. తాజాగా మోసపోయిన బ్యాంకుల్లో పిఎన్‌బి కూడా ఉండటం గమనార్హం. దీంతో పాటు ఎస్‌బిఐ, ఎస్‌బిబిజె, యుబిఐ, అలహాబాద్ బ్యాంక్, ఒబిసి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బిపి, ఫెడరల్ బ్యాంకులు ఈ జాబితాలో ఉన్నాయి.

ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ 2012లో వివిధ బ్యాంకుల వద్ద లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఒయు) పొందింది. వీటితో వివిధ బ్యాంకుల నుంచి భారీగా నగదు తీసుకుంది. అయితే తిరిగి బ్యాంకులకు ఆ మొత్తాన్ని చెల్లించలేదు. బ్యాంకుల నుంచి రుణాలను పొందేందుకు గెయిల్ ఇండియా లిమిటెడ్, విన్సెంట్ ఎలక్ట్రానిక్స్, సియాట్ లిమిటెడ్ తదితర కంపెనీలో వ్యాపారాలు కలిగి ఉన్నట్లు ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ దొంగ పత్రాలను, ఆదాయాలను సృష్టించింది. కాగా 2015లోనే ఈ మోసం బయట పడింది.

శివాజీ పంజాపై మమతా..

ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ డైరెక్టర్ శివాజీ పంజాతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మిగతా 9లో



శ్రీదేవికి తుది వీడ్కోలు

ముంబయి: గత వారం దుబాయ్‌లో కన్నుమూసిన ప్రముఖ నటి శ్రీదేవి పార్థివ దేహానికి మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో బుధవారం ఇక్కడి విల్లే పార్లే సేవాసమాజ్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, వేలాది మంది అభిమానులు తమ అభిమాన నటికి కన్నీటితో తుది వీడ్కోలుపలికారు. తొలుత అభిమానుల కోసం లోఖండ్ వాలాలోని సెలెబ్రేషన్ స్పోర్ట్స్‌క్లబ్‌లో వుంచిన శ్రీదేవి భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు, అభిమానులు దర్శించి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆమె భౌతిక కాయంపై త్రివర్ణ పతాకాన్ని కప్పి అంత్యక్రియలకు తరలించారు. పార్థివ దేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన వాహనంపై శ్రీదేవి భారీ చిత్రపటాన్ని అలంకరించి తెల్లటి లిల్లీపూలు, మోగ్రా పూలతోను, గులాబీలతోనూ అలంకరించారు. అంతకు ముందు ఆమె నివాస భవనం నుండి ఉదయం 9 గంటలసమయంలో పార్థివ దేహాన్ని స్పోర్ట్స్‌క్లబ్‌కు తీసుకు వచ్చారు. హాల్‌లో ఒక ప్రక్క నిలిచిన ఆమె భర్త బోనీకపూర్, ఇతరకుటుంబ సభ్యులు, నటులు అనిల్ కపూర్, సంజయ్‌కపూర్, హర్షవర్ధన్ కపూర్, సోనమ్ కపూర్, రియా కపూర్‌లు కన్నీరు మున్నీరయ్యారు. వారి వెనుక శ్రీదేవి కుమార్తెలు జాన్వీ, ఖుషి నిలబడ్డారు.అనంతరం మిగతా 9లో

కంచి పీఠాధిపతి మృతి



ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (84) అనారోగ్యంతో తమిళనాడు రాష్ట్రం కాంచీపురం ఎబిసిడి ఆస్పత్రిలో మృతిచెందారు. గత కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆయన మూడేళ్లుగా ఆస్పత్రికే పరిమితమయ్యారు. పలుమార్లు ఆస్పత్రిలో చూపించుకున్నా కోలుకోలేదు. చికిత్స పొందుతున్న జయేంద్ర సరస్వతికి తీవ్ర గుండెపోటు రావడంతో బుధవారం మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. 1935, జులై 18న తమిళనాడు రాష్ట్రం తంజావూరులో జన్మించిన ఆయన అసలు పేరు సుబ్రమణ్యం అయ్యర్. 1994 నుంచి కంచి పీఠాధిపతిగా సుదీర్ఘకాలం సేవలందించారు.

టిటిడి ఈఓ సంతాపం

అనారోగ్యంతో మృతిచెందిన జయేంద్ర సరస్వతి మృతికి తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ సంతాపం ప్రకటించారు. హిందూ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా టిటిడి నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో కంచి పీఠాధిపతి అందించిన సహకారం మరువలేనిదన్నారు.

పెట్టుబడులపై ఆర్భాటమే



- మూడు సదస్సుల్లోనూ ఇదే తంతు
- కనిపించని సంస్థలు, దక్కని ఉద్యోగాలు
- కొత్త పెట్టుబడులపై మళ్లీ ఆశలు
- కేంద్ర బడ్జెట్ స్థాయిలో రాష్ట్రంలో ఒప్పందాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి, తద్వారా వస్తున్న పెట్టుబడుల మొత్తం ఎంత, ఎంతమందికి ఉద్యోగాలు వస్తున్నాయి... ఇలా అనేక సమస్యలకు సరైన సమాధానాలు లభించడం లేదు. ప్రతియేటా భాగస్వామ్య సదస్సులు నిర్వహించడమే తప్ప, తద్వారా ఒనగూరుతున్న ప్రయోజనాలపై అధికారులే స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. ఇది ప్రజల్లో కూడా అయోమయానికి, నిరుద్యోగుల్లో నిరుత్సాహానికి దారితీస్తోంది. కొత్త రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రతియేటా భాగస్వామ్య సదస్సులు జరుగుతూనే ఉన్నాయి. సిఐఐ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తోంది. ఇందులో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో సంస్థలు రావడం, వారితో భారీగా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవడం జరుగుతోంది. అయితే అందులో ఎన్ని తమ సంస్థల్ని స్థాపిస్తున్నాయన్నది ఇప్పటికీ సందేహాస్పదంగానే మారుతోంది. అధికారులు కూడా సరైన అంకెలు ఇవ్వలేకపోతున్నారు. అయితే ముఖ్యమంత్రి మిగతా 9లో


9

మహాధర్నాలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

'ఉక్కు' తరహాలో రైల్వేజోన్‌పై పోరాటం

- హోదా కోసం పోరాడితేనే చంద్రబాబుకు భవిష్యత్
- గిరిజన యూనివర్సిటీ ఎందుకు పెట్టడం లేదు
- ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి వల్లే రాష్ట్రానికి నష్టం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

డిస్కంల ముట్టడి విజయవంతం



డిస్కం కార్యాలయ ముట్టడిలో ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్

- తిరుపతిలో భారీగా విద్యుత్ కార్మికుల నిరసన
- విశాఖలో ముందస్తుగా 300 మంది అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి/విశాఖ

గత తొమ్మిది రోజులుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నా..ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థల ముట్టడించాలన్న పిలుపుమేరకు బుధవారం తిరుపతిలో వివిధ జిల్లాల నుండి వచ్చిన విద్యుత్ కార్మికులు 'డిస్కం'ను ముట్టడించి పెద్దఎత్తున నిరసన తెలిపారు. విశాఖలో కార్మికులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యల మిగతా 9లో

4న 'చలో గుంటూరు'

- ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ
- అనుమతివ్వాలని అర్బన్ పోలీసులకు హైకోర్ట్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

పెదగొట్టిపాడు దళితులకు సంఘీభావంగా, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులను నివారించాలని డిమాండ్ చేస్తూ చలో గుంటూరు కార్యక్రమాన్ని మార్చి 4న నిర్వహించటానికి అనుమతి మంజూరు చేయాలని గుంటూరు అర్బన్ పోలీసుల్ని ఆదేశిస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మార్చి 3న నిర్వహించాల్సిన సభను కోర్టు తీర్పు ప్రకారం 4న నిర్వహించనున్నట్లు పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కమిటీ తరపున దాఖలు చేసిన రెండు దరఖాస్తులను అర్బన్ పోలీసు అధికారులు తిరస్కరించిన నేపథ్యంలో కమిటీ హైకోర్టును ఆశ్రయిం చిందని కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ పేర్కొన్నారు. హైకోర్టులో కమిటీ తరపున న్యాయవాది మిగతా 9లో



పాదయాత్రలో వైఎస్ జగన్

100 వ రోజుకు చేరిన జగన్ పాదయాత్ర

ఫైలాన్ , వైఎస్ విగ్రహ ఆవిష్కరణలు

ప్రజాశక్తి-చీమకుర్తి

వైఎస్‌ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర బుధవారం 100 వ రోజుకు చేరింది. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలంలో ఆయన పాదయాత్రను కొనసాగించారు. 100 వరోజు చేరిన సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఫైలాన్‌ను, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు మర్రిచెట్లపాలెం మూసీనది బ్రిడ్జి సెంటర్ నుంచి పాదయాత్ర ప్రారంభమై...బూదవాడ పంచాయతీ పరిధిలోని యల్లయనగర్, రామతీర్థం మీదుగా చీమకుర్తి వరకూ సాగింది. చీమకుర్తిలో మధ్యాహ్నం మూడు గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభమైంది. ఈ సంధర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ తాను అధికారంలోకొస్తే గ్రానైట్‌పై రాయల్టీని మిగతా 9లో

సాగర్ వద్ద ఉద్రిక్తత

ఆంధ్రాకు నీటి విడుదల నిలుపుదల

ప్రజాశక్తి-విజయపురి సౌత్

నాగార్జునసాగర్ వద్ద బుధవారం ఉద్రిక్తత ఏర్పడింది. కుడికాలువకు తెలంగాణ అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. పరిమితికి మించి వాటాను వినియోగించుకున్నారని చెబుతూ నీటి సరఫరా నిలిపివేయడంతో తెలంగాణ, ఆంధ్ర అధికారుల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. రాష్ట్రానికి 10.5 టిఎంసీల నీటిని కృష్ణా బోర్డు కేటాయించింది. ఇప్పటివరకూ 10.2 టిఎంసిల నీటిని కుడికాలువకు విడుదల చేశారు. మరో 0.3 టిఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. 0.3 టిఎంసీల నీటిని విడుదల చేయకుండా నిలిపివేయడంతో ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముందు జాగ్రత్తగా పోలీసులు మోహరించారు. ఆంధ్రప్రదేశ్ నిర్ణయించిన వాటా కన్నా ఎక్కువగా నీటిని వినియోగించుకుందని తెలంగాణ అధికారులు వాదించారు. ఇదే విషయాన్ని కృష్ణా బోర్డు కూడా చెప్పిందన్నారు. ఈ సందర్భంగా ఈఎన్‌సి ఆదేశాల మేరకు నీటి విడుదలను ఆపివేశామని ఆంధ్రా అధికారులకు తెలంగాణా అధికారులు చెప్పారు. తిరిగి నీరు విడుదల చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతులు అవసరమన్నారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి సమావేశం కావాలని ఇరు ప్రాంతాల ఇంజనీర్ అధికారులు నిర్ణయించారు. ఆంధ్రా ఇంజనీర్లను కంట్రోల్‌రూంకు వెళ్ళనీయకుండా ప్రధాన గేటు వద్ద తెలంగాణా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో గురజాల డిఎస్‌పి కెవివిఎస్ ప్రసాద్, మాచర్ల టౌన్, రూరల్ సిఐలు దిలీప్, సాంబశివరావులు గేటు తీయాలని సిబ్బందిని హెచ్చరించారు.

ఉద్రిక్తత

సాగర్ వద్ద బుధవారం ఉద్రిక్తత ఏర్పడింది. తెలంగాణ, ఆంధ్ర అదికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ముందు జాగ్రత్తగా పోలీసులు మోహరించారు.



వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

(రూలు 8వ ఫారం IV ప్రకారం)

ప్రజాశక్తి పత్రిక ప్రచురణ వివరాలు

1. ప్రచురణ స్థలం : విజయవాడ
2. ఏ రకమైన పత్రిక : దినపత్రిక
3. ముద్రాపకుని పేరు : పాటూరు రామయ్య
   చిరునామ : డోర్. నెం. 27-30-4, ఎమ్.బి.విజ్ఞానకేంద్రం. గవర్నరు పేట, విజయవాడ - 520002
4. ప్రచురణ కర్త పేరు : పాటూరు రామయ్య
   చిరునామ : డోర్. నెం. 27-30-4, ఎమ్.బి.విజ్ఞానకేంద్రం. గవర్నరు పేట, విజయవాడ - 520002
5. సంపాదకుని పేరు : పాటూరు రామయ్య
   చిరునామ : డోర్. నెం. 27-30-4, ఎమ్.బి.విజ్ఞానకేంద్రం. గవర్నరు పేట, విజయవాడ - 520002
6. పత్రిక యాజమాన్యం : ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రయివేట్ లిమిటెడ్, డోర్. నెం. 27-30-4, ఎమ్.బి.విజ్ఞాన కేంద్రం, గవర్నరు పేట, విజయవాడ - 520002

పాటూరు రామయ్య అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందు మూలముగా తెలియజేస్తున్నాను.

సం/-
పాటూరు రామయ్య
ప్రచురణ కర్త



మార్చిలో ఎండలు భగ భగ

విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

ఈ ఏడాది మార్చి నెలలో ఎండలు మండనున్నాయని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి మాసాంతంలో సూర్యుడు ఉత్తరం వైపు వస్తున్నందున పగటిపూట ఎండలు కాస్త ఎక్కువగానే ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి మాసాంతంలో కూడా సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు అధికంగానే రాయలసీమ, కోస్తా, తెలంగాణలో నమోదయ్యాయన్నారు. బుధవారం నాటికి రాయలసీమ జిల్లాల్లో 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు వెళ్లిపోయాయని తెలిపారు. తెలంగాణలో 38 ఉండగా, మిగతా ఆంధ్రప్రదేశ్, కోస్తా జిల్లాల్లో 37 డిగ్రీలు వరకూ నమోదయ్యాయని తెలిపారు.

టిఆర్‌ఎస్‌లో విలీనం ప్రసక్తే లేదు

పొత్తులుండొచ్చు

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- తెలంగాణ టిడిపిపై సమీక్ష



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వెనుకబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనపైనే ఉందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎల్ రమణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. చంద్రబాబు రాజకీయ జీవితం ప్రారంభమై 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో తెలంగాణలో పార్టీ పరిస్థితిని చంద్రబాబు సమీక్షించారు. ఇటీవల చేపట్టిన పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమంపై ఆరా తీశారు. టిఆర్‌ఎస్‌లో టిడిపిని విలీనం చేయాలంటూ మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో ప్రస్తావన రాగా, విలీనం ప్రసక్తే లేదని, రెండు రాష్ట్రాల్లోనూ టిడిపి ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే పొత్తులు ఉంటాయని సంకేతాలిచ్చారు. అనంతరం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో తాను ఎదుర్కొన్నన్ని సవాళ్లు, సంక్షోభాలు ఎవరూ ఎదుర్కోలేదన్నారు. అంకితభావంతో పని చేస్తే అవకాశాలు, విజయాలు వాటంతట అవే వస్తాయన్నారు. అభివృద్ధి దిశగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నామన్నారు. అభివృద్ధిపైనే పూర్తిగా దృష్టి పెట్టామన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ఏపి, తెలంగాణ రాష్ట్రాలు చర్చల ద్వారానే సమస్యల్ని పరిష్కరించుకోవాలన్నారు. అయితే కేంద్రం చేయాల్సిన పనులు వెంటనే చేయాలన్నారు. ఎన్‌టిఆర్ వల్లే ప్రపంచంలో తెలుగు ప్రజలకు గుర్తింపు వచ్చిందన్నారు. కాలేజీ రోజుల్లోనే సామాజిక న్యాయం కోసం పోరాడానని చంద్రబాబు తెలిపారు.

తెలంగాణ బాధ్యతల్ని జూనియర్ ఎన్టీఆర్‌కు అప్పగించాలి

తెలంగాణలో టిడిపి బాధ్యతల్ని జూనియర్ ఎన్టీఆర్‌కు అప్పగించాలని చంద్రబాబు ఎదుటే.. ఆ పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేస్తూ ఫ్ల కార్డులు ప్రదర్శించారు. తెలంగాణలో పార్టీని కాపాడడానికి బ్రహ్మణి, బాలక్రిష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌లలో ఎవరో ఒకరిని ఇక్కడికి పంపాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. దీంతో మీరే నాయకత్వం స్థాయికి ఎదగాలని, మా కుటుంబం నుంచి తెలంగాణకు ఎవరూ రారని, ఎవరొచ్చినా.. ఇక్కడ పార్టీకి నష్టం జరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో మరికొందరు కార్యకర్తలు జూనియర్‌కు బాధ్యతలు అప్పగించాలని ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

బిజెపి, టిఆర్‌ఎస్‌తో పొత్తులొద్దు

టిఆర్‌ఎస్‌లో టిడిపిని విలీనం చేస్తే తాను ఆత్మహత్య చేసుకుంటామని కరీంనగర్ కార్యకర్త ఒకరు హెచ్చరించారు. బిజెపి, టిఆర్‌ఎస్‌తో కూడా పొత్తు వద్దని నినాదాలు చేస్తున్న కార్యకర్తల్ని సముదాయిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ తెలంగాణలో ఉంటుందని ఆయన ప్రకటించారు.

ప్రజ్ఞ

నమూనాలు 7లో

1. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అవినీతి, పత్రిక స్వేచ్ఛకు సంబంధించి ప్రపంచ అవినీతి సూచీ 2017 భారత్ స్థానం ?
2. ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో ఏ విభాగంలో అరుణ రెడ్డి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది ?
3. మన రాష్ట్రంలో 'కియో మోటర్స్' ఫ్రేమ్‌వర్క్ ఇన్‌స్టలేషన్ విభాగాన్ని ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
4. వింటర్ ఒలంపిక్స్‌లో అత్యధికంగా 14 పతకాలు గెలిచి చరిత్ర సృష్టించిన వ్యక్తి ఎవరు?
5. ప్రపంచలోనే అత్యాధునిక హ్యూమనాయిడ్ రోబో'సోఫియా' సృష్టికర్త ఎవరు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే.. స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిఎఫ్ఎంఎస్ ద్వారానే లావాదేవీలు

- ఏప్రిల్ ఒకటి నుంచి అమలు
- రిసీట్ మాడ్యూల్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు
- లావాదేవీలు సరళతరమవుతాయని వెల్లడి
- దీనిపై ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే ఏప్రిల్ నుంచి అన్ని ఆర్థిక లావాదేవీలను సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ(సిఎఫ్ఎంఎస్) ద్వారానే అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీనికి సంబంధించిన రిసీట్ మాడ్యూల్‌ను ఆయన బుధవారం ఉండవల్లిలోని సందర్శకుల భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తిచేయాలని అధికారుల్ని ఆదేశించారు. గతంలో సంక్లిష్టంగా ఉన్న ఆర్థిక లావాదేవీలు ఇక నుంచి సరళీకృతమవుతాయని చంద్రబాబు అన్నారు. సిఎఫ్ఎంఎస్ విధానం వల్ల అన్ని శాఖల లావాదేవీలూ ఆన్‌లైన్‌లో అనుసంధానమవుతాయన్నారు. రిజర్వ్‌బ్యాంకుతోనూ ఆన్‌లైన్‌లోనే నిర్వహించుకోవచ్చునని పేర్కొన్నారు.

ఈ వ్యవస్థను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు పంచాయతీల్లో హాట్‌స్పాట్‌లను ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తామన్నారు. ప్రతి శాఖలో జరుగుతున్న ఆదాయ, వ్యయాల నిర్వహణను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశాలుంటాయని చంద్రబాబు చెప్పారు. కొత్త విధానంపై 300 ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, ప్రజల్లో కూడా దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. తాజాగా కేవలం రిసీట్లపైనా మాడ్యూల్ ప్రారంభించామని, త్వరలోనే ఖర్చులు, ఇతర రంగాలకు సంబంధించిన మాడ్యూళ్లను కూడా మార్చి నెలాఖరుకు అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఇటువంటి విధానాలు దేశానికే ఆదర్శప్రాయంగా ఉన్నాయన్నారు. ఇటీవల జపాన్ కూడా ఇక్కడి విధానాల్ని ప్రశంసించిందన్నారు.

సంతోషకరం

- మంత్రి యనమల రామకృష్ణుడు



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో ఆదాయాన్ని బట్టి వ్యయం ఉంటుందని, దీన్ని క్రమపద్ధతిలో నిర్వహించుకోవాలని సూచించారు. అప్పుడే ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు. సిఎఫ్ఎంఎస్ విధానం అమలులోకి రావడం సంతోషకరమ న్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జె.సత్యనారాయణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు. చివరిగా సిఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా వృత్తి పన్ను చెల్లింపు విధానాన్ని ప్రదర్శించారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

- 'సమ్మర్ వాటర్ రూం' ఏర్పాటు
- ఓవర్‌హెడ్ ట్యాంకులకు సెన్సార్లు
- మంత్రి నారా లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారుల్ని ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. తన కార్యాలయంలో 'సమ్మర్ వాటర్ రూం'ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను అంచనా వేసేందుకు ఓవర్ హెడ్ ట్యాంకులకు సెన్సార్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మినరల్ వాటర్, ప్యూరిఫైయర్స్ అవసరం లేకుండా కుళాయి నీటినే నేరుగా తాగేలా నాణ్యతతో అందించడమే వాటర్ గ్రిడ్ లక్ష్యమని, ఇందుకు అవసరమైన సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. ఫిర్యాదుల్ని రోజువారీ సమీక్షించాలని, వారానికోసారి తాను సమీక్షిస్తానన్నారు. జలవాణి కాల్ సెంటర్ 1800 425 1899 నెంబరుకు వచ్చే ఫిర్యాదులు, పత్రికలు, మీడియా కథనాలపై వెంటనే స్పందించాలని, యాక్షన్ టేకెన్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్వహణలో శ్యాండ్ ఫిల్టర్‌లు అవసరమున్న చోట్ల వెంటనే మార్చాలన్నారు. కుప్పం, ఉద్దానం ఎన్టీఆర్ సుజల క్లస్టర్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబువి చిత్తశుద్ధి లేని మాటలు

- హోదా వల్ల ఏం లాభమంటున్న బాబు
- టిడిపి, బిజెపిలతో విసుగెత్తిపోతున్న ప్రజలు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

'ప్రస్తుత నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక హోదా సమస్య అత్యంత ముఖ్యమైనది. ఇది ప్రజల డిమాండ్. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు చూస్తుంటే ఏ మాత్రమూ చిత్తశుద్ధి కానరావడం లేదు. మళ్లీ బిజెపి నాయకులతో ఆ పార్టీకి ఏం ఒప్పందం కుదిరిందో ఏమో.. హోదాకు టిడిపి కూడా మద్దతిస్తుందని ప్రకటించిన చంద్రబాబు తాజాగా హోదా వల్ల ఏం లాభమంటున్నాడు. చంద్రబాబు చిత్తశుద్ధి లేని మాటలతో, బిజెపి విధానాలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సాధన కోసం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాల ఆధ్వర్యాన మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మీడియాతో మాట్లాడారు. హోదా వల్ల లాభం లేకపోతే ఈశాన్య రాష్ట్రాలకు హోదా ఇవ్వడం వల్లే అక్కడ రాయితీలొస్తున్నాయని, మనకూ హోదా అవసరమని జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చంద్రబాబు నోట్ ఎందుకు ఇచ్చారో చెప్పాలని రాఘవులు డిమాండ్ చేశారు. రైల్వే జోన్ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అలక్ష్యం చేస్తున్నాయని, ఐదుగురు సభ్యులతో కమిటీ వేశారని, అయితే ఆ నివేదికను ఎందుకు అమలు చేయలేదని రాఘవులు ప్రశ్నించారు. మరొక కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందనీ, సమస్యను నాన్చడం తప్ప మరొకటి కాదనీ విమర్శించారు. రైల్వేజోన్‌పై కమిటీలంటూ, అడ్డుకున్నారంటూ 'బొంకులు' చెబుతున్న వీరు గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఎందుకు ఇవ్వడం లేదని, దీన్నెవరు అడ్డుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రైల్వేజోన్‌పైనా, గిరిజన విశ్వవిద్యాలయంపైనా వామపక్షాలు ఉద్యమాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.

ఇక్కడ సదస్సులు.. అక్కడ పరిశ్రమలు..

సిఐఐ పెట్టుబడుల పేరుతో విశాఖలో మూడు దఫాలుగా నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో కుదుర్చుకున్న ఎంఒయులు కొండెక్కాయని, ఏం పరిశ్రమలొచ్చాయో చెప్పాలని రాఘవులు ఎద్దేవా చేశారు. ఈ నిర్వహణ ఖర్చుతో వెనుకబడిన ప్రాంతాలు బాగుపడతాయన్నారు. విశాఖను ఇంకా బాగా అభివృద్ధి చేయొచ్చన్నారు. ఇక్కడ సదస్సుల్లో పాల్గొనడం, . తమిళనాడు, బెంగళూరుల్లో పరిశ్రమలు పెట్టడం ఇదే తంతు మూడేళ్లుగా జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదాపై నేడు గుంటూరులో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్యేక హోదా - విభజన చట్టంలోని హామీల అమలు కోసం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు గురువారం నిర్వహించనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ(యు) సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, పిడిఎస్‌యు తదితర పార్టీల నాయకులు పాల్గొంటారు. విభజన హామీలైన వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, రాజధానికి నిర్మాణం, కడపలో ఉక్కు కర్మాగారం, జాతీయ ప్రాజెక్ట్‌గా పేర్కొన్న పోలవ రానికి, జాతీయ సంస్థల ఏర్పాటుకు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రత్యేకహోదాపై సిఎం చంద్రబాబు భిన్నమైన ప్రకటనలు చేస్తుండటంపై మరింత గందరగోళం నెలకొంటోంది. హోదా వద్దు ప్రత్యేక ప్యాకేజీ ముద్దు అంటూ ప్రకటనలు చేయడం, ఆ తర్వాత బడ్జెట్‌లో నిధులు కేటా యించకపోవడంతో తిరిగి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించడం, తాజాగా ప్రత్యేక హోదాతో అన్ని వస్తాయనుకో వడం పొరపాటని వాఖ్యానించడంతో హోదా అంశం మళ్లీ ప్రజల్లో సెంటిమెంట్‌గా మారుతోంది.

3న ఢిల్లీకి వైసిపి ఎంపీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక హోదా ఉద్యమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉధృతం చేసింది. మార్చి 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు సిద్ధమవుతోంది. మార్చి 3న ఎంపీలు ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ప్రత్యేక హోదాపై పార్లమెంటులో స్పష్టత రాకపోతే రాజీనామాలు చేయాలని ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాదయాత్రలో ఉన్న వైఎస్ జగన్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర మార్చి 3 నాటికి దర్శి నియోజకవర్గం తాళ్లూరుకు చేరుకుంటుంది. దీంతో అక్కడి నుంచే వైఎస్ జగన్ ఎంపీల వాహనాలకు జెండా ఊపి ఢిల్లీకి పంపనున్నారు. ఎంపీలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పెద్దఎత్తున బయలుదేరి వెళ్లనున్నట్లు పార్టీ ప్రకటించింది. పార్లమెంటు రెండో విడత సమావేశాలు ప్రారంభమయ్యే రోజునే భారీ ధర్నా చేపట్టి, కేంద్రానికి తమ ఆంకాక్షను తెలియజేస్తామని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గురువారం కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కలెక్టరేట్ల ముందు పెద్దఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ప్రత్యేకం

ఇళ్ల పన్నులకు ఆన్‌లైన్ లేనట్టే!

- పాత విధానమే కొనసాగింపు
- అయినా ప్రారంభం కాని వసూళ్లు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులకు పాత విధానాన్నే ప్రభుత్వం కొనసాగిస్తోంది. గతేడాది పన్నుకు ఐదు శాతాన్ని పెంచి, ఈ ఏడాది ఇంటి పన్నును నిర్ణయించి వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 80 లక్షల ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఇంటి విస్తీర్ణం, ఇతర వివరాలు నమోదు చేస్తే పన్ను నిర్ణయించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో 99 శాతం ఇళ్ల వివరాలను పంచాయతీ సిబ్బంది సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు కొద్ది రోజుల కిందట వరకూ స్పష్టత ఇవ్వకపోవడంతో చాలా గ్రామాల్లో పన్నుల వసూలు ప్రారంభించలేదు. పాత విధానాన్నే కొనసాగించాలని ఆదేశించడంతో ఇంటి పన్ను డిమాండ్‌లను సిద్ధం చేసే ప్రక్రియను పంచాయతీ సిబ్బంది మొదలుపెట్టారు. మైనర్ పంచాయతీల్లో ఇంటిపన్ను డిమాండ్‌లు రూపొందించే కార్యక్రమం చివరి దశకు చేరుకోగా, మేజర్ పంచాయతీల్లో మాత్రం జాప్యం జరుగుతోంది. ఆన్‌లైన్‌లో అసెస్‌మెంట్ నెంబరు, యజమాని పేరు వంటి వివరాలు నమోదు చేయడానికి సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో రాత్రి వేళల్లోనూ కొన్ని పంచాయతీల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి ఏటా డిసెంబరు నుంచే పంచాయతీ సిబ్బంది ఇళ్ల పన్నులు వసూళ్లు ప్రారంభించేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి పూర్తయినా పన్నుల వసూళ్లు ప్రారంభించక పోవడంతో ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వసూళ్లు పూర్తి చేయడం సాధ్యం కాదని సిబ్బంది చెబుతున్నారు.

ఈ ఏడాది ఎన్నికలకు వెళ్ళే అవకాశము న్నందున ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో నూతన విధానాన్ని అమలు చేసేం దుకు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానాన్ని రోజు వారీ ఇళ్ల పన్నుల వసూళ్ల పర్యవేక్షణకు వినియోగించుకుం టున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.725 కోట్లు లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పన్నులు రూ.725 కోట్ల వరకు వసూలు కావొచ్చని అధికారులు చెబుతున్నారు. గతేడాది రూ.690 కోట్లు డిమాండ్ ఉందని, దీనికి ఐదు శాతం అదనంగా కలుపుకుని ఈ ఏడాది లక్ష్యాన్ని నిర్ధారించామన్నారు. పంచాయతీ ఆదాయ అవసరాలను బట్టి డ్రైయినేజి, లైటింగ్ ట్యాక్స్‌ను ఆయా జిల్లాల కలెక్టర్‌ల అనుమతితో ఇళ్ల పన్నుతో కలిపి వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు.

సంక్షిప్తం

విశ్వవిద్యాలయ పర్యవేక్షణాధికారి పదవీ విరమణ

అమరావతి బ్యూరో : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం గుంటూరులో పర్యవేక్షణాధికారిగా పనిచేస్తున్న పివిఎస్ఎం లక్ష్మి బుధవారం పదవీ విరమణ చేశారని పౌరసంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ టివి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని, వివిధ స్థాయిల్లో అంచెలంచెలుగా ఎదిగిన ఆమె సేవలను ఆయన కొనియాడారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో జాతీయ అవార్డు

అమరావతి బ్యూరో : నాణ్యమైన విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రాష్ట్రానికి మరో జాతీయ స్థాయి అవార్డు లభించింది. 4వ అటల్ శాస్త్ర, మార్కెనోమీ అవార్డు-2018 జాతీయ స్థాయి అవార్డుకు ఏపీ ఎంపికయ్యింది. ఫిబ్రవరి 18న ముంబైలో అవార్డుల ప్రదానం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో సిఎండి కె.విజయానంద్ హాజరు కాలేకపోయారు. నిర్వాహకులు పంపించిన అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిఎండి అందజేశారు.

ఎపికి రూ. 190 కోట్ల నాబార్డు రుణం

అమరావతి బ్యూరో : ఉద్యానవన శాఖ ద్వారా అమలు చేయబడుతున్న ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల ప్రాజెక్టు అమలుకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) ఎపికి గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి నుంచి రూ 190 కోట్ల రుణం మంజూరు చేసినట్లు ఎపి సిజిఎం కె సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు 60 వేల హెక్టార్లలో బిందు సేద్యం, స్ప్రింకర్ల ద్వారా నీటిపారుదల కోసం ఉద్దేశించినదని తెలిపారు. దీని వల్ల ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టికి చెందిన చిన్న, సన్నకారు రైతులు 33,400 మంది లబ్ధి పొందుతారని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పుగోదావరి)
రైలు కింద పడి ఓ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లికి చెందిన ఎస్.దేవదానం(18) పిఠాపురం ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువు తున్నాడు. పిఠాపురం గోర్స రైల్వే గేటు వద్ద తల, మొండెం వేర్వేరుగా పడివున్న అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని ఇంటర్ విద్యార్థులు నాగావళి నదిని దాటి మండల కేంద్రంలోని పరీక్షకు హాజరవుతున్న దృశ్యం

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - బెల్లంకొండ/తాడికొండ (గుంటూరు జిల్లా)
గుంటూరు జిల్లాలో ఇద్దరు రైతులు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఒకరు రైతు కాగా, మరొకరు కౌలు రైతు. బంధవులు, పోలీసుల కథనం మేరకు.. బెల్లంకొండ మండలం వెంకటాయపాలేనికి చెందిన మేళం శేషగిరిరావు(40)కు నాలుగెకరాల వరకూ పొలం ఉంది. దీంతో పాటు కొంత కౌలుకు సాగు చేశాడు. పంట దిగుబడి ఆశించినంత రాకపోవడంతో నష్టపోయాడు. ఈ క్రమంలో తాను సాగు చేస్తున్న మిర్చి పొలానికి నీరు పెట్టేందుకు బుధవారం తెల్లవారుజామున వెళ్లాడు. అనంతరం తొమ్మిది గంటలకు అతని భార్య అన్నం తీసుకుని పొలం వద్దకు వెళ్లింది. అప్పటికే శేషగిరిరావు నిశ్చేష్టుడై పని ఉన్నాడు. పక్కనే పురుగు మందు డబ్బా ఉంది. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

తాడికొండ మండలం కంతేరుకు చెందిన గిరిజన రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ముడావత్ శోభన్‌బాబునాయక్(32) రెండెకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. పంట దిగుబడి సరిగా లేక అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన భార్య పార్వతిభాయ్ స్థానికుల సాయంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందే క్రమంలో బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవ'సాయమేదీ'..?

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వేలాది దరఖాస్తులు
కొందరికే కేటాయించిన అధికారులు
అదనపు యూనిట్లపైనే అన్నదాతల ఆశలు



అనంతపురం జిల్లా కనేకల్‌లో వరి పంట పెట్టిన రైతు ట్రాన్స్‌ఫారమ్ లేకపోవటంతో డీజిల్ ఇంధనంతో మోటర్ నడుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి
ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతకు వ్యవ'సాయం' కరువైంది.. సర్కారు జాప్యం.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతన్నకు శాపంగా మారింది. కరువుకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లతో నీటి వనరులను వినియోగించుకుందామన్న వేలాది మంది రైతులకు ఎదురుచూపులు తప్పటం లేదు. అనంతపురం జిల్లావ్యాప్తంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు నిరాశే మిగిలింది. వరుస కరువులతో కుదేలయిన అన్నదాతకు ఈ ఏడాదిలో వర్షాలు బాగా కురవటంతో ఆశలు చిగురించాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరటంతో పంటలు వేయటానికి సిద్ధమయ్యారు. జిల్లాలో భూగర్భజలాలు పెరిగాయని, బోర్లు రీచార్జీ అయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 44,285 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 9,924 మంది సంబంధిత రుసుమును ప్రభుత్వానికి చెల్లించినా ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారులేమో ఈ ఏడాది 8,500 యూనిట్లు మంజూరయ్యాయని అందులో 7,887 మందికి యూనిట్ల కేటాయింపులు జరిగాయంటున్నారు. రాష్ట్ర వ్యాప్త ప్రక్రియలో భాగంగా అదనపు కేటాయింపులు కేటాయిస్తే మంజూరు చేస్తామని తమ చేతుల్లో ఏమి లేదని చెబుతున్నారు.



2009 నుండి 2018 జనవరి 31 వరకు 2,07,620 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,00,459 యూనిట్లు మాత్రమే మంజూరు చేశారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 64,773 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు 48,542 యూనిట్లు చేశారు. వీటిలోనూ నాలుగైదు ఏళ్ళుగా ఎదురుచూస్తున్న వారి సంఖ్యే అధికంగా ఉంది. దరఖాస్తు చేసుకున్న రైతులకు రెండు, మూడేళ్ల వరకు మంజూరు కాని పరిస్థితులు జిల్లాలో వున్నాయి. దీంతో వ్యవసాయానికి అనుగుణంగా ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందకపోవటంతో రైతు నష్టపోతున్నాడు. ఇప్పటి వరకు జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం అనంతపురం, గుత్తి, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం ఐదు డివిజన్ల పరిధిలో మొత్తంగా 44,285 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం డిడిలను చెల్లించిన రైతులు 9,924 మంది ఉన్నారు. వీరంతా దాదాపు రెండు నుండి నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నవారే. ఒక్కో రైతు 6 హెచ్‌పి నుండి 8 హెచ్‌పి వరకు యూనిట్‌కు రూ.6 నుండి రూ.30 వేల వరకు చెల్లించారు. ప్రభుత్వం కోటా మంజూరులో జాప్యం చేయటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కరువు ప్రాంత రైతులకు ప్రభుత్వం ఆదనపు కోటాను కేటాయించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేయాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా..



ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసి ఏడాదిన్నర కావస్తోంది. విద్యుత్ అధికారులు చెప్పినట్లు రూ.21 వేలు డిడి రూపంలో అందించాను. డిడి కట్టి ఐదు నెలలు కావస్తున్నా, అధికారులు మాత్రం అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం బోర్లు రీచార్జీ కావటంతో పంట వేద్దామనుకుంటే ఇలాంటి పరిస్థితులతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
- తిప్పేస్వామి, ఎంఎం హళ్ళి, కూడేరు మండలం

దరఖాస్తుదారులందరికీ ఇవ్వాలి



రైతు ప్రభుత్వంగా చెబుతున్న టిడిపి రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. జిల్లాపై కపట ప్రేమ మాని దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ ఇవ్వాలి. డిడిలు చెల్లించిన రైతులకు వెంటనే బిగించి వ్యవసాయానికి సాయం అందించాలి.
- చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి

సంవత్సరం	దరఖాస్తులు	కోటా	కేటాయింపు	పెండింగ్ (పాతవి కలిపి)
2014-15	10122	26400	7898	30278
2015-16	26119	15651	14054	42343
2016-17	18426	18600	18703	42066
2017-18	10106	8500	7887	4425

హాల్‌టికెట్ ఇవ్వలేదని చేయి కోసుకున్న విద్యార్థి

విశాఖలో 41 మందికి హాల్‌టికెట్లు నిలిపివేత
మంత్రి ఇంటి వద్ద నిరసనకు దిగిన విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం
ఇంటర్మీడియట్ పరీక్షలకు హాల్‌టికెట్ ఇవ్వలేదని విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన నాగు అనే విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తొలిరోజు బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష నిర్వహించగా విశాఖ నగర పరిధిలోని వివిధ ప్రభుత్వ కళాశాలలోని 40 మంది విద్యార్థులకు హాజరు తక్కువగా ఉందన్న కారణంతో హాల్‌టికెట్లు నిలిపేశారు. దీంతో వీరంతా పరీక్షలకు దూరమయ్యారు. వాస్తవానికి 60 శాతం హాజరు ఉంటే తప్ప హాల్‌టికెట్లు మంజూరు చేయరు. ఆర్ట్స్ గ్రూపునకు చెందిన విద్యార్థులు 60 శాతం కంటే తక్కువ హాజరున్నా రూ.1000 డిడి తీసుకుని వారికి హాల్‌టికెట్లు మంజూరు చేశారు. సైన్స్ గ్రూపునకు చెందిన విద్యార్థులకు 60 శాతం కంటే హాజరు తక్కువ ఉంటే హాల్‌టికెట్లు ఇవ్వకూడదన్న నిబంధనల మేరకు ఈ నలభై మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు నిలుపుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై విద్యాశాఖ విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలోనే విద్యాశాఖ నిర్లక్ష్యానికి తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పరీక్షలకు దూరమైన 40 మంది విద్యార్థులూ బుధవారం ఆర్ఐఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇందులో భాగంగానే ఒక విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం మంత్రి గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. తమకు వెంటనే హాల్‌టికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు చోడవరం మండలం వెంకన్నపాలేనికి చెందిన నంబారు గణేష్ అనే విద్యార్థి ఫీజు చెల్లించలేదని ఓ ప్రయివేటు కాలేజీ యాజమాన్యం హాల్‌టికెట్‌ను ఇవ్వలేదు. గుంటూరు జిల్లా బాపట్లలోని ఎస్.ఎ.డబ్ల్యూ.బి జూనియర్ కాలేజి పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న సంస్కృతం విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుపడ్డాడు. ఆ విద్యార్థిని డీబార్ చేసినట్లు అధికారులు తెలిపారు. తెనాలి బోస్ రోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలను మంత్రి గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో అరకొర వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్ఐఒ వరప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంచీలు మార్చాలని సిబ్బందిని ఆదేశించారు.విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని నాగావళి నది ఆవల గ్రామాల ఇంటర్ విద్యార్థులు నదిని దాటి వచ్చి మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల వద్ద రూమ్‌నెంబర్లు చూసుకునే బోర్డులను ప్రాంగణంలో కాకుండా గేటు బయట పెట్టడంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు.

37వ రోజుకు న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం
రాయలసీమలో శాశ్వత రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ సీమ న్యాయవాదుల జెఎసి, కడప బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు టి.సి.ఖాదరయ, ఎం.వేణుగోపాల్, ఎం.జగదీష్‌కుమార్ రాజు కూర్చున్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి అరుణకుమారి, జెఎసి నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు. కర్నూలులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో చేపట్టిన దీక్షలు 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు రాయలసీమ జెఎసి విద్యార్థి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు టి.షడ్రక్, జిల్లా పశ్చిమప్రాంత కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల దీక్షలను సందర్శించి మద్దతు తెలిపారు. అనంతపురం జిల్లాలోనూ న్యాయవాదుల దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కదిరి పట్టణంలో న్యాయవాదులు క్రిష్ణమూర్తి, పి.శశికాంత్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు ప్రకటించారు.

రాష్ట్రఅభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

వెనుకబడిన ప్రాంతాలను విస్మరించారు
బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి
రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సీమ సమస్యల పరిష్కార సంఘీభావ సమావేశాన్ని స్థానిక హరిత హోటల్‌లో నిర్వహించారు. రాయలసీమ నుంచి బిజెపి పార్టీ నాయకులు హాజరయ్యారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తప్పని సరిగా అధికార వికేంద్రీకరణ అవసరమన్నారు. రాయలసీమ జిల్లాలను ఎనిమిది జిల్లాలుగా విభజించాలని చెప్పారు. రాయలసీమ అత్యంత వెనుకబాటుకు గురైందన్నారు. దీనికి గత ప్రభుత్వాల నిర్లక్ష ధోరణే కారణమన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై తమ ప్రభుత్వానికి స్పష్టత ఉందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక హోదా ముందుకు తెచ్చి ఇతర అంశాలను మరుగున పెడుతోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సీమ నుంచి ఎంత మంది పాలకులు ఎన్నికైనా సీమకు ఒరిగిందేమీ లేదన్నారు. సీమలోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. సీమ అభివృద్ధిని విస్మరించడంలో అధికార ప్రతిపక్ష పార్టీల వైకరి దొందు దొందేనన్నారు. ముఖ్యమంత్రికి అమరావతి నిర్మాణం తప్ప వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమాభారతి, జాతీయ కార్యవర్గ సభ్యులు శాంతారెడ్డి, యువజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, మాజీ శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హరినాథరెడ్డి, పార్థసారథి కర్నూలు ఇంఛార్జి రామకృష్ణారెడ్డి లాయర్ల జెఎసి కన్వీనర్ మస్తాన్‌వలి పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఖైదీ పరారీ ఘటనలో ముగ్గురు వార్డెన్ల సస్పెన్షన్

ప్రజాశక్తి- చీపురుపల్లి (విజయనగరం జిల్లా)
అధికారుల కళ్లుగప్పి ఖైదీ పరారైన ఘటనలో ముగ్గురు వార్డెన్లను విజయనగరం జిల్లా సబ్‌జైలు అధికారి ఎస్.కిశోర్‌కుమార్ బుధవారం సస్పెండ్ చేశారు. ఆయన కథనం మేరకు.. విజయనగరం జిల్లా చీపురుపల్లి సబ్‌జైలు నుంచి గొల్లపల్లి గోవింద్ అనే ఖైదీ పాత నేరస్తుడిపై ఐదు చోరీ కేసులున్నాయి. ఫిబ్రవరి 20న ఒక కేసులో శ్రీకాకుళం జిల్లా పాలకొండ నుంచి తీసుకొచ్చి చీపురుపల్లి జైలులో ఉంచారు. మరో చోరీ కేసులో 26న గజపతినగరం కోర్టు ఏడాది పాటు జైలు శిక్షను విధించింది. అక్కడ నుంచి విశాఖపట్నం జైలుకు తీసుకెళ్లాల్సి ఉండగా, ఆ సమయంలో బస్సులు లేవని గార్డులు చెప్పడంతో చీపురుపల్లి సబ్ జైలులోనే గోవింద్‌ను ఉంచారు. ఆ జైల్లో ఏడుగురు ఖైదీలున్నారు. ఈ నెల 27న వీరంతా ఉదయం 8.30 గంటలకు కాలకృత్యాలు తీర్చుకుంటున్న సమయంలో గోవింద్ వరండా శుభ్రం చేస్తానని చెప్పి బకెట్‌తో నీరు పట్టుకొని వెళ్లాడు. వరండా పైభాగం పురాతన పెంకులతో ఉండడంతో పెంకులను తొలగించి అక్కడ నుంచి పరారయ్యాడు. ఇందులో జైలు సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఉంది. ఒక హెడ్‌వార్డర్ డ్యూటీకి వెళ్లలేదు. జైల్లో విధులు నిర్వహిస్తున్న మరో హెడ్‌వార్డెన్ డ్యూటీ దిగి వెళ్లిపోయాడు. సంఘటన సమయంలో ఇద్దరు వార్డెన్లు మాత్రమే ఉన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌వార్డెన్ బి.వెంకటరావు, వార్డెన్లు జె.ఎ.సూరిబాబు, బి.నర్సింహులును సస్పెండ్ చేశారు.

రూ.100 కోట్ల అక్రమ మైనింగ్

మంత్రి పత్తిపాటిపై మాజీ మంత్రి రావెల కిషోర్ ఆరోపణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
తన నియోజకవర్గంలో విచ్చలవిడిగా మైనింగ్ తవ్వకాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ రూ.100 కోట్ల మట్టిని అక్రమంగా తరలించారని మాజీ మంత్రి, పత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు ఆరోపించారు. గుంటూరు రూరల్ మండలం ఓబుల్ నాయుడు పాలెంలో అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి పుల్లా రావు అనుచరులు అశోక్ బృందం మైనింగ్ నిర్వహిస్తోందని తెలిపారు. అంతే గాక మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు కుమార్డు అనిల్ కూడా అక్రమ తవ్వకాలు చేశారని చెప్పారు. తన నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నేతల జోక్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ పోలీసు అధికారులు లంచాలకు లొంగిపోయారని చెప్పారు.. కొంత మంది దుర్బుద్ధి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు.

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్తుజా మృతి

పలువురి ప్రముఖుల సంతాపం



ప్రజాశక్తి - నంద్యాల
ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ముర్తుజా (76) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కర్నూలు జిల్లా నంద్యాల నేషనల్ కళాశాలలో విద్యార్థులకు పాఠం చెబుతున్న సమయంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలారు. పరిస్థితి గమనించిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యం వెంటనే పట్టణంలోని సురక్ష హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ముర్తుజా మృతి చెందినట్లు నిర్ధారించారు. ముర్తుజా మృతదేహాన్ని నంద్యాల సలీంనగర్‌లోని ఆయన స్వగృహా నికి తరలించారు. ముర్తుజాకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. రచయితగా, ఉపాధ్యాయుడిగా, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నంద్యాల ప్రజలకే కాక ఆయన రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితుడు. ముర్తుజా మరణవార్త తెలిసిన పట్టణంలోని విద్యావేత్తలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున ఆయన స్వగృహానికి తరలివచ్చి పార్థివ దేహాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, కర్నూలు జిల్లా తూర్పు ప్రాంత జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహమ్మద్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ న్యాయవాది బి.శంకరయ్య, ప్రజాసంఘాల నాయకులు తదితరులు సందర్శించారు.

ముర్తుజా మృతి తీరని లోటు : ఎంఎ గఫూర్

ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ ఎండి ముర్తుజా మృతి ఆవాజ్ కమిటీకి తీరని లోటన్నారు. ఆవాజ్ అభివృద్ధికి, రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేసిన సేవలు మరువరానివన్నారు. ప్రపంచ హిందీ మహాసభల్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా ముర్తుజా పాల్గొన్నారన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

టిడిపి పాలనలో అత్యాచారాలు,వేధింపులు : రమాదేవి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ
రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై వివిధ రూపాలలో అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. బుధవారం విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. అశ్లీల సినిమాలు, వెబ్‌సైట్‌ల వల్ల యువత హింస వైపు మళ్లుతున్నారన్నారు. దీనివల్ల సమాజంలో హింస పెరుగుతుందన్నారు. హింసకు ప్రధానం మద్యమని పేర్కొన్నారు. దీనిని ఏరులై పారిస్తున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. పని ప్రాంతంలో మహిళలకు ఎలాంటి రక్షణ ఉండటం లేదన్నారు. బ్రాండిక్స్‌లో దళిత మహిళలపై జరిగిన అత్యాచారమే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. 20వేల మందికి పైగా పని చేస్తున్న బ్రాండిక్స్‌లో మహిళల కోసం రక్షణ సెల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులు అరికట్టడానికి మీడియా మానిటరింగ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. బ్రాండిక్స్ షోర్ టు షోర్ కంపెనీలో అత్యాచారానికి గురైన మహిళకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.ద్రాక్షాయణి, నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి పాల్గొన్నారు.

సదస్సు

ముగిసిన వ్యవసాయ జాతీయ సదస్సు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పరిశోధనలు

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)
వ్యవసాయంలో యాంత్రీకరణను జోడించి హరిత విప్లవానికి నాంది పలికితేనే రానున్న తరాలకు ఆహార సమస్యను తీర్చగలమని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణా విభాగాధిపతి డాక్టర్ కె.రాజారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా బాపట్లలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు, యాంత్రీకరణ ఎక్స్‌పో-2018 బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సాగులో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింత సులువు, లాభసాటిగా మార్చే పరిశోధనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యంత్రాల ప్రదర్శనలో భాగంగా వాటిపై రైతులకు వివరించారు.



గుంటూరు జిల్లా బాపట్లలో యంత్రాల స్టాళ్లను సందర్శిస్తున్న డాక్టర్ కె.రాజారెడ్డి

యంత్రాల స్టాళ్లలో ఉత్తమ స్టాల్‌గా ఎంఎస్ టాఫే యాన్‌మార్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్ ఎంపికైంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.మణి, డీన్ డాక్టర్ డి.భాస్కరరావు, విశ్వవిద్యాలయ యాంత్రీకరణ అధిపతి సి.రమణ, ఆహార కళాశాల ప్రిన్సిపల్ డి.విష్ణుశంకరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుబోల్తా - ఒకరు మృతి

ప్రజాశక్తి ప్యాపిలి
కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం పొదొడ్డి సమీపంలో బుధవారం తెల్లవారుజామున వీరా ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో 10 మంది ప్రయాణీకులు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... వీర ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్‌కోచ్ ఎఆర్01పి 5445 నంబర్‌గల బస్సు హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తుండగా ప్యాపిలి మండలం పొదొడ్డి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. బెంగళూరుకు చెందిన ఆదిత్య (27)కు తీవ్రగాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంగమాంబ స్టోన్ క్రషర్‌లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్ (విశాఖ)
విశాఖ జిల్లా అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం గ్రామంలో ఉన్న వెంగమాంబ స్టోన్స్ క్రషర్స్‌లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వెంగమాంబ క్రషర్స్‌పై ఫిర్యాదులు రావడంతో ఈ దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ ఎడి శ్యామ్యూల్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తనిఖీల్లో యజమాన్యం సర్వే నెంబర్లు మార్చి అక్రమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రికార్డులను పరిశీలించిన నేపథ్యంలో 591 సర్వీసు నెంబరు మీద విద్యుత్‌ను అక్రమంగా వాడుకున్నట్లు తనిఖీల్లో తేలిందన్నారు. యాజమాన్యాన్ని అక్రమ వ్యాపారం, విద్యుత్ చౌర్యంపై ప్రశ్నించామని వారి జవాబులను రికార్డ్ చేశామని చెప్పారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నామని వాటిని పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

వైసిపి నాయకుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-తాడిపత్రి
అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్తంగా మారింది. మంగళవారం రాత్రి వైసిపి కౌన్సిలర్ గయాజ్‌బాషా(మున్నా)పై హత్యాయత్నం జరగడంతో ఆందోళనలు మొదలయ్యాయి. పాతకక్షల నేపథ్యంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఖాదర్ తన అనుచరులతో కలిసి మున్నాపై మంగళ వారం అర్ధరాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ దాడిపై వైసిపి నాయకులు రాత్రి నుంచే పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మున్నాపై దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఒఎస్‌డి ఐశ్వర్య రస్తోగిని కలిసి వినతిపత్రం అందజేశారు. తాడిపత్రిలో జరిగిన పరిణామాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జివిజి.అశోక్‌కుమార్ నేతృత్వంలో అదనపు బలగాలను మోహరించారు.

సంపాదకీయం

దొంగల నోట నీతి సూక్తులు

విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ కుంభకోణాల నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలంటూ కొద్దిరోజులుగా కార్పొరేట్ శక్తులు చేస్తున్న చర్చ విస్మయం కలిగిస్తోంది. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, సామాన్యులకు అండగా నిలిచిన జాతీయ బ్యాంకులను లూటీ చేయడంలో పాత్రధారులుగా వ్యవహరించిన వారే తాజా చర్చకు సూత్ర ధారులు కావడం కలవరపరిచే పరిణామం. బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభం ముంగిట నిలిపిన ఈ ఆర్థిక నేరాలన్నీ కార్పొరేట్ సంస్థల నిర్వాక ఫలితమే! సొంత లాభాల కోసం ఎంతకైనా తెగించే కార్పొరేట్ యాజమాన్యాలు నిస్సిగ్గుగా ఆ దోపిడికి పాల్పడ్డాయి. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దిగమింగాయి. జాతి కష్టార్జితాన్ని స్వాహా చేసిన ఈ ఘరానా దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిన పాలకవర్గాలు వారి అడుగులకు మడుగులొత్తాయి. విదేశాలకు సాగనంపి స్వామిభక్తిని చాటుకున్నాయి. జాతి సంపదను కొల్లగొడుతున్న ఈ వ్యాపార, పాలకవర్గ కుట్రను ఎత్తి చూపడానికి బదులుగా కార్పొరేట్ మీడియా తప్పంతా ప్రభుత్వ రంగ బ్యాంకులదే అన్నట్టు, ప్రైవేటీకరణతోనే ఈ సమస్య పరిష్కారమౌతుందన్నట్టు కథనాలు వండి వారుస్తున్న తీరు దుర్మార్గం.

ప్రైవేటీకరణ వాదన చేస్తున్న వారు, దానిని సమర్థిస్తున్న వారు ఉద్దేశ్యపూర్వకంగానే కొన్ని వాస్తవాలను దాచిపెడుతున్నారు. వీటిలో కీలకమైనది ప్రైవేటు రంగానికి జాతి హితం పట్టదన్నది! ఒకప్పుడు ప్రైవేటు యాజమాన్యాలు చేసిన సహాయనిరాకరణ కారణంగానే బ్యాంకుల జాతీయకరణ అంశం ముందుకు వచ్చింది. ఆ తరువాత దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహించిన పాత్ర విస్మరించలేనిది. మారుమూల గ్రామాల్లో బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయడం నుండి, రైతులు, నిరుద్యోగులు, ఇతర అణగారిన వర్గాలకు రుణాలు ఇవ్వడం వరకు జాతీయ బ్యాంకులు కీలక పాత్ర పోషించాయి. అంతెందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున చేపట్టిన జన్‌ధన్ ఖాతాల ఏర్పాటులో కూడా వీటిదే పైచేయి. ప్రైవేటు బ్యాంకులు ఇది తమ పని కాదన్నట్లు వ్యవహరించాయి. ఈ ఒక్క ఉదాహరణే చాలు దేశ ప్రజలకు ఉపయోగపడేవి ఏవో తేల్చుకోవడానికి! ఇక ప్రభుత్వ రంగమంతా అవినీతిమయమంటూ చేస్తున్న ప్రచారం వాస్తవాలను తలకిందులుగా చూపడమే! లాభాలను పెంచుకోవడమే పరమావధిగా భావించే కార్పొరేట్ శక్తులు అవినీతిని పెంచి పోషిస్తాయి. చట్టాలను, నిబంధనలను ఉల్లంఘిస్తాయి. పాలకవర్గాల అండదండలతో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు, ఇతరులనూ ప్రలోభపరుస్తాయి. ఇక ప్రైవేటు రంగంలో పరిపాలనా విధానాలు బ్రహ్మాండంగా ఉంటాయని వాదించే వారు పాలనా విధానాలు అంత గొప్పగా ఉంటే దివాళా ఎందుకు తీస్తున్నాయని, అప్పులు ఎందుకు ఎగవేస్తున్నాయంటూ ఎస్‌బిఐ చీఫ్ రజ్నీష్‌కుమార్ వేసిన ప్రశ్నలకు జవాబియ్యాల్సివుంది. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రైవేటోళ్లవేనని, ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టలేదంటూ ఆయన చెప్పిన వాస్తవాలను విస్మరించలేం.

దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత చోటుచేసుకున్న కుంభకోణాలన్నింటిలోనూ కనిపించేది వ్యాపార, పాలకవర్గాల మధ్య పెరుగుతున్న అనైతిక మైత్రే! కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రారంభమైన ఈ పరంపర నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రస్తుత బిజెపి ప్రభుత్వ హయంలో పతాకస్థాయికి చేరిందనడంలో సందేహం అక్కర్లేదు. అస్మదీయులకు ఉన్నదంతా దోచిపెట్టి, వారికి అన్ని విధాల రక్షణ కల్పించే ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ విశృంఖలత కారణంగానే అన్ని వ్యవస్థలూ పతనావస్థకు చేరుతున్నాయన్నది నిర్వివాదాంశం. ప్రభుత్వ రంగ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసిన విజయమాల్యా, నీరవ్‌మోడీలు నిరభ్యంతరంగా విదేశాలకు వెళ్లిపోవడానికీ, ఆ తరువాత కూడా ఒకదాని వెంట మరోకటిగా వెలుగులోకి వస్తున్న బ్యాంకింగ్ అక్రమాలకూ ఈ విధానాలే కారణం. దోషులను వదిలిపెట్టి, బ్యాంకుల ఆడిటర్లు, నియంత్రణ వ్యవస్థలదే తప్పని సాక్షాత్తు దేశ ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పడం అసలు విషయాన్ని పక్కదోవ పట్టించడమే! త్వరలో జరగనున్న ఎన్నికల్లో కార్పొరేట్ల కరుణా కటాక్షాల కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బ్యాంకు కుంభకోణాలపై పెదవి విప్పడంలేదన్న ఆరోపణలనూ తోసివేయలేం.

దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తూ, సామాన్యులకు అండగా ఉంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవడం అందరి బాధ్యత! దేశాన్ని దర్జాగా దోచుకుతింటున్న దొంగల నోటివెంట వస్తున్న నీతి సూక్తుల్లోని అసలు విషయాన్ని ప్రజానీకానికి చేరవేయడానికి మేధావులు నడుంబిగించాలి. వాస్తవాలను వివరించి ప్రజలను చైతన్యపరచాలి. అభూత కల్పనలు, అసత్యాలతో సాగుతున్న గోబెల్స్ ప్రచారాన్ని నిలువరించడం కోసం అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులు కదలాలి.

ఇదీ విషయం



అతిలోక స్వాప్నికకు
అనివార్యపు వీడ్కోలు...
ఆరాధ్యపు హృదయాల్లో
ఆగనంటూ కన్నీళ్లు!

వెండి వెలుగు తారలకి
తెర వెనుక కథలెన్నో...
రంగుల చీకటి ఒడిలో
కానరాని వ్యథలెన్నో!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

రాయలసీమపై బిజెపి కపట ప్రేమ



వి రాంభూపాల్

'తమలపాకుతో తానొకటంటే తలుపు చెక్కతో నేనొకటిస్తి' అన్నట్లుగా టిడిపి, బిజెపిల మాటలు వున్నాయి. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చట్టంలో చెప్పినవి కూడా ఇవ్వలేదని, ఇంకెప్పుడు ఇస్తారని? టిడిపి అంటోంది. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో రాయలసీమలో రెండో రాజధాని, హైకోర్టు, సచివాలయం ఏర్పాటు చేయాలని కాషాయ దళపతులు మరోసారి కపట ప్రేమను ఒలకబోస్తున్నారు. వారు ఇంకో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలో అవినీతి ఏరులై పారుతుందన్నారు (ఈ ప్రభుత్వంలో వీరు కూడ 'భాగస్వాములే' కదా!). తెలుగు తమ్ముళ్లు మాత్రం తక్కువ తిన్నారా 'బిజెపికి చిత్తశుద్ధి వుంటే రాయలసీమలో సుప్రీంకోర్టు బెంచ్‌ను' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీరి మాటల యుద్ధాలతో రాయలసీమ వెనుకబాటు మరోసారి రాజకీయ చర్చగా మారింది.

'ఐదు, పది, పదిహేను' ఇలా సంతల్లో రేట్లు పెంచినట్లు హోదా వయసు గురించి మాట్లాడిన పెద్ద మనుషులే హోదా కాదు ప్యాకేజీ అన్నారు. హోదా అంటే జైల్లో పెడతామన్నారు. హోదా సంజీవనా? అన్నారు. ప్యాకేజీ కాదు దానికి సమానమైన నిధులన్నారు. అంతెందుకు నాకంటే నిధులు సాధించిన మొనగాడు ఎవరు? అంటూ బస్తీమే సవాలు అన్నారు. పై అన్ని సందర్భాల్లోనూ ఏపి ప్రజలు మౌనంగానే వున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తరువాత ఆంధ్రాకు ఇంకెన్నాళ్లు అన్యాయం చేస్తారని వామపక్షాలు గళం పెంచాయి. ఫిబ్రవరి 8న బంద్‌కు పిలుపు ఇచ్చాయి. దీంతో రాజకీయాల్లో నెలకొన్న నిశ్శబ్దం బద్దలైంది. సకలాంధ్ర జనం కదిలారు. పాపాల పాలకులను ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధే నేటి అజెండా అయింది.

అంతా చేశాం, చెప్పిందే కాదు చెప్పనిది కూడ చేశామని బిజెపి, ఎంత ప్రాధేయపడినా కొసరు మెతుకులే కాని అన్నం పెట్టలేదని టిడిపి, హోదా ఇస్తే బిజెపికి మద్దతు ఇస్తామంటూ వైసిపి, నిజనిర్ధారణ చేస్తామంటూ జనసేన రాగయుక్తంగా గానం చేస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోని బిజెపి నాయకులంతా కట్టగట్టుకొని కర్నూలులో సమావేశమై రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. గాఢనిద్రలో నుండి తత్తరపాటుగా లేచినట్లు రాయలసీమ అభివృద్ధికి అనేక అంశాలు ప్రకటించారు. దాదాపు నాలుగు సంవత్సరాలు కేంద్రంలో సంపూర్ణ అధికారాన్ని అనుభవిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా వుంటున్న బిజెపికి రాయలసీమ మీద ఇంత ఘాటు ప్రేమ కలగడానికి అసలు కారణాలు తెలియని అమాయకులు కాదు సీమ ప్రజలు.

సీమకు బిజెపి తీరని ద్రోహం

చేస్తున్న రాయలసీమ అభివృద్ధి గురించి డిక్లరేషన్ ప్రచారం చేసుకునేముందు కొన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. 1.వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇస్తామన్న విభజన చట్టంలో వున్న బుందేల్‌ఖండ్, కెబికె ప్యాకేజీ ఇప్పటికీ ఎందుకు అమలు కాలేదు? 2.వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించిన 50 కోట్లను (ఏడాదికి) రెండేళ్లు మాత్రమే ఇచ్చి ఎందుకు నిలిపేశారు? 3.కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపన ఎందుకు చేయలేదు? దేశంలో ఏ పరిశ్రమ కోసం చేయనన్ని విచారణలు కడప ఉక్కు పరిశ్రమకే ఎందుకు చేస్తున్నారు? 4.అనంతపురం జిల్లాలో సెంట్రల్ అకాడమి కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ సంస్థ కోసం కేంద్ర ఆర్థికమంత్రి, 'బెల్' సంస్థ ఏర్పాటు కోసం కేంద్ర రక్షణ శాఖా మంత్రులు శంకుస్థాపనలు చేశారు. అయితే ఇప్పటి వరకు పనులు ఎందుకు ప్రారంభించలేదు? 5.సెంట్రల్ యూనివర్సిటీ కోసం అనంతపురం జిల్లాలో 497 ఎకరాల భూమిని 2015లోనే సేకరించారు. కానీ ఇప్పటి వరకు శంకుస్థాపన కూడ ఎందుకు చేయలేదు? 6.కర్నూలులో రైల్వే వాగిన్ నిర్మిత పరిశ్రమ హామీ ఏమైంది? 7.హంద్రినీవా ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించ లేదు? 8.స్థానిక యువతకు ఉపాధి చూపే ఒక్క కేంద్ర ప్రభుత్వ పరిశ్రమనైనా ఈ నాలుగేళ్లలో ఒక్కటైనా రాయలసీమ జిల్లాల్లో ఎందుకు ఏర్పాటు చేయలేదు? 9.రాయలసీమలో వలసల నివారణకు, వ్యవసాయ కూలీలు తమ ప్రాణాలను నిలుపుకునేందుకు వున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏడాదీ నిధులు ఎందుకు తగ్గిస్తూ వచ్చారు? ఒక్క అనంతపురం జిల్లాలోనే కూలీలు చేసిన పనులకు గతేడాది వంద కోట్లకు పైగా ఆరు నెలలు బిల్లులు పెండింగ్‌లో ఎందుకు పెట్టారు? 10.నిత్య కరువు కోరల్లో చిక్కుకున్న రాయలసీమ రైతన్నలు పండించిన ఏ పంటకైనా గిట్టుబాటు ధర ఎందుకు రాలేదు? కష్టపడి టమోటా పండిస్తే కిలో పావలా? వేరుశెనగ విత్తనాలు రైతు కొన్నపుడు ప్రభుత్వం నిర్ణయించిన ధర క్వింటాలు రూ.7,700. అదే అమ్మినప్పుడు నాలుగు వేల రూపాయలే! అలాగే పప్పుశెనగ, రైతు కొన్నపుడు ప్రభుత్వ ధర రూ.8.021, రైతు అమ్మినపుడు మాత్రం రూ.3,500 ఎందుకు వుంది? బిజెపి, టిడిపి ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రకటించుకున్న ఒకటిన్నర రెట్ల గిట్టుబాటు ధర రాయలసీమ రైతులకు వర్తించదా!

రాయలసీమకు కావలసింది రాజకీయ డిక్లరేషన్లు కాదు. సాగు భూమిలో కనీసం పది శాతం భూమికి ఒక్క పంటకు కూడ సాగు జలాలు అందని దుర్భర స్థితి నుండి... ఏడాదికి మూడు పంటలు కాదు మూడు సంవత్సరాలకు ఒక్క పంట కూడా పండని దయనీయ స్థితి నుండి... సంవత్సరానికి కనిష్టంగా పది లక్షల మంది వలసలు వెళ్లే దీనస్థితి నుండి... శరీరాలు అమ్ముకుంటే తప్ప కుటుంబాన్ని పోషించుకోలేని తల్లుల, అక్కచెల్లెళ్ల దీనావస్థ నుండి... తిరుపతి కాశీ దారం కంటే తేలికగా రైతన్నల మెడలకు వేలాడే ఉరి తాళ్ల బంధనాల నుండి శాశ్వత విముక్తి కావాలి.

ఇలా అనేక ప్రశ్నలకు రాయలసీమ ప్రజలకు బిజెపి సమాధానం చెప్పాలి. గురువింద గింజ తన కింది నలుపు ఎరగదన్నట్లు ప్రవర్తిస్తే ప్రజలు నమ్మరు. రాయలసీమను దత్తత తీసుకుంటామన్నారు. చిన్న సభ జరిగినా ఢిల్లీ మొదలుకొని నాగపూర్ వరకు అనేక మంది బిజెపి అగ్ర నాయకులు రాయలసీమ వస్తున్నారు. ఈ ప్రాంతం గురించి పదే పదే సినిమా కన్నీరు కార్చినంత మాత్రాన రాయలసీమ అభివృద్ధి అవుతుందా! రాయలసీమకు కావలసింది రాజకీయ డిక్లరేషన్లు కాదు. సాగు భూమిలో కనీసం పది శాతం భూమికి ఒక్క పంటకు కూడ సాగు జలాలు అందని దుర్భర స్థితి నుండి, ఏడాదికి మూడు పంటలు కాదు మూడు సంవత్సరాలకు ఒక్క పంట కూడా పండని దయనీయ స్థితి నుండి, సంవత్సరానికి కనిష్టంగా పది లక్షల మంది వలసలు వెళ్లే దీనస్థితి నుండి, శరీరాలు అమ్ముకుంటే తప్ప కుటుంబాన్ని పోషించుకోలేని తల్లుల, అక్కచెల్లెళ్ల దీనావస్థ నుండి, తిరుపతి కాశీ దారం కంటే తేలికగా రైతన్నల మెడలకు వేలాడే ఉరి తాళ్ల బంధనాల నుండి శాశ్వత విముక్తి కలగాలి. ఒక్క ఎకరం భూమి లేని 63 శాతం దళితులు, గిరజనులు గౌరవంగా బతకాలి. క్షీణిస్తున్న చేతి వృత్తులు బతకాలి. భూములకు నీరు, పంటలకు గిట్టుబాటు ధరలు, పిల్లలకు ఉపాధి చూపే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, దళిత, గిరిజనుల్లో ఒక్కో కుటుంబానికి కనీసం మూడు ఎకరాల సాగు భూమి, గ్రామీణ ప్రాంతంతో పాటు, పట్టణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పనులు, ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్య, వైద్యం కావాలి. తక్షణం బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజి, రాయలసీమ జిల్లాల్లో శంకుస్థాపన చేసిన, హామీ ఇచ్చిన పరిశ్రమలు, సంస్థల సాధన కోసం పోరాటాలు ఉధృతం చేయడం అందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడమే రాయలసీమకు రక్ష.

(రచయిత సిపిఎం అనంతపురం (ఉత్తరప్రాంతం) జిల్లా కార్యదర్శి)



చర్చ

అతిశయోక్తుల సంత అమలు ఆవగింజంత

ఎన్.మధుసూదనరావు



భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా విశాఖలో మూడు దఫాలుగా నిర్వహిస్తోన్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులు అతిశయోక్తుల సంతల్లా మారాయి. 2016 నుండి 2018 నాటికి మూడు పారిశ్రామిక సదస్సులు నిర్వహించారు. అయితే సాధారణంగా గ్రామసీమల్లో జరిగే సంతల్లో వస్తువులు, సరకుల మార్పిడిలోనైనా ఎలాంటి దాపరికాల్లేని వ్యవహారాలను మనం చూస్తాం. కానీ సిఐఐ సదస్సుల్లో జరిగే మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్స్ (ఎంఓయూ)లన్నీ ఛూ మంత్రకాళీ అన్నట్లుగా మాయాలోకంలో విహరించేలా ఆహుతులకు భ్రమలు గొల్పుతాయని రూఢి అయ్యింది. ఎవరేం తెస్తారు? ఏ ప్రాంతాలకు ఏం ఇస్తారు? నిజంగా ప్రజలకు ఒనగూడే ప్రయోజనాలేంటి? ప్రభుత్వానికి జరిగే మేలేంటి? వంటివి మూడు సదస్సులు జరిగినా సమాధానాలు దొరకని ప్రశ్నలుగానే మిగిలాయి.

రాష్ట్రాన్ని నవ్యాంధ్రవైపు పరుగులు పెట్టించేందుకు రోజుకు 24 గంటల చొప్పున వారానికి 7 రోజులూ నిరంతరమూ శ్రమించే నిత్య పనిమంతునిగా, కార్యశీలిగా పారిశ్రామికవేత్తలకు అత్యంత ఇష్టుడిగా చంద్రబాబు అనుకూల మీడియాలో ప్రచారం చేస్తుంటారు. మహా విశాఖ నగరం (గ్రేటర్ విశాఖ)ను రాష్ట్ర ముఖ్యమంత్రి, 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు ఎన్.చంద్రబాబు నాయుడు వేదికగా చేసుకుని పలు సదస్సులు, జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చేందుకు విశాఖను ఎంపిక చేసుకోవడంలో ఆంతర్యం చాలానే ఉంది.

ప్రపంచంలోని పెద్ద నగరాల్లో సైతం ఈ స్థాయిలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించడం సాధ్యం కాదంటూ గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గం, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఊదరగొడుతున్నారు. రూ. లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు, వేల ఎంఓయూలు అంటున్నా గణాంకాలను పరిశీలిస్తే వాస్తవం బోధపడుతుంది. మూడు సార్లు జరిగిన సిఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుల్లో బ్యూరోక్రాట్లకు గాక, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులకు, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు గాకుండా సూటు, బూటు వేసుకొచ్చిన వారికి పెద్దపీట వేయడం చంద్రబాబు 'ఈవెంట్ మేనేజ్‌మెంట్' ప్రత్యేకతగా నిలిచింది.

కుదిరిన ఎంఓయూలు, పెట్టుబడులు (రూ.లక్షల కోట్లలో)

సంవత్సరం	ఎంఓయూలు	పెట్టుబడులు	ఉద్యోగాలు
2016	368	రూ.4,67,577	9,58,896
2017	665	రూ.10,54,590	22,34,096
2018	734	రూ.4,39,765	11,02,125

బలమా? వాపా?

సిఎం చంద్రబాబు చెబుతోన్న ప్రకారం సిఐఐ సదస్సుల సందర్భంగా జరిగిన ఎంఓయూలు ప్రపంచంలో ఎక్కడైనా 15 నుంచి 20 శాతం లోపే సాకారమవుతాయని, ఏపిలో గత రెండు దఫాల్లో 40 నుంచి 55 శాతం ఆచరణలోకొచ్చాయని వెల్లడించారు. విశాఖ కేంద్రంగా జరిగిన మూడురోజుల సదస్సుల్లో రూ.లక్షల కోట్ల విలువైన ఎంఓయూల ప్రచారం అంతా 'ఒక బూస్టప్'గానే ఉంది తప్ప సాకారం అయ్యే సూచనలు కనిపించడం లేదు. గత సిఐఐల సందర్భంగా ఇండస్ట్రీ, ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్‌ల్లో రూ.లక్షల కోట్ల ఎంఓయూలు జరిగినా వందల కోట్లు కూడా సాకారం కాలేదన్నది స్పష్టంగా రూఢి అయింది. 'గత రెండు (2016, 2017) సిఐఐల్లో లక్ష్యాలు, అమలు చూస్తే... 1033 ఎంఓయూలు జరిగితే, రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, 31 లక్షల ఉద్యోగాలు రావాలి. లెక్కలు వేస్తే కేవలం రూ.4 లక్షల 20 వేల కోట్ల పెట్టుబడులు, 2.6 లక్షల ఉద్యోగాలు వచ్చాయి...' అని విశాఖలో ఫిబ్రవరి 26న సిఐఐ ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబే స్వయంగా ప్రకటించడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది.

పెట్టుబడిదార్లకు ప్రజా సంపద!

ఎంఓయూలు కుదుర్చుకున్న పెద్ద కంపెనీలు ఆదానీ గ్రూప్, రిలయెన్స్, టెక్ మహేంద్ర, వేదాంత తాజాగా ఈ జాబితాలో చేరిన కేరళకు చెందిన లూలూ గ్రూపు మాత్రమే చెప్పుకోదగినవి. వీటికి ఇప్పటికే ప్రభుత్వం 'ఎర'లు వేసింది. లూలూకు ఇటీవలే విశాఖ నగరం నడిబొడ్డున గల రూ.600 కోట్ల విలువైన 19 ఎకరాలను ధారాదత్తం చేసింది. ఉడా పరిధిలో ఉండే ఈ భూమిపై ప్రభుత్వం ఏకపక్షంగా చంద్రబాబే నిర్ణయం తీసుకోవడం పాలనా విరుద్ధమైన అంశంగా ప్రజలు, మేధావులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మిగతా బడా కంపెనీలు, వ్యక్తులతో కుదుర్చుకున్న ఎంఓయూలకు పరిహారంగా విశాఖ సాగర తీరాన్ని, కొండలను, మైనింగ్ స్థలాలను, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడతాడన్న కథనాలు వెలువడుతున్నాయి. విశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసే డిసిఐని కేంద్ర కేబినెట్ అమ్మివేయాలని నిర్ణయించినా, స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం డిజిన్వెస్ట్ చేయాలని బిజెపి భావించినా బాబు నోట మాట రాకపోవడంపై విశాఖ కార్మికవర్గం తీవ్ర ఆవేదనకు గురౌతోంది. ఇలా కార్పొరేట్లకు బాటలేస్తూ వారికి ఊడిగం చేసిన లక్ష్యాలే బాబు విధానాల్లో కనిపిస్తున్నాయి తప్ప 'సుపరిపాలన' మచ్చుకైనా లేదు.

ఎన్నికల కోసం 'రాజకీయం'...

2019 సంవత్సరంలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచారార్భాటం కోసం ఈ సిఐఐ సదస్సులను కేంద్రంగా చేసుకున్నా సరే... 'బాబుకు ఆశ లావు..పీక సన్నం' అనే చర్చలు అంతటా జరుగుతున్నాయి. ఎన్నికలకు కొద్ది నెలల సమయమే ఉందన్నది తెలిసిందే.. ఎన్నికల కోడ్ వస్తే ఈ ఎంఓయూలు అమలు సాధ్యమా? ఇన్ని రూ.లక్షల కోట్ల ఒప్పందాలు ఏమవ్వాలి? అన్నవి సమాధానాల్లేని ప్రశ్నలు.

(రచయిత ప్రజాశక్తి విశాఖపట్నం ప్రతినిధి)

జన వాక్యం

దర్జారాయుళ్లకే దాసోహమా!



గత నాలుగైదు రోజుల నుంచి ఏ పేపర్ చూసినా బ్యాంకుల్లో జరిగిన కుంభకోణాల గురించి పుంఖాను పుంఖాలుగా వర్ణిస్తున్నారు. ఒక్కటే హడావుడి. ఇంత పోయింది అంత పోయింది అని. ఒకటి మర్చిపోకముందే మరొకటి. ఒక సామాన్య వ్యక్తి దగ్గర ఒక్క రూపాయి చిల్లర లేకపోతే బస్సు ఆపి మరీ దించేస్తున్నారు. బ్యాంకుల్లో లోన్ ఇవ్వాలంటే సవాలక్ష ప్రశ్నలు, రోజులకొద్దీ పడిగాపులు, అధికారుల ఈసడింపులతో పాటు, ఒకరిద్దరి గ్యారంటీ, చెక్కు బుక్కులు కావాలి. కర్మ కాలి లోను తీసుకుంటే, ఎప్పుడైనా ఇబ్బంది ఏర్పడి ఒకటి రెండు నెలలు కట్టకుంటే ఎకౌంటు సీజ్ చేసి నానా హంగామా చేయడమే కాకుండా ఫైన్లు. ఎకౌంటు నుండి డబ్బులు తీయాలంటే పరిమితులు. వేయాలంటే సవాలక్ష ఆంక్షలు. మన డబ్బులు మనం తీసుకోవడానికి లేదు. ఇదంతా సగటు వాళ్లకే. కానీ నేడు చూస్తున్నది పూర్తి విరుద్ధం. కోట్ల కొద్దీ డబ్బు, గుట్టలకొద్దీ స్కాంలు బ్యాంకులను మోసం చేస్తున్న దర్జా రాయుళ్లు. విస్తుపోతున్న సామాన్య జనం. పెద్ద మనుషుల వేషంలో కోట్లకు కోట్లు మేసిన ప్రబుద్ధుల స్కాం వార్తలు బయటకు రాకముందే అధికారుల అండదండలతో రాచ మార్గంలో విదేశాలు చెక్కేస్తున్నారు. అప్పుడు బ్యాంకులు లబోదిబోమంటాయి. పెద్ద వాళ్లపై చూపే ప్రేమ, పేదవారిపై కూడా కనబరిస్తే బ్యాంకులు నిజంగా ప్రజా సంక్షేమం కోసం ఏర్పరిచనవే అన్న భావనకు నమ్మకం ఏర్పడుతుంది.

కె వేణుగోపాల్, మార్కాపురం.
తాతినేని తులసీ మోహన్, పెదకాకాని.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

అంతర్జాతీయం

కార్మికుల ఆయుధం 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'



ఎం కోటేశ్వరరావు

తుపాకి చేతబట్టిన ఒక చెడ్డ వాడిని ఆపాలంటే మరో మంచివాడు తుపాకి పట్టటమే ఏకైక మార్గం అని గతంలో అమెరికా జాతీయ రైఫిల్ అసోసియేషన్ అధిపతి వేనె లాపిరే సెలవిచ్చారు. తాజాగా తుపాకులను అదుపు చేయాలనే వారందరూ కమ్యూనిస్టులని, ఆ చర్య స్వేచ్ఛను అడ్డుకోవటమే అంటూ చిందులేశారు. ఇటీవల ఫ్లోరిడాలోని ఒక స్కూల్లో 17 మంది విద్యార్థులు, టీచర్లు ఒక దుండగుడి తుపాకి కాల్పులకు బలైన విషయం తెలిసిందే. ఇలాంటి ఉదంతాలు పునరావృతం కాకూడదంటే టీచర్లందరికీ తుపాకులు ఇవ్వటమే మార్గం అని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. తుపాకులపై ఆంక్షలు విధించాలనే వారందరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించాలని చూసే కమ్యూనిస్టులు తప్ప మరొకరు కాదని వేనె లాపిరే అన్నారు. వీరిద్దరి వ్యాఖ్యలను పరిశీలిస్తే, లాభాల కోసం తుపాకులు తయారు చేసే కార్పొరేట్లకే వంత పాడుతున్నారన్నది స్పష్టమౌతోంది. దీంతోపాటే వాటితో పోయే ప్రాణాల గురించి వారికెటువంటి చింత లేదని కూడా నిరూపించుకున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో వెల్లడవుతున్న అవాంఛనీయ పోకడలను ఎలా సమర్థించుకోవాలో తెలియని శక్తులు, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పదజాలంతో సోషలిస్టు, పురోగామి శక్తులనే కాదు, వాటితో సంబంధం లేని వారి అభిప్రాయాలపై కూడా దాడి చేస్తున్నారు. తుపాకి సంస్కృతికి గోరీ కట్టాలనేందుకు కమ్యూనిస్టులే కానవసరం లేదు. ప్రముఖ చిత్ర దర్శకుడు రావుల్ పీక్ తాజా చిత్రం 'ద యంగ్ కారల్ మార్క్స్' (యువ కారల్ మార్క్స్) ఫిబ్రవరి 23న అమెరికాలో విడుదలైంది. ఆ సందర్భంగా 'డెమోక్రసీ నౌ టీవీ' ఛానల్ ఇంటర్వ్యూలో వేనె లాపిరే వాచాలత్వం గురించి రావుల్ పీక్ స్పందించారు. గతంలో ఆయన 'అయామ్ నాట్ యువర్ నీగ్రో, లుముంబా, డెత్ ఆఫ్ ఏ ప్రొఫెట్, హైతీ, ద సైలెన్స్ ఆఫ్ ద డాగ్స్, సమ్ టైమ్స్ ఇన్ ఏప్రిల్' వంటి చిత్రాలను నిర్మించారు. 'నేను స్పందించాల్సి వుంటుందని అనుకోలేదు, ఒక విషయం చెబుతాను. అనేక మంది టీచర్లు, అనేక సంస్థలు ఆయన చెబుతున్నట్లుగా కారల్ మార్క్స్‌ను బోధన ప్రణాళికలో చేర్చుతున్నట్లయితే వారు కొంతమేరకు మంచి చేస్తున్నట్లే భావించాలి. కారల్ మార్క్స్ అంటే ఎవరు? ఒక గొప్ప తత్వవేత్త, ఆర్థికవేత్త. ఒక విధంగా చరిత్ర గతినే మొత్తంగా మార్చటం గురించి, వర్గం, కార్మిక వర్గం, బూర్జువాలు, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి వంటి ఆయన చుట్టూ వున్న విషయాలు చర్చించటానికి ఉపయోగపడుతుంది.



ఆయన ప్రస్తావిస్తున్న పుస్తకం 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' మొదటి అధ్యాయాన్ని చదివితే ఇప్పుడు జరుగుతున్నదానిని ఎక్కువ తక్కువ లేకుండా వర్ణించటం కనిపిస్తుంది. లాభమే ధ్యేయం గల ఒక వ్యవస్థగా వేన్ లాపిరే సంస్థ (ఎన్ఆర్ఏ) మొదటి జాబితాలో వుంటుంది. మీ జీవితంలో ఎప్పుడైతే లాభానిది పైచేయి అయిందంటే దాని అర్థం యువతను చంపటమే. పైగా ఆ చర్యను సమర్థించుకోవటం కూడా. అంటే అంగీకారం కానటువంటి వాటిని అంగీకరించే స్థితిలో మీరు వున్నట్లే! ఆ కమ్యూనిస్టు మేనిఫెస్టోలో వున్నది అదే. యువతరం దానిని చదవటం ప్రారంభించి, దాని మీద చక్కటి చర్చ చేస్తే అది చాలా మంచిది.' రావుల్ పీక్ చెప్పిన ఈ అంశం ఒక్క అమెరికా రైఫిల్ అసోసియేషన్‌కే కాదు, యావత్ ప్రపంచంలో లాభాల వేటలో వున్న ప్రతి వ్యవస్థకూ, అన్ని జీవన రంగాలకూ వర్తిస్తుంది.

'మెరిసిన జుట్టు, పెరిగిన గడ్డం కలిగిన వృద్ధ రాజకీయవేత్తగానే కాదు, ఒక అసాధారణ తత్వవేత్తగా ఈ చిత్రంలో మార్క్స్‌ను చూపించారు. ఒక యువకుడిగా, అప్పులతో ఇబ్బందులు పడిన మార్క్స్‌ను, ఉద్యమం నుంచి 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' ఎలా ఉద్భవించిందో ఈ చిత్రంలో చూస్తారు. కుటుంబం, ముఖ్యంగా భార్య జెన్నీ, స్నేహితుల మధ్య మార్క్స్ ఎలా పెరిగారో చూపటం దీనిలో నా తొలి అంశం. మేం ధనికులం, మేం మధ్యతరగతి లేదా పారిశ్రామిక కుటుంబాలకు చెందినవారం. అయినప్పటికీ మా చుట్టూ జరుగుతున్నదానిని మేం అంగీకరించం' అని చెప్పిన ముగ్గురు యువకుల జీవితాలను యువతరం చూడాలని కోరుకున్నాను. మానవులుగా వారికి నేనెంతో సన్నిహితం, వారు కేవలం పోరాటం మాత్రమే చేయలేదు, వాటితోనే జీవించారు. తమకు ప్రమాదకరమైన నిర్ణయాలను వారు తీసుకున్నారు, సర్వం కోల్పోయారు. వారు పేదలయ్యారు అయినప్పటికీ వారిది పెద్ద జీవితం, మేధావులుగా తయారయ్యారు. యువకులుగా స్పందించారు, ప్రతిదీ మార్చదగినదిగానే వారికి కనిపించింది. పశ్చిమ దేశాలలో మార్క్స్ గురించి మరో చిత్రం లేకపోవటం ఈ చిత్ర నిర్మాణానికి ఒక కారణం.' అన్నారు పీక్. ఈ చిత్రం న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ నగరాలలో ఫిబ్రవరి 23న విడుదలైంది. రెండు గంటల నిడివి వున్న ఈ చిత్రాన్ని జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియంలో చిత్రీకరించారు.

ప్రపంచ గతినే మలుపు తిప్పిన కమ్యూనిస్టు మేనిఫెస్టో తొలి ప్రచురణకు 170 ఏళ్లు. ఈ గ్రంథ ముద్రణ 1848 ఫిబ్రవరి చివరి వారంలో లండన్‌లోని ఒక అజ్ఞాత ప్రాంతంలో జరిగింది. వర్కర్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ పేరుతో దానిని ప్రచురించారు. తొలుత దానికి కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక అని పేరు పెట్టారు. 2008 ఆర్థిక సంక్షోభం తరువాత ఈ గ్రంథ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. బ్రిటన్‌లో 2015 ఫిబ్రవరిలో వారం రోజుల్లోనే 30 వేల కాపీలు విక్రయించారు. సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యతిరేకులు ఎన్ని విధాలుగా కుత్సిత వ్యాఖ్యానాలు చేసినా వాస్తవాన్ని కాదనలేరు. 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'ను రాసిన నాటికీ, నేటికీ ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చిన మాట వాస్తవం. అయినా దోపిడీ తీవ్రత, ఆర్థిక అసమానతల్లో ఎలాంటి మార్పు లేదు. దోపిడీ కొనసాగుతూనే వుంది. అందువల్ల దానిని అంతం చేయాలని కోరిన కమ్యూనిస్టు మేనిఫెస్టో కంటే మెరుగైన సిద్ధాంతం, కార్మికవర్గ అస్త్రం మరొకటి కనిపించటం లేదు. ఎవరైనా అంతకంటే త్వరగా దోపిడీని అంతం చేయగల భావజాలం, అస్త్రాలను కార్మిక వర్గానికి అందచేస్తే అంతకంటే కావాల్సిందీ లేదు. అలా కాకుండా అందుబాటులో వున్న ఆయుధాలు పనికి రావు అని చెప్పటం అంటే కార్మిక వర్గాన్ని నిరాయుధ్ధం



ఆకాశంలో సగం అంటాం. అన్నింటా భాగస్వామ్యం అంటాం. అంతరిక్షంలో విహరించిన సందర్భాలను తలుస్తాం. ఆర్థిక స్వావలంబన సాధించిన విజయాలను ప్రస్తుతిస్తాం. అన్నీ నిజమే! మహిళలు సాధించిన, సాధిస్తున్న విజయాలకు నిలువెత్తు నిదర్శనాలే! సాధికారత దిశగా సాగిస్తున్న ఈ ప్రస్థానాన్ని సంతోషంతో చాటిచెప్పకోవడంలో తప్పేం లేదు. కానీ, ఇన్ని ఎన్ని చెప్పకున్నా- రకరకాలుగా మహిళాలోకం అణిచివేతకు గురవుతూనే ఉంది. తరతరాల నాటి ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. కట్టడి చేసే కనికట్టు నడుస్తూనే ఉంది. ఈ బంధనాలన్నింటిని భరిస్తూ, తానే ఒక సాధనమై, ఆ కంచెలను ఛేదిస్తూ .. పురోగమించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది నేటి మహిళ. ఆ ఒరవడుల ప్రస్థానాన్ని, నేటి స్థితిగతుల వాస్తవాన్ని పరామర్శించే ప్రయత్నం ఈ 'మహిళోదయం' ... నేటి నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకూ.

మహిళోదయం 1



మీ కోసం

ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగితే రక్తహీనత తగ్గుతుంది.

జీవన సౌరభం

ఆడపిల్ల చదువుతోనే ప్రపంచం ప్రకాశిస్తుంది.



బుడి బుడి అడుగులతో బడిలోకి అడుగుపెట్టింది మొదలు.. నేర్చుకునే ప్రతి అక్షరం ఆమెకు ఓ పరీక్షే! పెరిగే వయసు సమాజంలోని ఆడపిల్ల స్థానం ఏమిటో.. ఆమెకు పరిచయం చేస్తుంది. పాఠ్యాంశాలు వివక్షను నూరిపోస్తాయి. పెద్దల మమకారం ఆడ, మగ అనే లింగభేదాన్ని చూపిస్తుంది. చదువును నిర్వీర్యం చేస్తూ, నిర్ణయాధికారం ఎదుటివారి చేతుల్లోకి పోతుంది. అలాంటి ప్రతికూల వాతావరణంలోనూ 'బాలికా విద్య' అనే నినాదం బలపడితే సమాజాభివృద్ధికి అంకురం పడినట్లే! ఆ చిట్టిచేతులు దిద్దే అక్షరాలు.. వారు పీల్చే స్వేచ్ఛా వాయువులే ఓ నవ్య సమాజానికి నాంది!

అక్షరాలే ఆయుధాలు

పల్లెటూరిలో పది పాసైన రేణుక భవిష్యత్తుపై గంపెడాశలు పెట్టుకుంది. ఇంకా పెద్ద చదువులు చదవాలి. ఉన్నతస్థాయికి ఎదగాలి. అమ్మానాన్నలకు అండగా నిలవాలి. అలాంటి ఊహాలోకంలో ఆ లేతమనసు విహరించింది. అదే సమయంలో నాన్న పెళ్లి సంబంధాలు వెతకడం మొదలుపెట్టాడు. మాటకు విలువలేని అమ్మ మౌనం దాల్చింది. రేణుక ఆలోచనలకు పదును పెట్టింది. పదిహేనేళ్లకే పెళ్లా? మరి నా ఆశలు, భవిష్యత్తు ఏం కావాలి? అమ్మానాన్నలతో చెప్పుకోలేని ఆమె మనసులోని భావాలు స్నేహితులతో పంచుకుంది. ఉపాధ్యాయులతో చర్చించింది. వారి సాయం కోరింది. అమ్మానాన్నల మనసు మార్చింది. అందుకు సాయపడింది మాత్రం అంతవరకూ ఆమె నమ్ముకున్న చదువే! ఇలాంటి సంఘటనలు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇది బాలికల చైతన్యంలో భాగంగానే చెప్పుకోవాలి.

పూర్తిగా చదువుకోని ముత్తాతైనా, ఐదు చదివిన తాత అయినా చెప్పే మాట ఒక్కటే! ఆడపిల్లకు పెద్ద చదువులు ఎందుకులే అని. వారి అభిప్రాయానికి నాన్న మాట జత కూడితే ఆదిలోనే ఆ అమ్మాయి చదువు కొండెక్కుతుంది. మరి నేటి సమాజంలో అలాంటి అమ్మానాన్నల మనసు మారుతుందా? అంటే, అవుననే చెబుతున్నాయి గణాంకాలు. అన్ని రంగాల్లోనూ అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు రాణిస్తున్నారనేది నేటి వాస్తవం. 'చదువుకు ఆడా మగా తేడా ఏముంది?' అనే భావన పెరుగుతూ వస్తోంది. ఆ చదువే వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అయితే, ఇది నూటికి నూరు శాతం అమలవుతుందనీ చెప్పలేం.

పాఠ్యపుస్తకాల ప్రభావం

మన స్టేట్ సిలబస్ రెండో తరగతి సైన్స్ పుస్తకం మొదలుకుని.. మిగతా తరగతుల పుస్తకాలను పరిశీలిస్తే వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. ఆడపిల్లలు బట్టలు ఉతకడం, పువ్వులు ఏరుకోవడం, తల్లులు వంట చేయడం, వడ్డించడం, బట్టలు ఆరబెట్టడం; పిల్లల, వృద్ధుల సంరక్షణ చూసుకోవడం వంటి ఇంటిపనుల్లో ఎక్కువగా మహిళ ఉన్నట్లు.. చిత్రీకరించారు.



ఏ విద్యా రంగంలో అయినా పాఠ్య పుస్తకాలు శక్తివంతమైన ఆయుధాలు. అయితే, బాలబాలికల ఆలోచనలను చిన్న వయసు నుంచే వివక్షా పూరితంగా ప్రభావితం చేసే పాఠ్యాంశాలు.. అడుగడుగునా ఇలా కనిపిస్తున్నాయి. నిజానికి ఇది కళ్ల ముందే ఉన్నా కనిపించని అక్షర సత్యం. పుస్తకాలు లింగ అసమానత్వాన్ని ప్రచారం చేస్తున్నాయి అనడానికి ఇంతకన్నా వేరే ఆధారాలు అవసరం లేదు. పాఠ్యపుస్తకాల్లో ఇలాంటి లింగ వివక్ష ధోరణులు అభ్యంతరకరం. ఆ వయసు నుంచే పిల్లల్లో లింగభేదం పాతుకుపోయే ప్రమాదం ఉంది. ఇవి లింగ సమానత్వాన్ని సాధించడానికి 'పరోక్షమైన అడ్డంకి'గా ఉన్నాయని యునెస్కో సైతం చెప్తోంది.

పాఠాల్లోని వాక్యాలు, పేర్లు పెట్టిన పాత్రలు, శీర్షికల్లో, సూచికల్లో ప్రస్తావనలు, ఇతరత్రా అంశాల్లో లెక్కించి చూస్తే.. "పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా చాలా తక్కువగా ఉంది" అని యూనివర్సిటీ ఆఫ్ ఆల్బనీకి చెందిన ఆరన్ బెనావట్ గతంలో ప్రకటించారు. ఇందులో అతి ముఖ్యమైన కోణం.. మానవాళి మొత్తానికి ప్రతినిధిగా పురుషుడు మాత్రమే అనే లింగవివక్షతో కూడిన భాషను ఉపయోగించడం. మరో అంశం.. విస్మరణ. పాఠ్యాంశాల్లో తరచుగా మహిళలకు చోటు ఉండకపోవడం. చరిత్రలోనూ, రోజువారీ జీవితంలోనూ మహిళల పాత్రలు పురుష పాత్రలకు లోబడి ఉంటాయి. ఇంటా బయటా పురుషులు, స్త్రీలు చేసే పనుల గురించి సంప్రదాయ మూసపాత్రలు.. స్త్రీ- పురుషుల నుంచి ఆశిస్తున్నట్లుగా వ్యక్తీకరించే సామాజిక ఆకాంక్షలు.. లింగాన్ని బట్టి ఆపాదించే లక్షణాలు.. పాఠ్యాంశాల్లో స్పష్టంగా కనిపిస్తాయి. స్కూలు పిల్లలకు సమాజంలో మామూలు విషయాలనే అవగాహనను ఈ పుస్తకాలు కల్పిస్తాయి. బాలురు, బాలికలు ఏమేం చేయాలి.. అనే దానిమీద పాఠ్యపుస్తకాలు చాలా సంకుచిత భావనలను వ్యక్తం చేస్తున్నపుడు.. స్కూలు పిల్లలు సమాజం ఇలాగే ఉంటుందనీ, ఉండాలనీ భావిస్తారు. ఈ రకమైన ధోరణి పిల్లల ఆలోచనలను వివక్షా పూరితంగా రూపొందిస్తాయన్నది నిపుణుల మాట!



పాఠశాల దశలోనే డ్రాపవుట్

బాలికలు పాఠశాల దశలోనే చదువుకు దూరమవుతున్నారన్నది వాస్తవం. అందుకు ప్రధానకారణం రుతుచక్రం! రజస్వల అయినప్పటి నుంచీ బాలికలు శానిటరీ నాప్‌కిన్స్ వాడటం మొదలుపెడతారు. కానీ, పేదరికంలో మగ్గుతున్న బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ ఒక కల. కాబట్టి, వారు సాంప్రదాయ ఉపకరణాలకు అలవాటుపడుతున్నారు. వాటివల్ల రోగాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో స్కూలుకు వెళ్లడం అసౌకర్యం. దీంతో స్కూలుకు దండం పెట్టి, చదువుకు దూరమవుతున్నారు. రజస్వల అయిన బాలికల్లో డ్రాపౌట్ శాతం పెరుగుతోంది! ఆర్థిక పరిస్థితులు, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు కొంత కారణమైతే.. బహిష్టు సమయంలో పరిశుభ్రతా అవకాశాలు లేకపోవడం మరో ముఖ్యకారణం. స్కూలు మానేసే అమ్మాయిల సంఖ్యే ఎక్కువ. శానిటరీ ప్యాడ్ మార్చుకోడానికి సరైన సదుపాయాలు లేకపోతే.. క్లాసులో ప్రశాంతంగా కూర్చొని పాఠాలూ వినలేరు. తమ బట్టల మీద ఏవైనా మరకలు పడ్డాయేమోనన్న భయానికే ఎక్కువ లోనవుతారు. నెలసరి సమయంలో ఆడపిల్లలు స్వేచ్ఛగా లేచి నిలబడటానికి, ముందు బెంచీల్లో కూర్చోడానికీ సంకోచిస్తారు. పొద్దుటి నుంచి సాయంత్రం వరకూ బహిష్టు సమయంలో పరిశుభ్రతా సౌకర్యాలు లేకుండా స్కూల్లో ఉండటమూ కష్టమే. అందుకే ఆ రోజుల్లో బడి మానేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రధానంగా ప్రభుత్వంపైనే ఉంది. ఇప్పటికే కేరళ, రాష్ట్రాల్లో శానిటరీ ప్యాడ్స్ ప్రభుత్వాలే ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. పరిశుభ్రత నిర్వహణకు సంబంధించి సమాచారం, అవగాహన, సురక్షిత చర్యలు, మౌలిక వసతులు, నాప్‌కిన్స్, వాటి డిస్పోజల్ నిర్వహణ ప్రభుత్వాలు, స్కూలు యాజమాన్యాలు చేపట్టాలి. రుతుక్రమ అపరిశుభ్రత వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించడం, కౌమారదశలోని బాలికలున్న స్కూల్స్‌లో ప్రత్యేక టాయిలెట్, క్లీనింగ్ కోసం ప్రత్యేకగదిని ఏర్పాటుచేయాలి. మరీ ముఖ్యంగా నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

నిర్ణయాధికారం

చదువు పేరుతో కాలు బయటపెడుతున్న ఆడపిల్ల విద్యతోపాటు ఈ సమాజాన్నీ చదువుతోంది. దాంతో తన దృష్టిని విశాల పరుచుకుంటోంది. తనకు నచ్చిన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ కావాలంటోంది. ఇక్కడే సమస్య మళ్లీ మొదలవుతోంది. అలాంటి నిర్ణయాలు అటు తల్లిదండ్రులు, ఇటు కుటుంబంలో ఇతర పెద్దల పెద్దరికాన్ని, ఆహాన్ని దెబ్బతీస్తున్నాయి. అందువల్ల చిన్నప్పుడే ఆడపిల్లలకు పెళ్లి చేస్తే, చెప్పుచేతల్లో ఉంటారని, చదివిస్తే తమ మాట వినరన్న సంశయం వ్యక్తం చేస్తున్నారు. ఆమె జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడమే తప్పు ఆలోచన అనేది అపవాదు. అదే సరైన నిర్ణయం. పీజీ చదివిన అనూష దృష్టిలో అమ్మానాన్నంటే తన భవిష్యత్తుకోసం ఆలోచించే గొప్ప వ్యక్తులు. అది చదువు వరకే పరిమితం అవుతుందని ఆమె ఊహించలేకపోయింది. ఎందుకంటే, పెళ్లి విషయంలో ఆమె మాటకు విలువ లేకుండా పోయింది. ఆ క్షణంలో తను చదివిన చదువుకు అర్థం ఏముంది అనే భావన. తల్లిదండ్రులను ఎదిరించి, వారిని బాధపెట్టడం ఇష్టంలేక వారు చెప్పినట్లు పెళ్లి చేసుకుంది. ఫలితం, ఆమె చదువు అత్తింటి నాలుగుగోడల మధ్య చిక్కుకుపోయింది. కూతురు చదువు విషయంలో ఇచ్చిన స్వేచ్ఛ ఆమె భవిష్యత్తును నిర్ణయించుకునే విషయంలో ఇవ్వకపోవడం దేనికి సంకేతం? ఇలాంటి అనూషలు మన చుట్టూ చాలామందే ఉన్నారు. నిర్ణయాధికారం పెళ్లికి ముందు పెద్దలు, పెళ్లి తర్వాత అత్తింటివారి చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే అది సమాజాభివృద్ధికే పెను ప్రమాదం. బాలికల చదువు సమాజాభివృద్ధికి తోడ్పడాలి.. తోడ్పడుతుంది. ఆ సామాజిక స్పృహతో నడుచుకోవాలి.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమ్మాయిలూ, ఆమె తల్లిదండ్రులూ ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

- చందు తిలారు

ఆదివాసీలకు ఓ ఐఎఎస్!

ఐఎఎస్ కావాలని ఎవరు కలలు కనరు చెప్పండి? చాలామంది యువతీ యువకులు చదువుకునే సమయంలో ఇలాంటి సర్వీస్ చేయాలనుకుంటారు. దానికోసం కోచింగ్‌లూ తీసుకుంటుంటారు. అందులో చాలామంది మనం ఈ జాబ్‌కి సరిపోతామా? లేదా అన్న సందిగ్ధంలో ఉంటారు. అలా తమ గమ్యస్థానాన్ని అందుకునేది కొందరే. గుజరాత్‌కు చెందిన మిట్టల్ పటేల్ స్టోరీ ఈ కోవకు చెందిందే. ఆమె కూడా తన గ్రాడ్యుయేషన్ సమయంలో ఐఎఎస్ కావాలని కలలు కనింది. ఆ ఆశయమే ఆమెను ఆదివాసీల కోసం పనిచేసే కార్యకర్తగా మార్చింది. ఇంతకీ ఎవరామె?

గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా సంకల్‌పూర్ మిట్టల్ పటేల్ స్వస్థలం. 35 సంవత్సరాల మిట్టల్ పటేల్ పదేళ్ల నుంచి గుజరాత్‌లోని 28 సంచార, 12 నోటిఫైడ్ ఆదివాసుల కోసం పనిచేస్తున్నారు. ఆమె వల్లే ఆదివాసులను దేశ పౌరులుగా గుర్తించారని చెప్పొచ్చు. ప్రస్తుతం వారు ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారు. మిట్టల్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. ఆదివాసుల అధికారాల కోసం పాటుపడుతున్న మిట్టల్ ఒకప్పుడు ఐఎఎస్ అవ్వలన్నా లక్ష్యంతో అహ్మదాబాద్ వచ్చింది. మధ్యలోనే ఆమె చదువుకు పులుస్టాప్ పెట్టి, గుజరాత్ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సుకు దరఖాస్తు చేసుకుంది. జర్నలిజం కోర్సులో భాగంగానే చర్క్ (Chark) ఫౌండేషన్‌లో రెండునెలలపాటు ఫెలోషిప్ చేయడానికి అవకాశం లభించింది. ఆ అడుగే ఆమె జీవితాన్ని మార్చేసింది.

ఒక్క సంఘటనతో!

నిజానికి అప్పుడే ఆమె ప్రయాణం ప్రారంభమైందని చెప్పొచ్చు. విద్యార్థిదశలో మిట్టల్ గోల్డ్‌మెడల్ స్టూడెంట్. ఆమె సిఎన్- ఐబిఎన్ తరపున 'రియల్ హీరోజ్' అవార్డునూ కైవసం చేసుకున్నారు. అలా ఆమెకు చర్క్ ఫెలోషిప్ ద్వారా గుజరాత్‌లోని గిరిజన ప్రాంతాలకు వెళ్లే అవకాశం లభించింది. అందులో భాగంగానే ఓ గిరిజన ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అమ్మ చంకలో కూర్చొని ఏడుస్తున్న బాబును గమనించాను. ఆ బిడ్డ గుక్కతిప్పుకోకుండా ఏడుస్తూనే ఉన్నాడు. వెంటనే నేను ఆమె దగ్గరికి వెళ్లి బిడ్డకు ఆకలేసినట్లుంది. పాలివ్వమని చెప్పాను. "నేనే ఎన్నో రోజుల నుంచి పస్తులున్నానమ్మా! ఇక పాలెక్కడి నుంచి వస్తాయి?" అంటూ చాలా ఆవేదనతో చెప్పింది ఆ తల్లి. ఆ మాటలకు నా కళ్లు చెమ్మగిల్లాయి.


'మనదేశంలో ఇలా ఆకలితో అలమటించే వారు ఎందరున్నారో? అన్న సందేహం కలిగింది. అలాంటి వారందరికీ నేను సహాయం చేయలేకపోయినా, కనీసం నా కళ్లముందున్న వారికైనా నా వంతుగా చేయాలని అనుకున్నా' అంటారామె. ఆ క్షణం నుంచే గిరిజనుల కోసం తన వంతుగా కృషి చేయడం ప్రారంభించారు.

ఉద్యోగాన్ని వదిలి!

మొదట్లో ఏంచేయాలో అర్థంకాక పత్రికలో వీరి గురించి రాయడం మొదలుపెట్టింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో స్వయంగా మిట్టల్ రంగంలోకి దిగారు. రోజువారీ అవసరాలు తీర్చుకునేందుకూ వారిదగ్గర ఎటువంటి ఆధారం ఉండేదికాదు. వారిదగ్గర ఎటువంటి ప్రభుత్వ గుర్తింపుకార్డులు లేవు. అసలు ప్రభుత్వం వారిని పౌరులుగానే గుర్తించలేదు. అలాంటి వారికి ఏదో ఒకటి చేయాలనుకుంది. అందుకోసం మొదటగా ఆమె తన ఉద్యోగాన్ని వదిలేశారు. దానితర్వాత రెండేళ్లు ఆదివాసులలో తానూ ఒకరై గడిపారు. వారి సమస్యల్ని దగ్గర నుంచి చూశారు. వారి గురించి చాలా విషయాలను తెలుసుకున్నారు. అలా ఆదివాసీ మహిళలు పడే కష్టాలను చూసి మిట్టల్ మనసు చలించిపోయింది.

ఎన్‌జీఓ స్థాపన!

ఆమె చేస్తున్న ఈ పనికి కుటుంబసభ్యులు కానీ, మిత్రులు కానీ ఎలాంటి సాయం అందించేందుకు ముందుకు రాలేదు. మిట్టల్ గిరిజనుల కోసం పనిచేయడం వారెవరికీ నచ్చలేదు. ఎందుకంటే, వారి దృష్టిలో గిరిజనులంతా నేరస్తులు అనే భావన. అయినా, మిట్టల్ వెనకడుగు వేయలేదు. ఆదివాసులను జనజీవన స్రవంతిలోకి తీసుకరావడం ఆమె ముందున్న మొదటి కర్తవ్యం అని మిట్టల్‌కు అర్థమయ్యింది. మొదట వారూ అందరిలా ప్రభుత్వ ప్రయోజనాలు పొందేలా ప్రణాళిక రూపొందించారు. అందుకోసం మిట్టల్ 'విచారత్ సముదాయ్ సమర్థన్' (విఎస్-ఎస్ఎమ్) అనే పేరుతో ఓ ఎన్‌జివోను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ ద్వారా పిల్లలకు చదువు చెప్పించడం మొదలుపెట్టింది.



ఆదివాసులందరికీ ఓటర్‌కార్డులను ఇప్పించింది. అలా ఆదివాసుల సమూహంలో సుమారు ఇరవై వేలమందికి పైగా ఓటరు కార్డులను అందుకున్నారు. సుమారు ఐదువేల మందికి రోజువారీ సరుకులు లభిస్తున్నాయి. 2006లో ఏర్పాటుచేసిన ఈ సంస్థ 2010లో రిజిస్టర్ అయ్యింది. "2007-09 సంవత్సరంలో రాత్రీపగలూ అనే తేడా లేకుండా పనిచేశాం. ఈ ఏడాది 90 శాతం మంది ఆదీవాసుల పేర్లు ఓటర్ లిస్టులోకి వెళ్లాయి. దీనికంటే ముందే వెయ్యిమందికి ఓటర్ కార్డులు వచ్చాయి. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఈ పనిలో నేనెప్పుడూ అలసిపోలేదు" అంటున్నారు మిట్టల్.

అక్కడితో ఆగిపోలేదు

ఆమె నెలకొల్పిన ఈ సంస్థ ఎన్‌టి - డిఎన్‌టి కమ్యూనిటీ వారి సహాయంతో కేవలం వారిని పౌరులుగా గుర్తించడమే కాకుండా, చదువు, ఆరోగ్యంతో మంచి జీవితాన్ని ఇవ్వడానికి ఎంతగానో దోహదపడుతోంది. అక్కడ ఉండే పిల్లలకు 'విచారత్ సముదాయ్ సమర్థన్ సంస్థ' ద్వారా టెంట్ స్కూల్ వేయించి మరీ చదువు చెప్పిస్తుంది. టెంట్ స్కూల్‌కు సంచారజాతికి చెందిన పిల్లలు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం గుజరాత్‌లో ఈ సంస్థ 13 ప్రాంతాల్లో టెంట్ స్కూళ్లను నడుపుతోంది. వీరు చేసిన ఈ ప్రయత్నం వలన గుజరాత్‌లో 40 శాతం సంచారజాతికి చెందిన వారిలో 19 శాతం సంచారజాతి పిల్లలు ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ఈ స్కూల్స్‌లో ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకూ ఉంది. సంచార జాతికి చెందినవారు సహజంగానే ఒక ప్రాంతంలో ఉండరు. అలాంటివారు తమ పిల్లల్ని ఎలా చదివిస్తారన్న సందేహం మిట్టల్‌కు కలిగింది. "బంజారా కమ్యూనిటీకి చెందినవారు తమ పిల్లల్ని చదివించాలని అనుకుంటున్నారు. కానీ, వారు పని వదిలేసి రాలేరు కదా! పైగా వారు వెళ్లిన ప్రతిచోటా స్కూల్ ఉండదు. ఈ సమస్యకు పరిష్కారం మేం ఆలోచించాం. సౌరాష్ట్ర, అహ్మదాబాద్, రాజన్‌పూర్‌లో నాలుగు హాస్టల్స్‌ను ఏర్పాటుచేశాం. అందులో ప్రస్తుతం 700 మంది పిల్లలు చదువుతున్నారు. వారి తల్లిదండ్రులు నెలంతా పనులకోసం ఊరూరు తిరిగినా, పిల్లలు మాత్రం ఒకటే చోట ఉండి, చదువుకునేలా వీలు కల్పించాం" అంటూ గర్వంగా చెబుతున్నారు మిట్టల్. అంతేకాదు వారి సొంత ఇంటి కలలను నిజం చేసేందుకు మిట్టల్ ఏర్పాటు చేసిన సంస్థ గృహరుణాలు ఇప్పించడంలో ఎంతగానో సహాయపడింది. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకూ 265 ఇళ్లను నిర్మించుకున్నారు. 300 ఇళ్లను పూర్తిచేయాలని మిట్టల్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మిట్టల్ సంస్థ గుజరాత్‌లోని తొమ్మిది జిల్లాల్లో బంజారా కమ్యూనిటీ, గిరిజనులకు చదువు ఇతర విషయాలన్నింటిలో వారిని జాగృతం చేసేందుకు కృషి చేస్తూనే ఉంది. అందుకే అక్కడివారి దృష్టిలో మిట్టల్ అంటే ఓ ఐఎఎస్.

- అమల

(యువర్‌స్టోరీ హిందీ వెబ్‌సైట్ ఆధారంగా..)



ఆమె ఆలోచన అనన్యం

పదహారేళ్ల వయసు.. తనకే ఆ అంశం మీద అంతంతమాత్రం అవగాహన. కానీ వందలమందిని చైతన్యం చేసే ఆలోచన చేసిందామె.. ఆమే ఢిల్లీకి చెందిన అనన్య. అనన్య బ్రిటీష్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. సాధారణంగా పదహారేళ్ల ప్రాయంలో అమ్మాయిలకు నెలసరి గురించిన అవగాహన అంతంతమాత్రమే. అయితే అనన్య మాత్రం ఈ అంశం మీద పూర్తి అవగాహన పెంచుకుంది. అంతేకాదు తనలాంటి వందలాది విద్యార్థినులకు చెప్పి, చైతన్యపరుస్తోంది. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద బాలికలకు సహాయం చేయడానికి గత ఏడాది ఈ నిర్ణయం తీసుకుంది. శానిటరీ ప్యాడ్స్ కొనలేని పరిస్థితుల్లో ఉన్నవాళ్లకు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవడం చూసి, చలించిన అనన్య తనవంతుగా అవగాహన కల్పించాలనుకుంది. అవగాహన లేకపోవడం వల్ల నెలసరి సమయంలో పాఠశాలలకు గైర్హాజరు కావడం, బయటికి చెప్పుకోలేకపోవడం, వ్యక్తిగత సమస్యలకు గురవుతుండడం తెలిసి, ఈ విషయంపై మాట్లాడాలని నిర్ణయించుకుంది. అనన్య దీనిపై ప్రస్తుతం విశాఖకు చెందిన 'సంపూర్ణ స్వచ్ఛత' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేస్తుంది. ప్రతినెలా ఢిల్లీలోని 'ఖుషీ' సంస్థకు తనవంతుగా 500 శానిటరీప్యాడ్స్‌ను పేద విద్యార్థులకు ఉచిత పంపిణీ చేసేందుకు అనన్య అందజేస్తుంది. ★

సెన్సెక్స్ ⬇ 162
34,184

నిఫ్టీ ⬇ 61
10,492

రూపాయి ⬇ 28 పై॥
అమెరికా డాలరుకు రూ. 64.17



స్టేఫ్రీకి సింధు ప్రచారం..

శానిటరీ నాప్కిన్ బ్రాండ్ స్టేఫ్రీ తమ ప్రచారకర్తగా బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధును నియమించుకుంది. 'డ్రీమ్స్ ఆఫ్ ప్రోగ్రెస్' పేరుతో అమ్మాయిలను ప్రోత్సహించాలని ఈ సంస్థ బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింధు పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.

ట్రెండ్స్' బ్రాండ్ అంబాసిడర్‌గా రానా

రిలయన్స్ రిటైల్‌లో దుస్తులు, ఉపకరణాల ప్రత్యేక విభాగమైన ట్రెండ్స్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటిని నియమించుకుంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో ట్రెండ్స్ ఫస్ట్‌లుక్ ప్రచారం 'గెట్ దెమ్ టాకింగ్'లో రానా పాల్గొన్నారు.



క్యూ3లో 7.2% వృద్ధి రేటు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో భారత జిడిపి వృద్ధి రేటు 7.2 శాతానికి చేరింది. వ్యవసాయం, తయారీ, నిర్మాణ, కొన్ని సేవల రంగాల పురోగతితో వృద్ధి రేటు పెరిగినట్లు బుధవారం కేంద్ర గణంకాల శాఖ వెల్లడించింది. 2016-17 ఇదే క్యూ3లో 7.1 శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 2017-18లో వృద్ధి రేటు 6.6 శాతానికి చేరొచ్చని సిఎస్ఒ అంచనా వేసింది. ఇంతక్రితం ఈ అంచనా 6.5 శాతంగా ఉంది. గతేడాది జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం వృద్ధి రేటును 6.3 శాతం నుంచి 6.5 శాతానికి సిఎస్ఒ సవరించింది. 2016-17లో వృద్ధి రేటు 7.1 శాతంగా చోటు చేసుకుంది. జిఎస్‌టి అనిశ్చిత్తిలోనూ గత క్యూ3లో వ్యవసాయం, పరిశ్రమలు, తయారీ రంగాలు వృద్ధి రేటుకు దన్నుగా నిలిచాయని సిఎస్ఒ పేర్కొంది.

డిపాజిట్లపై వడ్డీరేటు పెంపు

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బిఐ డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచింది. కోటి రూపాయల విలువ లోపు రీటైల్ డిపాజిట్లపై 10 నుంచి 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేటును పెంచినట్లు తెలిపింది. దీంతో 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై వడ్డీరేటు 5.25 శాతం నుంచి 5.75 శాతానికి చేర్చింది. ఇది వరకు ఉన్న 6.25 శాతం వార్షిక వడ్డీ రేటును 6.40శాతంగా మార్చింది. 2 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై 6 శాతంగా ఉన్న వడ్డీ రేటును 6.50శాతానికి చేర్చింది. అదే విధంగా కోటి రూపాయలకు పైన డిపాజిట్లపై కూడా ఈ పెంపు వర్తింప చేయనుంది. కోటి రూపాయల నుంచి రూ.2 కోట్ల లోపు విలువ చేసే డిపాజిట్లపై వడ్డీ రేట్లను మార్చింది. రెండేళ్ల లోపు ఈ విలువ చేసే డిపాజిట్లపై వడ్డీ రేటును 50 బేసిస్ పాయింట్లు పెంచి 6.25 శాతం నుంచి 6.75 శాతానికి చేర్చింది. రెండు నుంచి మూడేళ్ల డిపాజిట్లపై 75 బేసిస్ పాయింట్లు పెంచి 6.75 శాతానికి పెంచింది.

రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి కొత్త బైకులు

న్యూఢిల్లీ : లగ్జరీ ద్విచక్ర వాహనాల తయారీదారు రాయల్ ఎన్‌ఫీల్డ్ భారత మార్కెట్లోకి థండర్ బర్డ్ 350ఎక్స్, థండర్ బర్డ్ 500ఎక్స్ పేరుతో రెండు కొత్త బైలకును విడుదల చేసింది. వీటి ధరలను వరుసగా రూ. 1.56 లక్షలు, రూ.1.98 లక్షలుగా నిర్ణయించింది. యువతను దృష్టిలో పెట్టుకుని వీటిని ఆవిష్కరించినట్లు ఆ కంపెనీ ప్రెసిడెంట్ రుద్రతేజ్ సింగ్ తెలిపారు.

ఎయిర్‌సెల్ దివాలా

ఎన్‌సిఎల్‌టిలో పిటిషన్ దాఖలు

ఆర్థిక సాయం అందడం లేదు

లాభదాయకత తగ్గింది

కంపెనీ వెల్లడి

బ్యాంకులకు వేల కోట్ల నష్టం..!



న్యూఢిల్లీ : టెలికాం రంగంలోకి రిలయన్స్ జియో రాకతో నెలకొన్న తీవ్ర పోటీ చిన్న టెలికం కంపెనీలకు వడగండ్లను మిగిల్చుతుంది. పలు కంపెనీల ఆదాయం భారీగా పడిపోవడంతో కుదిరితే విలీనాలు లేకపోతే మూసుకోవడాలు చేస్తున్నాయి. తాజాగా ఎయిర్‌సెల్ కూడా తన సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల సుడిగుండంలో చిక్కుకున్నట్లు వెల్లడించింది. దీంతో బుధవారం ఆ కంపెనీ దివాలా పిటిషన్‌ను దాఖలు చేసినట్లు ఆ కంపెనీ అధికారికంగా వెల్లడించింది. నిలకడలేని వ్యాపారం, పెరిగిన నష్టాలు కంపెనీపై ప్రతికూల ప్రభావం చూపాయని ఇందులో పేర్కొంది. అందుకే జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) వద్ద దివాలా పిటిషన్ వేసినట్లు ఆ కంపెనీ అధికారులు పేర్కొన్నారు. ఈ దెబ్బతో బ్యాంకులు ఇచ్చిన రుణాలు వసూలు చేసుకోలేక వేల కోట్లు మునగనున్నాయి. బ్యాంకులు సహా ఎవరి నుంచి ఆర్థిక సాయం, రుణాలు అందడం లేదని ఇందులో వాపోయింది. కార్యకలాపాలపై వచ్చే ఆదాయం ఒక్కటే మార్గమని తెలిపింది. ఇది కంపెనీ నిర్వహణకు రుణాల చెల్లింపులకు ఎటూ సరిపోవడం లేదు. ఆదాయంతో పాటు లాభదాయకత అంతకంతకూ పడిపోతుంది. దీంతో ఎయిర్‌సెల్‌కు సమస్యలు పెరుగుతున్నాయి. 2017 జులైలో రూ.5కోట్ల లాభాలను నమోదు చేసింది. కాగా అదే ఏడాది డిసెంబర్ ముగింపు నాటికి రూ.120 కోట్ల నిర్వహణ నష్టాలను ఎదుర్కొంది. టెలికం రంగంలో నెలకొన్న తీవ్ర పోటీలో ఈ కంపెనీ రాణించలేకపోయింది. వివిధ బ్యాంకులకు ఈ కంపెనీ రూ.15500 కోట్ల అప్పులు చెల్లించాల్సి ఉంది.

సేవల నిలిపివేత

వచ్చే నెల 30వ తేది నుంచి ఎయిర్‌సెల్ కంపెనీ ఆరు టెలికం సర్కిళ్లలో తన కార్యకలాపాలను నిలిపివేయనుంది. గుజరాత్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ టెలికం సర్కిళ్లలో గత జనవరి 30 నుంచి మొబైల్ సర్వీసులు నిలిచిపోయాయని ఎయిర్‌సెల్ వెల్లడించింది. తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో వ్యాపారం నిర్వహించలేమంటూ స్పష్టం చేసింది. ఈ కంపెనీకి ఆరు సర్కిళ్లలో 40 లక్షల మంది ఖాతాదారులున్నారు. అందరికీ యూనిక్ పోర్టింగ్ కోడ్‌ను పంపించామని వివరించింది. కాగా వేరే నెట్‌వర్క్‌ను మారాలనుకుంటున్న ఎయిర్‌సెల్ వినియోగదారుల అభ్యర్థనలను వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకూ అంగీకరించాలని ఇతర టెల్కోలను ట్రాయ్ ఆదేశించింది. టెలికం కంపెనీ ఎయిర్‌సెల్ ఉద్యోగులకు చాలా కష్టకాలమే వచ్చింది. ఆ కంపెనీ నిర్వహణ క్లిష్టతరంగా మారడంతో దాదాపు 5000 మంది సిబ్బంది పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రిలయన్స్ జియో రాకతో టెలికం పరిశ్రమలో నెలకొన్న పోటీ వల్ల ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా ఎయిర్‌సెల్ లాంటి చిన్న టెల్కోలకు నిధుల సమీకరణ కష్టంగా మారడంతో సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీంతో వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలని ఆ కంపెనీ సిబ్బందికి సమాచారమిచ్చింది. కాని బయట టెలికం రంగంలో ఎలాంటి ఉద్యోగాలు లేకపోవడంతో వారి పరిస్థితి దీనంగా తయారయ్యింది.

అజాఫ్రాన్ 10వేల అవుట్‌లెట్లకు విస్తరణ

హైదరాబాద్ : వచ్చే ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు 10,000 రిటైల్ అవుట్‌లెట్లకు విస్తరించాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా సేంద్రీయ సమీకృత చర్మ సంరక్షణ ఉత్పత్తుల సంస్థ అజాఫ్రాన్ ఇన్నోవేషన్స్ తెలిపింది. దేశంలో 20 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని పట్టణాలు, నగరాలు, మెట్రోల్లోని అన్ని కీలక అవుట్‌లెట్లలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.


మోడ్రన్ రిటైల్ స్టోర్లు, మల్టీబ్రాండ్ అవుట్‌లెట్స్, జనరల్ ట్రేడ్స్‌లోనూ తమ ఉత్పత్తులను ఉంచేందుకు గాను వివిధ వ్యాపార వర్గాల వారితో జట్టు కట్టనున్నామని అందుబాటులో ఆ కంపెనీ హెడ్ టి.ఆర్. సురేష్ తెలిపారు.

కాగ్నిజెంట్‌లో తగ్గిన ఉద్యోగులు

న్యూఢిల్లీ : ప్రముఖ బహుళజాతి ఐటి కంపెనీ 'కాగ్నిజెంట్' భారత ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల చోటు చేసుకుంది. 2017లో అమెరికా, యూరప్‌లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య పెరిగారు. కాగా 2016 సంవత్సరాంతంలో భారత్‌లో కాగ్నిజెంట్ ఉద్యోగుల సంఖ్య 1.88 లక్షల నుంచి గతేడాది ముగింపు నాటికి 1.80 లక్షలకు పడిపోయింది. దీంతో ఒక్క ఏడాదిలో 8000 మంది ఉద్యోగులు సంస్థను వీడారు. ఈ పరిణామం ఐటి అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తుంది.

టెట్, డీఎస్సీ, ఆర్‌ఆర్‌బి పరీక్షల ప్రత్యేకం

నల్గొండ విధానం అని దేనినంటారు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

ఖనిజ మూలకాలు

ఖనిజ మూలకాలు తక్కువ పరిమాణంలో శరీర పెరుగుదల, అభివృద్ధికి అవసరం. అందుకే వీటిని 'సూక్ష్మ పోషకాలు' (మైక్రో న్యూట్రియంట్స్) అంటారు.

– ఇవి రెండు రకాలు

1. స్థూల మూలకాలు

2. సూక్ష్మ మూలకాలు

1. స్థూల మూలకాలు (మ్యాక్రో ఎలిమెంట్స్)

ఇవి ఎక్కువ మొత్తంలో అవసరం. ఇవి మొత్తం తొమ్మిది రకాలు :

ఉదా : C, H, O, N, P, K, Ca, Mg, Na, S.

✧ **CHO** అనే మూలకాలతో జీవి నిర్మాణం జరుగుతుంది. కావున వీటిని **'నిర్మాణాత్మక మూలకాలు'** (స్ట్రక్చరల్ లేదా ఫ్రేమ్‌వర్క్ ఎలిమెంట్స్) అంటారు.

✧ ఇవి జీవులలో అనేక పదార్థాల (కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫ్యాట్స్) ఉత్పత్తికి అవసరం.

✧ మానవ శరీరంలో అధికంగా ఉండే మూలకం **- కార్బన్**

✧ వాతావరణంలో అతితేలికైన వాయువు **- హైడ్రోజన్** దీన్ని బెలూన్స్‌లో నింపుతారు.

✧ మానవ శరీరంలో అధికంగా ఉండే వాయువు **- ఆక్సిజన్**

✧ నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం (ఎన్‌పికె)లను ప్రధాన మూలకాలు (క్రిటికల్ లేదా ప్రిన్సిపల్ ఎలిమెంట్స్) అంటారు. ఇవి సాధారణంగా నేలలో లభించవు.

✧ ఇవి కృత్రిమంగా ఎరువుల రూపంలో లభ్యమవుతాయి.

ఉదా : యూరియా, పొటాష్, ఎరువులు, డిఎపి (డై- అమ్మోనియమ్ ఫాస్పేట్).

యూరియా :



✧ ప్రపంచంలో మొదటిసారిగా తయారుచేసిన కృత్రిమ/ రసాయన ఎరువు.

✧ దీన్ని **'కార్బమైడ్'** అని కూడా అంటారు.

✧ దీని ఫార్ములా $CO\text{-}(NH_2)_2$


✧ దీన్ని మొదటిసారిగా సంశ్లేషించినది **- ఫ్రైడరిక్ వోలర్ (1828)**

నైట్రోజన్ (ఎన్) :

✧ ఇది వాతావరణంలో అధికంగా ఉండే వాయువు.

✧ మొక్కలు నత్రజనిని లవణాల రూపంలో శోషణం చేసుకోవడాన్ని నత్రజని స్థాపన (నైట్రోజన్ ఫిక్సేషన్) అంటారు.

✧ ఇది మొక్కల పెరుగుదలకు, అభివృద్ధికి అతిముఖ్య మూలకం.



✧ అమైనోయాసిడ్స్, ప్రోటీన్స్, హార్మోన్స్, ఎంజైమ్స్, ఎటిపి, క్లోరోఫిల్ (పత్రహరితం)లో భాగంగా ఉంటాయి.

✧ దీని లోపంవల్ల పత్రాలలో పత్రహరితం లోపిస్తుంది **: క్లోరోసిస్**

✧ దీని లోపం ఉన్న నేలల్లో కీటకాహార మొక్కలు (ఇన్సెక్టివోరస్) పెరుగుతాయి.

ఉదా : నెపంథిస్, డ్రాసిరా మొదలైనవి.

పాస్పరస్ (పి) :

✧ ఇది నేలలో పాస్పేట్ రూపంలో మొక్కకు అందుతుంది.

✧ జంతువులలో Ca తో కలిసి ఎముకల, దంతాల ఏర్పాటులో తోడ్పడుతుంది.

✧ ఇది లభించే ఆహారం – పాలు, పప్పులు, గుడ్డు

✧ కేంద్రకామ్లాలు (**DNA, RNA**), పాస్ఫోలిపిడ్స్, ఎటిపి, ఎన్ఎడి తయారీలో పాల్గొంటాయి.

✧ దీని లోపం వల్ల మొక్కలలో పెరుగుదల తగ్గడం, క్లోరోసిస్, జంతువులలో రికెట్స్‌కి కారణమవుతుంది.

పొటాషియం (కె) :

✧ ఇది జంతువుల కణాంతర, కణబాహ్య ద్రవాలలో ఉండి కండర, నాడీ ప్రక్రియలో, ప్రోటీన్స్, గ్లైకోజన్ తయారీలో పాల్గొంటాయి.

✧ మాంసంలో అధికం.


✧ మొక్కలలో పత్రరంధ్రాలు మూసుకోవడం, తెరుచుకోవడం, కణాల ధృఢత్వానికి తోడ్పడుతుంది.

క్యాల్షియం (సిఎ) :

✧ ఇది శరీరంలో ఎముకలు, దంతాలలో అధికంగా ఉండే లోహ మూలకం.

✧ __**జంతువులలో విధులు :**__ 1. పాల ఉత్పత్తి, 2. కండర, నాడీ ప్రక్రియలు, 3. రక్తం గడ్డకట్టడానికి తోడ్పడుతుంది.

✧ మొక్కలలో మధ్యపటలిక (మిడిల్ లామెల్లా)లో సిఎ, ఎంజి పెక్టేట్స్ రూపంలో, వేరు, కాండాగ్రాల అభివృద్ధిలో, కణపొర పారగమ్యతలో తోడ్పడుతుంది..



✧ లోపం వల్ల మానవునిలో రికెట్స్, అస్టియోమలేషియా, మొక్కలలో గిడసబారడం, పుష్పాలు సుప్తావస్థలో ఉండటం జరుగుతుంది.

మెగ్నీషియం (ఎంజి) :

✧ ఇది మొక్కలలో పత్రహరిత నిర్మాణానికి అవసరమయ్యే అతిముఖ్య కేంద్రమూలకం.

✧ రైబోసోమ్‌లలో రెండు ఉప ప్రమాణాలు కలవడానికి తోడ్పడతాయి.

✧ దీని లోపం వల్ల పత్రాలు ఆకుపచ్చ రంగును కోల్పోవడం, పత్రం ఉపాంతం నుంచి వంపు తిరుగుతుంది.

సల్ఫర్ (ఎస్) :

✧ ఇది సిస్టిన్, మిథియోనిన్ అనే అమైనో ఆమ్లాల తయారీకి B_1B_7 విటమిన్స్, ప్రోటీన్స్ తయారీకి అవసరం.

✧ దీని లోపం వల్ల టీ మొక్కలలో పత్రాలు ఏర్పడకపోవడం, క్లోరోసిస్, లెగ్యూమ్ మొక్కలలో వేరు బుడిపెలు (నాడ్యూల్స్) ఏర్పడకపోవడం జరుగుతుంది.

సోడియం (ఎన్ఎ) :

✧ ఇది జంతువులకు అత్యవసరం.

✧ ఇది క్లోరైడ్‌తో కలిసి ఎన్ఎసిఎల్ (సోడియం క్లోరైడ్) లేదా టేబుల్‌సాల్ట్‌ను ఏర్పరుస్తుంది.

✧ లోపం వల్ల కండర కొంకర్లు, వికారం, తలనొప్పి కలుగుతుంది.



2. సూక్ష్మ మూలకాలు (మైక్రో ఎలిమెంట్స్)

✧ తక్కువ మొత్తంలో అవసరం.

ఉదా : Fe, I

1. ఇనుము (ఎఫ్ఈ) :


✧ ఇది మానవుని రక్తంలో అధికంగా ఉండే లోహం.

✧ కిరణజన్య సంయోగక్రియలో పాల్గొనే ఫెర్రిడాక్సిన్, నైటోక్రోమ్ అనే వాహకాలలో, క్లోరోఫిల్స్ తయారీలో పాల్గొంటాయి.

✧ ఇది సూక్ష్మ పోషకాలలో కొంచెం అధిక మోతాదులో అవసరం. కావున దీన్ని 'సూక్ష్మపోషకాలలో స్థూలపోషకం' అంటారు.

✧ ఇది ఎక్కువగా మాంసం, గుడ్లు, కాలేయం, ఆకుకూరలు, ఎండిన పండ్లలో లభిస్తుంది.

✧ హీమోగ్లోబిన్ (హెచ్‌బి) ఏర్పాటుకు 1 ఫెర్రస్ (ఎఫ్ఈ) అణువు అవసరం.



✧ వీటితో తయారైన పార్‌ఫెరిన్ వలయం (హీమ్), గ్లోబిన్ అనే ప్రోటీన్‌తో కలిసి హెచ్‌బి ఏర్పడుతుంది.

✧ లోపం వల్ల జంతువులలో ఎనీమియా, పెర్నీషియస్ ఎనీమియా, మొక్కలలో పెరుగుదల మందగించడం జరుగుతుంది.

2. అయోడిన్ (ఐ) :

✧ ఇది భారత ప్రభుత్వం మొదటగా **శాసనం చేసిన** మూలకం.

✧ ఇది ఎక్కువగా సముద్ర ఆహారాలలో అనగా చేపలు, రొయ్యలు, పీతలు, ఉప్పు, కలుపు మొక్కలు లేదా సముద్రనాచు లేదా కెల్ప్‌లో లభిస్తుంది. రొయ్యలలో అధికం.

✧ థైరాయిడ్ (అవటు) గ్రంథి నుంచి థైరాక్సిన్ అనే హార్మోన్ ఉత్పత్తికి అవసరం. ఒకవేళ ఇది లోపిస్తే అవటు గ్రంథి వాపుకు గురవడాన్ని 'గాయిటర్' అంటారు.

3. ఫ్లోరిన్ (ఎఫ్) :

✧ మనకు నీటిద్వారా, సముద్ర ఆహారం ద్వారా లభిస్తుంది.

✧ ఇది దంతాలు, ఎముకలు, దంతాలపైన గట్టి ఎనామిల్ ఉత్పత్తికి అవసరం.

✧ నీటిలో దీని స్థాయి దాటితే దంతాలు పసుపు రంగులోకి మారడం, ఎనామిల్ విచ్ఛిత్తి కావడం, ఎముకలు వికృత రూపాల్లోకి మారడాన్ని 'ఫ్లోరోసిస్' అంటారు.

✧ నీటిలో ఫ్లోరిన్‌ను తగ్గించడాన్ని డీఫ్లోరినేషన్ అంటారు.

✧ ఈ వ్యాధికి మందు లేదు. కొంతవరకూ ఉపశమనం కోసం చింతపండును ఆహారంగా తీసుకోవాలి.

✧ **NEERI** (నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్–నాగ్‌పూర్) వారు నీటిలో ఎక్కువగా ఉన్న ఫ్లోరిన్‌ను తటస్థ పరచడానికి సున్నం, పటిక, బ్లీచింగ్ పౌడర్‌లను కలపాలని తెలిపారు.

✧ ఈ ప్రక్రియనే **నల్గొండ విధానం** అంటారు.

పోషక పదార్థాల లోపం వల్ల వచ్చే వ్యాధులు

ఇనుము : ఇనుము లోపం వల్ల ఏర్పడే రక్తహీనత, ఎర్రరక్తకణాల్లో హీమోగ్లోబిన్ లోపం వల్ల వ్యక్తులు పాలిపోయి ఉండటం, ఆకలి కోల్పోవడం, త్వరగా అలసిపోవడం జరుగుతుంది.

పొటాషియం : హైపోకలెమియా, విపరీతమైన వాంతులు, విరేచనాలతో పొటాషియం కోల్పోవడం, హార్ట్‌బీట్ రేటు అధికం కావడం, కిడ్నీలు దెబ్బతినడం, బలహీనత, కండరాల పక్షవాతం.

సోడియం : హైపోనట్రేమియా, సోడియం నష్టపోవడం, నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, శరీరబరువు కోల్పోవడం.

అయోడిన్ : మాములు గ్రంథివాపు, ఆహారంలో అయోడిన్ శాతం తక్కువ కావడం వల్ల థైరాయిడ్ వాయడం. ★

నమూనా ప్రశ్నలు

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 15 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) కాంట్రాక్టు పద్ధతిలో 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: పీఎంఏ హెడ్–1, డిప్యూటీ పీఎంఏ హెడ్–3, థిమాటిక్ ఎక్స్‌పర్ట్–11. థిమాటిక్ ఎక్స్‌పర్ట్‌లో స్ట్రాటజీ డెవలప్‌మెంట్, సోషల్ బ్రాండ్ మేనేజ్‌మెంట్, ఐఈసీ అండ్ ఐసీటీ, కెపాసిటీ బిల్డింగ్, రీసెర్చ్ అండ్ పాలసీ, ఫైనాన్స్, స్టాండర్డ్స్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్, ప్రొక్యూర్‌మెంట్, డేటా అనాలిసిస్, అసెస్‌మెంట్ అండ్ సర్టిఫికేషన్, ఎంఐఎస్ విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలున్నాయి.

వేతనం: పీఎంఏ హెడ్–రూ.2,50,000, డిప్యూటీ పీఎంఏ హెడ్–రూ.1,50,000, థిమాటిక్ ఎక్స్‌పర్ట్–రూ.1,00,000.

అర్హతలు: సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీజీతో పాటు నిబంధనల మేరకు ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 6, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.nird.org.inv

ప్రభుత్వాసుపత్రి ఎదుట పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - నందిగామ (కృష్ణా)

కృష్ణా జిల్లా నందిగామ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడారు. నందిగామ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. సబ్ కాంట్రాక్టరు, సూపర్‌వైజరు షేక్ అమీన్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆయన సొంత పనులకు వాడుకుంటున్నారన్నారు. సూపర్‌వైజర్ షేక్ అమ్మీన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

దీక్షల్లో పాల్గొన్న సిపిఎం ప్రకాశం జిల్లా నాయకులు



బడ్జెట్‌లో 'ప్రకాశం'కు రూ.10 వేల కోట్లివ్వాలని దీక్షలు

కేటాయించకపోతే ఆందోళన : సిపిఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

మార్చి 8న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు రూ.10వేల కోట్లు ఇవ్వడంతోపాటు వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని సిపిఎం తూర్పు కమిటీ కార్యదర్శి పూనాటి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే మార్చి తొమ్మిది నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ డిమాండ్‌తో సిపిఎం తూర్పు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక నిరసన దీక్షలు నిర్వహించారు.

దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాలా అంజయ్య అధ్యక్షత వహించారు. దీక్షలలో పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని జిల్లా పరిషత్ సమావేశం తీర్మానం చేసిందనీ, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించలేదో జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.పది వేలకోట్లు ఈ జిల్లా ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తోందని చెప్పారు. పశ్చిమ ప్రాంతం మరింత దుర్భిక్షంగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి యంయల్ నారాయణ పేర్కొన్నారు. సిపిఎం దీక్షలకు యంయల్ నారాయణ మద్దతు తెలిపి మాట్లాడారు. అభివృద్ధి చెందిన విశాఖను వెనుకబడిన జిల్లాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయనీ, ప్రకాశం జిల్లాను మాత్రం ఎందుకు గుర్తించలేదని ఒంగోలు ఎంపి వైవి సుబ్బారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు.

పోలీసుల ఉక్కుపాదం

- కొనసాగుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు, ధర్నాలు
- కర్నూలులో కోమాలోకి వెళ్లిన కార్మికుడు



సిఐటియు నేత రాజేశ్వరరావును అరెస్ట్ చేస్తున్న పోలీసులు



విశాఖలో కార్మికులను అరెస్టు చేసి, వ్యాను ఎక్కిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. శ్రీకాకుళంలో సిఐటియు నేతలను ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె శిబిరాలు, ధర్నాలు, వినూత్న రీతిలో ఆందోళనలు, రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కర్నూలులో రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు తిరుపాల్ దీక్షలు చేస్తున్న సమయంలో కోమాలోకి వెళ్లారు. దీంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. తిరుపాల్ వైద్య ఖర్చులు భరిస్తామని ఎస్ఇ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె శిబిరం వద్ద ఐక్య వేదిక చైర్మన్ డి.మల్లికార్జునరావు మాట్లాడారు. గురువారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. గుంటూరులో సమ్మె కొనసాగింది. చలో తిరుపతి కార్యక్రమానికి జిల్లా నుంచి వందలాదిమంది కార్మికులు తరలి వెళ్లారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిఐటియు, ఐఎఫ్‌టియు, వైసిపి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. చలో విశాఖ సిఎండి కార్యాలయం కార్యక్రమానికి వెళ్లనీయకుండా శ్రీకాకుళంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.గణేష్‌లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కార్మికులను, సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. రాజమహేంద్రవరం విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం వద్ద కార్మికులు వంటావార్పు నిర్వహించారు. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్య ఇంజినీర్ కార్యాలయం వద్ద కార్మికుల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు మూడోరోజుకు చేరాయి. ఏలూరు కలెక్టరేట్ వద్ద విద్యుత్ కార్మికుల దీక్షా శిబిరాన్ని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ సందర్శించి, మద్దతు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కడప కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి కడప నుంచి విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక జిల్లా చైర్మన్ మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు ఆధ్వర్యాన పెద్దఎత్తున కార్మికులు తరలివెళ్లారు. అనంతపురంలోని కలెక్టరేట్ ఎస్ఇ కార్యాలయం వద్ద కార్మికుల దీక్షలు కొనసాగుతున్నాయి. కార్మికులను విస్మరిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను విస్మరిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. ఐక్యవేదిక ఆధ్వర్యాన కర్నూలు ఎస్ఇ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, సిపిఎం పశ్చిమ ప్రాంత జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సిఐటియు, హెచ్‌పిఎస్, ఎస్‌యుసిఐ, యుఈఈయు, సిపిఐ, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, లోక్‌సత్తా నాయకులు మాట్లాడారు.

బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

నిర్వాసితుల సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణమూర్తి డిమాండ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సాగునీటి ప్రాజెక్టులు దశాబ్దాల పాటు పూర్తి కావడం లేదని నిర్వాసితుల సంఘం రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 'పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో నిధుల కేటాయింపు' అనే అంశంపై బుధవారం శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోంలో ఎపి రైతు సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో 125 టిఎంసిల నీటి లభ్యత ఉన్నప్పటికీ 20.40 టిఎంసిల సాగునీటిని మాత్రమే వినియోగించుకోగలుగుతున్నామని తెలిపారు. మిగిలిన నీటిని కూడా సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.మోహనరావు మాట్లాడారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 81
2. వాల్ట్‌పోల్
3. అనంతపురం జిల్లా పెనుకొండ
4. నార్వేకు చెందిన మారిట్ జోర్గెన్
5. హాన్సన్ రోబోటిక్స్ కంపెనీ సీఈవో డేవిడ్ హాన్సన్

హోదా కోసం వర్సిటీల బంద్

- తీవ్రమైన ఆందోళన
- వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు
- బిఎస్ఎన్ఎల్, తపాలా కార్యాలయాల ముట్టడి



తరగతులు బహిష్కరించి బయట ఉన్న గీతం యూనివర్సిటీ విద్యార్థులు



కర్నూలులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలు బంద్ నిర్వహించారు. వామపక్షాలు, వైసిపి, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, ప్రదర్శనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్, తపాల కార్యాలయాలను ముట్టడించారు.

విశాఖపట్నంలోని ఎయు, గీతం, రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ , విజయనగరం జిల్లా గిరిజన, కాకినాడ, అనంతపురం జెఎన్‌టియు, ఎస్‌కెయు, కర్నూలు రాయలసీమ తదితర విశ్వ విద్యాలయాల్లో బంద్ విజయవంతమైంది. జెఎన్‌టియు విశ్వవిద్యాలయాల్లో బిటెక్, ఎంటెక్ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు, విభజన హామీలు అమలు చేయాలి, జాతీయ యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయాలని పెద్ద ఎత్తున విద్యార్థులు నినాదాలు చేశారు. వర్శిటీల్లో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సీతానగరం రైల్వేస్టేషన్ వద్ద ధర్నాచేశారు. అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బొబ్బిలిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైటాయించారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో అఖిలపక్షాలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మార్చి 2, 3, 4 తేదీల్లో మండల కేంద్రాల్లో రిలే దీక్షలకు వక్తలు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రత్యేక హోదా కోసం సిపిఎం నాయకులు పలుచోట్ల ఆందోళన చేశారు. భీమవరంలో బిఎస్ఎన్ఎల్, పోస్టల్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించారు. సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద, తణుకులో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కృష్ణాజిల్లా నూజివీడులో వామపక్షాల ఆధ్వర్యంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. తిరుపతి బిఎస్ఎన్ఎల్ జిఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, వైసిపి, ఇతర ప్రజా సంఘాలు మద్దతు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలులోని ప్రధాన తపాలా కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ముట్టడిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి, కంట్రోల్ కమిషన్ సభ్యులు టి.షడ్రక్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మలను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురంలోని బిఎస్ఎన్ఎల్, తపాలా కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు.

హోదా కోసం కలిసి పోరాడేందుకు సిద్ధం : రఘువీరా

రాష్ట్రాన్నికి ప్రత్యేక హోదా సాధించిందేకు ఎవరితోనైనా కలిసి పని చేయడానికి సిద్ధమని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి ప్రకటించారు. టిడిపికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరికి తెలియకుండానే ఐదు బడ్జెట్లలో ఆంధ్రాకు అన్యాయం జరిగిందా? అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ జేబులోని పార్టీలుగా టిడిపి, వైసిపి ఉన్నాయని విమర్శించారు. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో శ్రీకాకుళం జిల్లా పాలకొండలోనూ, విజయనగరం జిల్లా సాలూరులోనూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన బుధవారం జరిగిన ఆంధ్రుల ఆత్మగౌరవ సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రజలను బిజెపి, టిడిపి మోసం చేశాయన్నారు. మార్చి రెండున రాష్ట్రంలోని అన్ని జాతీయ రహదారులనూ దిగ్బంధనం చేస్తామని తెలిపారు. 6, 7 తేదీల్లో 'చలో పార్లమెంటు' కార్యక్రమం చేపడతామన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలూ కలిసి పోరాడాలని కోరారు.

రౌండ్‌టేబుల్

కౌలు రైతు సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కె.కేశవరావు, వేదికపై రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)/అమరావతి బ్యూరో

కౌలు రైతుల సమస్యలు అసెంబ్లీలో చర్చించాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడారు. 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలుదారులకు గుర్తింపు కార్డు మంజూరు చేసి లక్ష రూపాయల వరకూ వడ్డీ లేని రాయితీ ఇవ్వాలని ఉన్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. దీంతో పంట రుణాలు, నష్టపరిహారం దాదాపు రూ.60 వేల కోట్లు దారి మళ్లుతున్నాయన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ రాధాకృష్ణ అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులున్నారని, అందులో సెంటు భూమి లేని దళిత, వెనుకబడిన తరగతికి చెందిన నిరుపేదలు 7.5 లక్షల మంది ఉన్నారని అన్నారు. ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో కౌలు రైతుల రక్షణ, సమస్యలపై నిర్దిష్టమైన చర్యలు చేపట్టలేదన్నారు. మార్చిలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుల సమస్యలపై ప్రత్యేకంగా ఎజెండా పెట్టి చర్చించాలన్నారు. ఆలిండియా కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు టి ఆంజనేయులు మాట్లాడుతూ ఇ-క్రాప్ బుకింగ్‌లో కౌలు రైతుల పేర్లను నమోదు చేసి పంట నష్టం, బీమా పరిహారాల్ని అందించాలన్నారు. గిట్టుబాటు ధరల్ని 150 శాతం పెంచి రైతుల్ని ఆదుకోవాలన్నారు. సభాధ్యక్షులు ఎన్ రంగారావు మాట్లాడుతూ 12వ తేదీన తలపెట్టిన మహాధర్నాలో పెద్ద సంఖ్యలో కౌలు రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర నాయకులు జి రామకృష్ణ, బి శ్రీను, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఆఫీసు బేరర్లు ఎన్ నర్సింహ, ఎమ్ హరిబాబు, పి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఢిల్లీలో దీక్షలు

మాజీ మంత్రి పల్లంరాజు

ప్రజాశక్తి - పామర్రు (కృష్ణా)

ఈ నెల 6,7,8 తేదీల్లో ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేస్తామని, అవసరమయితే పార్లమెంటు ముట్టడికైనా సిద్ధమని మాజీ మంత్రి పల్లంరాజు తెలిపారు. బుధవారం కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారని, దానిని అమలు చేయడంలో ప్రస్తుత మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. హోదాపై పార్లమెంటులో చర్చించేందుకు కాంగ్రెస్ పక్ష నాయకులు మల్లిఖార్జునఖార్గే 184 సెక్షన్ కింద నోటీసు ఇచ్చారన్నారు.

చలో గుంటూరును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట (గుంటూరు జిల్లా)

పెదగొట్టిపాడు ఘటనలో ప్రధాన నిందితులైన పెత్తందార్లను అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులకు నిరసనగా 4వ తేదీన నిర్వహించే చలో గుంటూరును జయప్రదం చేయాలని కోరారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు బుధవారం వచ్చిన ఆయన స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

టిడిపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు అధికమయ్యాయనీ, వీటిని నివారించాలని కోరడంతో పాటు పెదగొట్టిపాడు దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెద గొట్టిపాడు దళితులకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని, సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లకుండా చూడాలని కోరారు. ఆయన వెంట సంఘం డివిజన్ కార్యదర్శి కె.రోశయ్య, సిఐటియు డివిజన్ అధక్ష కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, కెవిపిఎస్ నాయకులు ఎస్.బాబు ఉన్నారు.

హామీల అమలులో టిడిపి ప్రభుత్వం విఫలం

ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ : వైసిపి ఎంపి వరప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం విఫలమైందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. నాలుగేళ్ల పాలనలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించింది. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎంపీ వరప్రసాద్ మీడియాతో మాట్లాడారు. అవినీతి సోమ్ముతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. పిరాయింపుల ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతుంటే...వారిపై వేటు పడకుండా ముఖ్యమంత్రి కాపాడుతున్నారన్నారు. చట్ట సభలపై చంద్రబాబుకు విశ్వాసం లేదని, అప్రజాస్వామిక చర్యల ద్వారా ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు కూడా వెళ్లడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మాటతప్పారన్నారు. బెల్ట్‌షాపుల్ని రద్దు చేస్తానంటూ చేసిన తొలి సంతకానికి నేటికీ విలువ లేకుండా పోయిందన్నారు. దీనిపై తానే స్వయంగా చంద్రబాబుకు లేఖ రాసినా, ఎలాంటి సమాధానమూ రాలేదన్నారు. మహిళల భద్రత కోసం స్మార్ట్‌ఫోన్‌లు, రూ.2లకే మినరల్ వాటర్ ఇస్తామన్న హామీలు ఏమయ్యాయన్నారు. హోదా, విభజన హామీలు సాధించడంలోనూ చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రోజుకోమాట మాట్లాడుతూ తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో హోదాను సాధించలేని అసమర్థ ముఖ్యమంత్రిగా చివరికి మిగిలిపోయారని ఎద్దేవా చేశారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

దళిత మహిళపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

టిడిపి దళిత మహిళా నాయకులు దర్శి వనరాణిపై దాడిచేసిన పోలవరపు హరిబాబును ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం నిరసన చేపట్టారు. మాల్యాద్రి మాట్లాడుతూ టిడిపిలోని దళిత మహిళా నాయకురాలిపైనే ఆ పార్టీ పెత్తందారీ సామాజిక తరగతికి చెందిన హరిబాబు దాడి చేశారని, అయినా ఇంకా అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నా మరోవైపు దళిత తేజం పేరుతో దళితులను టిడిపి మోసం చేస్తోందని విమర్శించారు. దాడులను నివారించకుంటే ఉధృత ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితురాలు దర్శి వనరాణి, ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం.నాగయ్య, సిపిఎం రాజధాని ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎం.రవి, కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి వై.కమలాకర్, వి.కిశోర్, కె.దుర్గారావు, మాలమహానాడు నాయకులు బి.రామకృష్ణారావు, జనచైతన్య ప్రచార కమిటీ అధ్యక్షులు ఎం.ఏసోబు, పి.ప్రభుదాసు, ఈ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ రింగురోడ్డుకు అభ్యంతరాలు తెలపండి


రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ట్రాఫిక్ సమస్య లేకుండా, అభివృద్ధికి నిధుల్లేకుండా ఇన్నర్ రింగురోడ్డు అవసరమా? అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ ప్రశ్నించారు. ఇన్నర్ రింగురోడ్డుపై స్థానిక రైతు సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని పేరుతో వేల ఎకరాలు తీసుకుని ఇంకా అభివృద్ధి ఏమి చేయలేదని, ఇప్పుడు ఇన్నర్ రింగురోడ్డు పేరుతో వేలాది ఎకరాలు 42 గ్రామాల నుండి సమీకరించడం దారుణమన్నారు. ఈ క్రమంలో 13వ తేదీన విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయానికి రైతులు తరలివచ్చి అభ్యంతరాలు తెలపాలని కోరారు. ఆ సంఘం మంగళగిరి డివిజన్ కార్యదర్శి ఏటుకూరి గంగాధరరావు మాట్లాడుతూ మార్చి 11, 12 తేదీల్లో ప్రభావిత గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. 11వ తేదీన రామచంద్రాపురం, నూతక్కి, రేవేంద్రపాడు సెంటర్, తుమ్మపూడి, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, చినకాకాని, కాజ, కంతేరు గ్రామాల్లోనూ, 12న తాడికొండ, మోతడక, కర్లపూడి, ఎండ్రాయి, పెదపరిమి, అనంతవరం, వడ్లమాను, వైకుంఠపురం, హరిశ్చంద్రపురంలో ప్రచారం ఉంటుందని వివరించారు. ఈ సమావేశానికి రాజధాని డివిజన్ అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సిఐటియు నాయకులు జెవి.రాఘవులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం

సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో అన్ని రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు అన్నారు. కార్మికులెదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించుకునేందుకు కార్మికులను సమీకరించి సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు విజయవాడ సెంట్రల్ సిటీ 15వ మహాసభ రెండో రోజైన బుధవారం జరిగిన ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ మహాసభలో బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి సరిగా నిధులు కేటాయించలేదన్నారు. ఉద్యోగభద్రతకు సరైన చర్యలు లేవన్నారు. పిఎఫ్‌పై వడ్డీరేటును కూడా తగ్గించి ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఈ మహాసభలో సిఐటియు పశ్చిమ కృష్ణా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.దుర్గారావు, ఎం.వి.సుధాకర్, శ్రామిక మహిళా జిల్లా నాయకులు ఎ.కమల తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి 90 లక్షల మంది నర్సులు అవసరం

కోల్‌కతా: సుస్థిరాభివ ద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఆరోగ్య సంరక్షణకు ప్రపంచవ్యాప్తంగా 2030నాటికి 90 లక్షల మంది కొత్త నర్సులు, ప్రసవ నిపుణులు అవసరమని ఐక్యరాజ్య సమితి ఆరోగ్య, ఉపాధి, ఆర్థిక వృద్ధి కమిషన్ నివేదిక వెల్లడించింది. ప్రధానంగా ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాల్లోని నర్సులు, ప్రసవ నిపుణుల కొరతను ఈ నివేదికలో ప్రస్తావించింది. ఆరోగ్య కార్మికుల కొరతలో నర్సులు, ప్రసవ నిపుణులే 50 శాతం ఉంటారని పేర్కొంది. ఆరోగ్య, సామాజిక రంగంలో విద్య, ఉపాధి కల్పనకు పెట్టే పెట్టుబడులు మూడు రెట్లు ఫలితాలను ఇస్తాయని వివరించింది. అన్ని రంగాల ఉద్యోగుల్లో మహిళల శాతం 41 శాతం ఉంటే, ఆరోగ్య, సామాజిక రంగాల్లో వారి శాతం 70గా ఉందని వివరించింది.

విజయోత్సవ సంబరం



మధ్యప్రదేశ్‌లో కోలారస్, ముంగోలి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఘన విజయం లభించడంతో భోపాల్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఆ పార్టీ కార్యకర్తలు

ఉప ఎన్నికల్లో బిజెపికి 'ఎదురుదెబ్బ '

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ 'విజయ బావుటా' ఒడిశాలో బిజెడి 'జయకేతనం '


భోపాల్ : వరుస పరాజయాలతో అల్లాడతున్న బిజెపికి మధ్యప్రదేశ్, ఒడిశా ఉప ఎన్నికల్లో మరోసారి చావుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్‌లోని కోలారస్, ముంగోలి స్థానాలలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ బావుటా ఎగురవేయగా, ఒడిశాలో బిజెడి మరోసారి తన సత్తాను ప్రదర్శించింది. ఫిబ్రవరి 24న జరిగిన ఉప ఎన్నికల కౌంటింగ్ బుధవారం జరిగింది. మధ్యప్రదేశ్‌లోని ముంగోలి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్ యాదవ్ 2,124 ఓట్ల ఆధిక్యతతో బిజెపి అభ్యర్థి బైసాహెబాద్ యాదవ్‌ను చిత్తుచేశారు. కోలారస్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్ర సింగ్‌యాదవ్ బిజెపి అభ్యర్థి దేవేంద్రజైన్‌పై 8, 083 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ శాసన సభ్యుల మృతి కారణంగా ఉప ఎన్నికలు అవసరమయ్యాయి. కాగా, ఒడిశాలోని బిజేపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రీటాసాహూ 41, 993 ఓట్ల భారీ మెజారిటీతో బిజెపి అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిని చిత్తు చేశారు. మొత్తం 21 రౌండ్ల ఓట్ల లెక్కింపు అనంతరం సాహూకి 1,02,871 ఓట్లు లభించగా, బిజెపి అభ్యర్థికి 60, 938 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 10,272 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.గత ఆగస్టులో కాంగ్రెస్ సభ్యుడు సుబాల్ సాహు మృతి కారణంగా ఈ ఉప ఎన్నిక అవసరమైంది. అయితే సాహు భార్య రీటా సాహు బిజెడిలో చేరడంతో ఆమెను తమ అభ్యర్థిగా అధికార పార్టీ బరిలోకి దించింది. కాగా, గతంలో బిజెడి శాసన సభ్యుడుగా వున్న అశోక్ పాణిగ్రాహి ఆ పార్టీ నుండి వైదొలగి బిజెపిలో చేరారు. ఆయనను బిజెపి తమ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దింపినా శృంగభంగం తప్పలేదు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని ఈ ఎన్నికలు నిరూపించాయని బిజెడి నేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు.

ఎన్డీయేకు బీహార్ మాజీ సిఎం జితన్ మాంజీ 'గుడ్‌బై' !



పాట్నా : బీహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందూస్థాన్ అవామ్ మోర్చా (సెక్యులర్) నేత జితన్ రామ్ మాంజీ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) నుంచి బయటకు రానున్నారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం వెల్లడిం చారు. రాష్ట్రీయ జనతాదళ్ నేతృత్వంలోని మహా కూటమిలో చేరనున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బుధవారం ఉదయం మాంజీ నివాసానికి వెళ్ళి రహస్య సమాలోచనలు జరిపారని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఆ తరువాత ఎన్డీయే నుంచి బయటకు వస్తున్నట్లు మాంజీ ప్రకటించారని పేర్కొన్నారు. జహ్నాబాద్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని మాంజీ భావించారు, కాని ఆ స్థానాన్ని అధికార కూటమిలో భాగస్వామైన జెడి(యు)కు బిజెపి కేటాయించింది. జెడి(యు) అభ్యర్థిగా అభిరామ్ శర్మను ఎంపిక చేశారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని మాంజీ ఎన్డీయే నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నారు.

మహారాష్ట్రలో అందరూ మరాఠీలోనే మాట్లాడాలి : కాంగ్రెస్ చీఫ్ సంజయ్‌నిరుపమ్



ముంబయి : మహారాష్ట్రలో నివసించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మరాఠీలోనే మాట్లాడాలని, అలాగే నిజాయితీగా, నిస్పష్టంగా ప్రయత్నిస్తే మరాఠీ భాష జీవించి ఉంటుందని ముంబయి కాంగ్రెస్ చీఫ్ సంజయ్ నిరుపమ్ సూచించారు. సోమవారం శాసనసభలో గవర్నర్ విద్యాసాగరరావు ప్రసంగం అనంతరం తలెత్తిన వివాదంపై ఆయన పైవిధంగా స్పందించారు. అలాగే మంగళవారం విధాన సభలో జరిగే మరాఠీ భాషా గౌరవ దినం సందర్భంగా మరాఠీ అభిమాన గీతాన్ని వినిపించలేదని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్ర అసెంబ్లీలో మరాఠీకి సాంప్రదాయపు భాషగా గుర్తింపునివ్వాలని ఎన్‌సిపి నేత జయంత్ పాటిల్ డిమాండ్ చేశారు.. మూడున్నర సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరాఠీ భవన్ నిర్మాణాన్ని చేపడతామని ఇచ్చిన హామీని ఇంతవరకూ నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నపుడు మరాఠీ భాషకు గుర్తింపును ఇచ్చిందని అన్నారు. సిబిఎస్ఇ, సిఐఎస్‌సిఇ పాఠశాలల సిలబస్‌లో 10వతరగతి వరకు మరాఠీ భాషను తప్పనిసరి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ త్వాడే అన్నారు. కాగా, ప్రస్తుతం సిబిఎస్ఇ, సిఐఎస్‌సిఇ సిలబస్ ఉండే పాఠశాలల్లో, ఇండియన్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్‌లోనూ మరాఠీ భాష ఎనిమిదవ తరగతి వరకు తప్పనిసరి లాంగ్వేజ్‌గా ఉందని అన్నారు.

అత్వాల్ పర్యటనతో భారత్‌కు సంబంధం లేదు

విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : భారత అధికారుల అనాలోచిత చర్యల వల్లనే ఖలిస్తాన్ అనుకూల కార్యకర్త జస్పాల్ అత్వాల్ భారత్ సందర్శించారని కెనడా నివేదికలు పేర్కొనడాన్ని విదేశాంగ మంత్రిత్వశాఖ తోసిపుచ్చింది. అత్వాల్ పర్యటనతో భారత్‌కు ఏ విధమైన సంబంధం లేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. గతవారం కెనడా ప్రధాని ట్రుడెయు భారత్ పర్యటన సందర్భంగా అత్వాల్ పర్యటన తీవ్ర గందరగోళం సృష్టించింది. ముంబయిలో కెనడా హై కమిషనర్ నిర్వహించిన కార్యక్రమంలో గానీ లేదా న్యూఢిల్లీలో కెనడా హైకమిషనర్ ఇచ్చిన విందులో గానీ జస్పాల్ అత్వాల్ పాల్గొనడంలో భారత ప్రభుత్వం పాత్ర ఎంతమాత్రమూ లేదని అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి వచ్చే వార్తలన్నీ నిరాధారం, ఆమోదయోగ్యం కానివని పేర్కొన్నారు. అధికార కార్యక్రమాల్లో అత్వాల్ పాల్గొనడంపై దర్యాప్తు చేస్తామని కెనడా ప్రధాని హామీ ఇచ్చారు. 1980వ దశకంలో హత్యా యత్నం అభియోగాలు అత్వాల్‌పై నమోదయ్యాయి. పైగా ఖలిస్తానీ వేర్పాటువాదంపై ఆయన అభిప్రాయాలు వివాదాస్పదమయ్యాయి.

కార్తీ చిదంబరం అరెస్టు

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అదుపులోకి తీసుకున్న సిబిఐ
- బ్యాంకు కుంభకోణాల దృష్టి మళ్లించేందుకే : కాంగ్రెస్



చెన్నై విమానాశ్రయం వద్ద కార్తీ అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

న్యూఢిల్లీ / చెన్నయ్ : కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని సిబిఐ ఆర్థిక నేరాల ప్రత్యేక విభాగం అధికారులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. లండన్ నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కార్తీని సిబిఐ అధికారులు అరెస్టు చేవారు. అనంతరం ఆయనను బుధవారం సాయంత్రమే న్యూఢిల్లీ తీసుకువెళ్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి కార్తీని ప్రశ్నించేందుకు అధికారుల బృందం ఆయనను కస్టడీలోకి తీసుకున్నదని సిబిఐ అధికారి ఒకరు వెల్లడించారు. విచారణ సమయంలో కార్తీని తన న్యాయవాదులను కలిసి చర్చించేందుకు పది నిమిషాల సమయాన్ని దర్యాప్తు అధికారులు ఇచ్చారు. ఆ తర్వాత విచారణ కొనసాగించారు.

'కార్తీ మేము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానలివ్వకుండా దాటవేస్తూ వచ్చారు. సిబిఐ సేకరించిన సాక్షాధారాలకు భిన్నంగా ఆయన బదులిచ్చారు. సమన్లు తీసుకునేందుకు కూడా ఆయన నిరాకరించారు. దర్యాప్తు జాప్యం జరగడానికి ఇదే ప్రధానకారణం. అందువల్లే మా బృందం ఆయనను అరెస్టు చేయాల్సివచ్చింది' అని సిబిఐ అధికారి ఒకరు తెలిపారు. లండన్ పర్యటనలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం కుమారుడి అరెస్టు వార్త తెలిసి వెంటనే తన పర్యటనను కుదించుకొని తిరుగుముఖ మయ్యారు. బుధవారం రాత్రికే ఆయన న్యూఢిల్లీ చేరుకుంటారని వార్తా సంస్థలు బుధవారం మధ్యాహ్నం పేర్కొన్నాయి. తనను, తన కుటంబ సభ్యులను సిబిఐ, ఇడి వంటి దర్యాప్తు సంస్థలు వేధింపులకు గురి చేస్తున్నాయని ఇదివరకే చిదంబరం సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

2017 మే నెలలో కార్తీ, మెస్సర్స్ ఐఎన్‌ఎక్స్ మీడియా (ప్రైవేట్) లిమిటెడ్‌కు చెందిన అప్పటి డైరెక్టర్లు ఇంద్రాణి ముకర్జియా, ప్రీతమ్ ముకర్జియా అలియాస్ పీటర్ ముకర్జియా, చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, అడ్వంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టెన్సీ (ప్రైవేట్) లిమిడెట్ (ఎఎస్‌సి) తదితరులపై సిబిఐ కేసు నమోదు చేసింది. చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు దాని డైరెక్టర్ కార్తీ ప్రాతినిధ్యం వహించగా, అడ్వంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టెన్సీ (ప్రై) లిమిటెడ్‌కు దాని డైరెక్టర్ పద్మ విశ్వనాథన్, ఇతరులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖలో గుర్తుతెలియని అధికారులపై నేర కుట్ర, మోసం, అవినీతి అభియోగాలతో సిబిఐ కేసు నమోదు చేసింది.

బ్యాంకు కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించేందుకే : కాంగ్రెస్

దేశంలో చోటు చేసుకుంటున్న బ్యాంకు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే సిబిఐని పావుగా చేసుకొని కార్తీ చిదంబరంను బిజెపి అరెస్టు చేయించిందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇంఛార్జీ రణ్‌దీప్ సుర్జేవాలా, సీనియర్ నేతలు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ విమర్శించారు. రాజకీయ కక్షపూరిత చర్యల్లో భాగంగానే బిజెపి ఈ కుట్రకు పాల్పడిందని ఆరోపించారు. కార్తీ చిదంబరం అరెస్టును బిజెపి అనుసరించిన దృష్టి మళ్ళింపు ఎత్తుగడగా కాంగ్రెస్ పేర్కొంది.

చట్టానికి ఎవరూ అతీతులు కారు : బిజెపి

కార్తీ చిదంబరం ఐఎన్‌ఎక్స్ మనీలాండరింగ్ కేసులో సిబిఐ అరెస్టు చేసిన నేపథ్యంలో చట్టానికి ఎవరూ అతీతులు కారని బిజెపి వ్యాఖ్యానించింది. "ఏ ఒక్కరిని చట్టానికి అతీతంగా పరిగణించలేమని నేను విశ్వసిస్తున్నాను. చట్టం తనపని తాను చేసుకుపోతుంది, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపాల్సిందే." అని బిజెపి నేత సాంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు. అలోక్ వర్మ నేతృత్వంలోని ప్రస్తుత సిబిఐ బృందం కార్తీ అరెస్టుతో తన ప్రతిష్ఠతను పెంచుకుందని బిజెపి నేత సుబ్రమణ్యస్వామి ప్రశంసించారు.

సిబిఎస్ఇ పదోతరగతి విద్యార్థులకు ఉత్తీర్ణతా మార్కుల్లో మినహాయింపు

న్యూఢిల్లీ : పదో తరగతిపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉత్తీర్ణతా మార్కులలో సిబిఎస్ఇ కొంత మినహాయింపునిచ్చింది. ఈ నెల 5 నుంచి పదో తరగతి బోర్డు పరీక్షలు జరగనున్నాయి. బోర్డు పరీక్షల్లోనూ, ఇంటర్నల్ ఎస్సెస్‌మెంట్‌లోనూ రెండిటిలోనూ ఉత్తీర్ణతా మార్కులు సాధించడానికి బదులు మొత్తం మీద 33 శాతం మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులయినట్లేనని బోర్డు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇది 'వన్‌టైమ్' చర్యేనని తెలిపింది. ప్రస్తుత సంవత్సర విద్యార్థులు గత సంవత్సరం తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు వివిధ ఎస్సెస్‌మెంట్ ప్రక్రియలను ఎదుర్కొన్నారని, అందువల్ల ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు మినహాయింపునిస్తున్నామని తెలిపింది. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థుల కోసం సిబిఎస్ఇ సమగ్ర నిరంతర మూల్యాంకన పద్ధతిని ప్రవేశపెట్టింది. అయితే 2017లో ఈ విధానాన్ని విరమించుకుంది.

ఎంపీల అలవెన్సుల పెంపునకు కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ : పార్లమెంట్ సభ్యుల అలవెన్సులను పెంచాలన్న ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోద ముద్ర వేసింది. దీంతో నియోజకవర్గ అలవెన్స్, ఫర్నిచర్, కమ్యూనికేషన్ అలవెన్స్‌లు గణనీయంగా పెరగనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గం అలవెన్స్ ప్రస్తుతం నెలకు రు.45వేలుగా వుంది. దాన్ని రు.60వేలకి పెంచాలని పార్లమెం టరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఒకసారి ఇచ్చే ఫర్నిచర్ అలవెన్స్‌ను రు.75వేల నుండి లక్ష రూపాయిలకు పెంచాలని కూడా ప్రతిపాదించింది. పార్లమెంట్ సభ్యులకు ప్రతి ఐదేళ్ళకూ ఒకసారి వేతనాల సవరణ కోసం శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు.

సైన్స్‌డే అతిథిగా డార్విన్ సిద్ధాంత వ్యతిరేకి సత్యపాల్



న్యూఢిల్లీ : డార్విన్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన హెచ్‌ఆర్‌డి మంత్రి సత్యపాల్‌సింగ్‌ను సైన్స్‌డేకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. సత్యపాల్ సింగ్ గతంలో డార్విన్ జీవ పరిణామక్రమం సాంకేతికంగా తప్పు అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇదే సదస్సుకు మరో మాజీ ఐపిఎస్ అధికారినీ ఆహ్వానించారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. అయితే సాంకేతికంగా జరిగే అంశాల్లో మంత్రి పాల్గొనరని నిర్వాహకులు అవినాష్ ఖరే తెలిపారు. కేంద్రమంత్రులు హర్షవర్ధన్, ప్రకాష్ జవదేకర్ అందుబాటులో లేకపోవడంతో సత్యపాల్‌సింగ్‌ను పిలవాల్సి వచ్చిందని తెలిపారు.


ప్రధాని శుభాకాంక్షలు

ప్రధాని నరేంద్రమోడీ సైన్స్‌డే సందర్భంగా సైన్స్ ప్రియులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మన శాస్త్రవేత్తల పట్ల భారత్ చాలా గర్వంగా ఉందనీ ట్విట్టర్‌లో ఆయన పేర్కొన్నారు. సైన్స్‌డే గురించి ఆయన తన 41వ ఎడిషన్ మన్‌కీ బాత్ కార్యక్రమంలో వివరించారు.

పోలీసులకు లొంగిపోయిన బిజెపి నేత

పాట్నా : బీహార్‌లోని ముజఫర్‌నగర్ హిట్ అండ్ రన్ కేసులో నిందితుడైన బిజెపి నాయకుడు మనోజ్ బైతా బుధవారం ఉదయం పోలీసులకు లొంగిపోయాడు. అతను ఫిబ్రవరి 24న ముజఫర్ జిల్లా ధన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వెలుపల తన కారుతో తొమ్మిది మంది పిల్లల మరణానికి కారణమై, 20 మందిని గాయపరిచాడు. అతనూ గాయపడి ఉండటంతో అతనిని పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైనందుకు బిజెపి బైతాను ఆరు సంవత్సరాల పాటు సస్పెండ్ చేసింది.

జెఎన్‌యు విద్యార్థి నజీబ్ అదృశ్యం కేసులో సిబిఐకి ఇంకా లభించని ఆధారాలు



న్యూఢిల్లీ : అంతుబట్టని పరిస్థితుల్లో కనిపించకుండా పోయిన జెఎన్‌యు విద్యార్థి నజీబ్ అహ్మద్ ఆచూకి కనుగొనడంలో సిబిఐ పూర్తిగా విఫలమైంది. నజీబ్ అదృశ్యానికి సంబంధించి సిబిఐ వద్ద ఇప్పటి వరకు ఎటువంటి ఆధారాలు లేవు. ఈ కేసులో తమకు ముఖ్యమైన ఆధారం లభించిందని సిబిఐ సోమవారం తెలిపినప్పటికీ ఢిల్లీ హై కోర్టులో చెప్పిన దాని ప్రకారం సిబిఐ వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలుస్తోంది. నజీబ్ అదృశ్యమవ్వడానికి ముందు అతనిపై దాడి జరిపిన 9 మంది విద్యార్థులకు సంబంధించిన మొబైల్ ఫోనులో కాల్ వివరాలు, వాట్సప్ సందేశాలు, లొకేషన్ వివరాలపై ఫోరెన్సిక్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని సిబిఐ ఢిల్లీ కోర్టులో తెలిపింది. నజీబ్ అహ్మద్ ఆచూకి కనుగొనడంలో ఢిల్లీ పోలీసులు విఫలమైన తరువాత ఈ కేసును 2017, మే 16న సిబిఐకి అప్పగించారు. నజీబ్ అహ్మద్ జెఎన్‌యులో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు. జెఎన్‌యుకు చెందిన మహి మండ్వి హాస్టల్ నుండి అక్టోబరు 15, 2016 నుండి కనిపించకుండా పోయాడు. అంతకుముందు రాత్రి కొంతమంది ఎబివిపి విద్యార్థులతో ఘర్షణ జరిగిన నేపథ్యంలో నజీబ్ అహ్మద్ కనిపించకుండా పోయాడు.

రఫెల్ బాగోతం

అర్ధసత్యాలతో మభ్యపెడుతున్న ఎన్డీయే సర్కారు

- 'రఫెల్' కుంభకోణం గుట్టువిప్పిన మాజీ రక్షణ మంత్రి ఆంటోనీ



న్యూఢిల్లీ: రఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్ల వ్యవహారంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అర్ధసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మాజీ రక్షణ మంత్రి ఎకె ఆంటోనీ విమర్శించారు. ఈ వ్యవహారంపై కేంద్రం చెబుతున్న అబద్ధాలతో, ఇందులోని వాస్తవాలు వెల్లడించాలన్న డిమాండ్ క్రమంగా ఊపందుకుంటోంది. ఈ ఒప్పందంపై నరేంద్రమోడీ హయాంలో మరోసారి చర్చలు జరగటంతో దీనిపై మెరుగైన ధరకు, తేలికయిన షరతులతో తాజా ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. రఫెల్ యుద్ధ విమానం ఒక్కోదానికి రు.1,700 కోట్ల ధరతో ఒప్పందం కుదిరినట్లు స్పష్టమవుతుండటంతో ఇందులో కుంభకోణం జరిగిందన్న అనుమానాలకు తావిస్తోంది. యుపిఎ-2 ప్రభుత్వ హయాంలో ఒక్కో విమానానికి కుదిరిన ధర కన్నా రు.526 కోట్లు తక్కువ ధరతో తాము ఒప్పందం కుదుర్చుకున్నామని చెబుతున్నప్పటికీ, రు.1700 కోట్ల తాజా ఒప్పందంలో రు.670 కోట్ల మేర అధికంగా చెల్లించేందుకు మోడీ అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే 'జాతీయ భద్రత' పేరుతో మోడీ సర్కారు ఈ ఒప్పందంపై పరిశీలనను దాటవేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ప్రధాని నరేంద్రమోడీ నేరుగా ఈ విమానాల తయారీ సంస్థ డస్సాల్ట్‌తో చర్చలుజరపటం, అధికధర చెల్లించేందుకు అంగీకరించటం, ముఖ్యంగా ప్రభుత్వ రంగంలోని విమాన తయారీ సంస్థను పక్కనబెట్టి కార్పొరేట్ సంస్థకు పెద్దపీట వేయటం వంటి చర్యలు అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయి. రఫెల్ యుద్ధ విమానం కొనుగోలుతో భారత ఆర్థిక వ్యవస్థపై ఏ మేర భారం పడుతుందన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోంది. దీనితో పాటు ప్రభుత్వరంగంలోని హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ సంస్థను ఈ కొనుగోళ్ల వ్యవహారం నుండి ఎందుకు తప్పించారన్న ప్రశ్న కూడా జవాబులేనది గానే మిగిలిపోతోంది. సైనిక ఉత్పత్తుల రంగంలో ఏ మాత్రం అనుభవం లేని ఈ సంస్థకు ఏ ప్రాతిపదికన ఈ కాంట్రాక్ట్ అప్పగించారన్న ప్రశ్నకు మాత్రం ప్రధాని సన్నిహితులైన వ్యక్తులకు సంబంధించిన కార్పొరేట్ సంస్థకు ఈ వ్యవహారంలో ప్రమేయం వుండటంతో డస్సాల్ట్ సంస్థ తెరపైకి వచ్చిందన్న సమాధానం వినిపిస్తోంది. ఈ ప్రమేయానికి ప్రతిఫలంగా వారికి రు.29వేల కోట్ల రూపాయలు ముట్టినట్లు తెలుస్తోంది. ఒక్కో విమానం ధర, విమానం బాడీ, దాని విడిభాగాలు యుపిఎ హయాంలో కుదిరిన ఒప్పందంలోని ధరలతో ఏ విధంగా సరిపోల్చారన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. ఈ అంశంపై ఇప్పటి వరకూ మౌనం పాటించిన మాజీ రక్షణ మంత్రి ఎకె ఆంటోనీ ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యవహారంలోని గుట్టును విప్పారు. రఫెల్ విమాన ధరల్లో 300 శాతం మేర పెంచటంతో కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం నేపథ్యంలో ఈ ఫైళ్లను వాపస్ తీసుకుంటున్నామని రక్షణ మంత్రి చెబుతున్నారు. గత యుపిఎ-2 ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ వ్యవహారంలో కొన్ని ఎంపిక చేసిన వాస్తవాలను మాత్రమే చెబుతూ ప్రస్తుత రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అనైతికంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఆర్థిక పరమైన ఆమోదం కోసం రక్షణ మంత్రిత్వశాఖ ఆర్థిక మంత్రిత్వశాఖను సంప్రదించినపుడు ఈ విమానాల జీవితకాలం, ధర షరతుల (లైఫ్‌సైకిల్ కాస్ట్ క్లాజ్) అంశంలో నిరాకరించిందని, ఈ వ్యయం దీర్ఘకాలంలో ప్రభుత్వ ఖజానాకు భారంగా పరిణమిస్తుందని ఆర్థిక శాఖ అభిప్రాయపడిందని ఆయన వివరించారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో వున్న బిజెపితో సహా ఇతర పక్షాల నేతలు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆంటోనీ చెప్పారు. అప్పటికే యుపిఎ ప్రభుత్వ పదవీకాలం ముగియనుండటంతో ఈ ఫైళ్లను తాను వెనక్కి తీసుకున్నానని, ఆర్థిక మంత్రిత్వశాఖ నిరాకరణతో ఈ ప్రతిపాదనలను భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ(సిసిఎస్)కి పంపేందుకు మార్గం మూసుకుపోయిందని చెప్పారు. అందువల్లే తాను ఈ ఫైళ్లను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించానన్నారు. లైఫ్‌సైకిల్ కాస్ట్ విషయంలో ఎటువంటి పరిష్కారం లభించకుండా ఈ ప్రతిపాదనలను సిసిఎస్‌కు పంపలేమని ఆయన స్పష్టం చేశారు. వాయుసేన కోరిక మేరకే తాము ఈ ఒప్పందంలో లైఫ్‌సైకిల్ కాస్ట్ క్లాజ్‌ను పొందుపర్చామన్న ఆంటోనీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ క్లాజ్‌ను తొలగించి 36 రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు అంగీకరించిందా? అని ప్రశ్నించారు. దీనిపై యుపిఎ ప్రభుత్వ హయాంలో జరిపిన చర్చల్లో 126 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి 2007లో ప్రతిపాదనలను ఆహ్వానించినపుడు నాలుగు షరతులను విధించామని ఆయన గుర్తు చేశారు. ఇందులో ముఖ్యంగా తొలుత 18 విమానాలను కొనుగోలు చేస్తామని, మిగిలిన 108 విమానాల తయారీ లైసెన్స్‌ను ప్రభుత్వ రంగంలోని హెచ్‌ఎఎల్ సంస్థకు ఇస్తామని, ఇందుకు సంబంధించిన పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాలని, విమానాల నిర్వహణా బాధ్యతలను చెరిసగం నిర్వహించాలని, లైఫ్ సైకిల్ కాస్ట్ క్లాజ్‌కు అంగీకరించాలని ఈ నాలుగు షరతుల్లో పేర్కొన్నట్లు ఆయన వివరించారు. ఇప్పుడు 36 విమానాలను కొనుగోలుచేయాలన్న నిర్ణయంతో తొలి రెండు షరతులను ప్రభుత్వం విస్మరించిం దని ఆయన చెప్పారు. రక్షణ కొనుగోళ్ల మండి ఒప్పందంలో భాగంగానే ఈ నాలుగు షరతులను అప్పటి ప్రభుత్వం విధించిందన్న ఆంటోనీ, ఈ షరతుల్లో రెండింటిని పక్కన పెట్టాలన్న నిర్ణయం మరో ప్రధానమైన ప్రశ్నకు దారి తీస్తోం దన్నారు. ఈ మార్పు లేకుండా 36 యుద్ధ విమానాలను ఏకపక్షంగా కొనుగోలు చేయటం రక్షణ కొనుగోళ్ల విధానానికే విరుద్ధమన్నారు. దీనితో పాటు ఈ విధానంలో ప్రైవేటు రంగంలోని కంపెనీలను ఎంపిక చేసే సమయంలో కొన్ని అర్హతా నిబంధనలు పెట్టామని, ఇందులో రక్షణ ఉత్పత్తుల రంగంలో విశ్వసనీయమైన ట్రాక్ రికార్డ్ వుండాలన్నది ఒకటని ఆయన చెప్పారు. రఫెల్ ఒప్పందంలో ఈ అంశాన్ని ఎందుకు విస్మరించారో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడ్మిరల్ గోర్షకోవ్ విమాన వాహకనౌక, మిరేజ్ యుద్ధ విమానాల కొనుగోలు వంటి వాటిల్లో ప్రభు త్వం అనుసరించిన విధానాలను ఆయన వివరిస్తూ రక్షణ ఉత్పత్తుల రంగంలో ట్రాక్ రికార్డు వంటిదేమీ లేకుండా నేరుగా రఫెల్ విమానాల ధరలనునిర్ణయించటం దేశ భద్రతతో రాజీ పడటమే అవుతుందని స్పష్టంచేశారు. రక్షణ కొనుగోళ్ల వ్యవహారం సమాచార హక్కు పరిధిలోకి వస్తోం దన్న ఆయన ఇప్పటి వరకూ రక్షణ కొనుగోళ్లన్నీ తెరచాటు వ్యవహారంలా జరిగాయని, జాతీయ భద్రత పేరుతో దీనిపై ఎదురయ్యే ప్రశ్నలన్నింటినీ తొక్కిపట్టారని ఆయన గుర్తు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన పద్ధతుల్నే తాము అనుసరిస్తున్నామని బిజెపి ప్రభుత్వం చెప్పటం అర్ధసత్యం మాత్రమేనని, యుపిఎ ప్రభుత్వ హయాంలో రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన సమాచారం మొత్తం ప్రజ లకు అందుబాటులో వుండేదని వివరించారు. దానిపై తరచు చర్చలు కూడా జరుగుతుండేవని ఆయన గుర్తు చేశా రు. ఈ కొనుగోళ్ల విషయంలో యుపిఎ ప్రభుత్వం విధించిన షరతులు నాలుగు రెండుగా మారిన అంశంపై ఎదురయ్యే ప్రశ్నలకు బిజెపి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం వుందన్నారు.

సంక్షిప్తం

ఉత్తరప్రదేశ్‌లో పది మంది ఐపిఎస్ ఆఫీసర్ల బదిలీ

లక్నో : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బుధవారం పదిమంది ఐపిఎస్ ఆఫీసర్లతో పాటు మహిళా పవర్‌లైన్(1090)కు చెందిన ఐజి నవనీత్ సికారాను బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. జిడిపి బ్రిజిజి కార్యాలయంతో పాటుగా, ఎడిజి అవినీతి నిరోధకసంస్థను కలిపి ఎడిజి వుమెన్ పవర్ లైన్(1090)ను ఎడిజి క్రైమ్‌కు చెందిన అంజు గుప్తా ప్రవేశపెట్టారు. ఈ సంస్థను 2012లో మహిళలకు భద్రత, వారిపై జరిగే దాడులను నిరోధించడానికి ఏర్పాటు చేసినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఎడిజికి చెందిన ఎస్‌కె. కౌల్‌ను ఎడిజి క్రైమ్‌సెల్‌కు, సిబి సిఐడి సునీల్ గుప్తాను మొర్దాబాద్ పోలీస్ అకాడమీకి మార్చినట్లు తెలిపారు. సికారాను అల్హాబాద్ (భవనాలు, సంక్షేమం శాఖ)కు ఐజిగా, అలాగే విజయ్ ప్రకాష్‌ను ఐజిగా నియమించినట్లు తెలిపారు.

మిలాన్ కార్యక్రమంపై వివరణ ఇచ్చిన మాల్దీవులు

న్యూఢిల్లీ : మార్చి 6న మిలాన్ పేరుతో భారత్ నిర్వహించే నావికా దళ విన్యాసాల్లో పాల్గొనటానికి నిరాకరించిన మాల్దీవులు దానికి గల కారణాన్ని వివరణ ఇచ్చింది. ప్రస్తుతం మాల్దీవుల్లో ఉన్న అత్య వసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి మాల్దీవులు నావికాధికారులు కేవలం పరిశీల కులుగా మాత్రమే ఉంటారని, వారు లేకపో వడం అసాధారణమైనది కాదని పేర్కొంది. ఎనిమిది రోజుల పాటు సాగే మెగా నావిక దళ విన్యాసాల్లో పాల్గొడానికి భారత్ ఆహ్వానించినా తిరస్కరించాల్సి వచ్చిందని పేర్కొంటూ ఢిల్లీలోని మాల్దీవుల ఎంబసీ ప్రకటన చేసింది.

23 మంది ఖైదీలకు హెచ్‌ఐవి

లక్నో : గోరఖ్‌పూర్ జైల్లో సుమారు 23 మంది ఖైదీలు హెచ్‌ఐవి బారిన పడినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. యూపీలోని ఉన్నావో జిల్లా, బంగార్‌మావు తాలూకా పరిధిలోని మూడు గ్రామాల్లో 58 మంది ఈ వ్యాధి బారిన పడినట్లు ప్రకటించిన కొద్దిసేపటికే ఖైదీలకు కూడా హెచ్‌ఐవీ ఉందన్న అనుమానం మొదలైంది. దీనితో అధికారులు ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఈ విషయం వెల్లడైంది. హెచ్‌ఐవీ ఖైదీల్లో ఎక్కువ మంది విచారణ ఖైదీలేనని అధికారులు తెలిపారు. ఈ వైద్య పరీక్షలను రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిబ్బంది పర్యవేక్షణలోనే నిర్వహించామని గోరఖ్‌పూర్ జైలు సూపరిటెండెంట్ రంధానీ మిశ్రా తెలిపారు. ఈ పరీక్షల్లో మహిళతో సహా 23 మందికి హెచ్‌ఐవీ పాజిటివ్ అని నిర్ధారణ అయ్యిందని, వీరందరూ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు.

అంతరిక్షం నుంచి సురక్షితంగా భూమికి చేరిన వ్యోమగాములు



సురక్షితం కజికిస్థాన్‌లో ల్యాండ్ అయిన నాసా వ్యోమగామి జోయ్ అకాబాను సురక్షితంగా తీసుకు వెళ్ళుతున్న సిబ్బంది

కజకిస్థాన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ ప్రణాళికలకు పనిచేసిన ముగ్గురు వ్యోమగాములు తిరిగి సురక్షితంగా భూమికి చేరారు. బుధవారం ఉదయం వారు కజికిస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు. రష్యాకు చెందిన అలెగ్జాండర్ మిసర్కిన్, అమెరికా లోని నాసా వ్యోమగాములు మార్క్ వాండే, జోయ్ అకాబా.. ఈ ముగ్గురు సురక్షితంగా ఉన్నారని రష్యా స్పేస్ ఏజెన్సీ వెల్లడించింది. 40 ఏళ్ల మిసర్కిన్ రెండు మిషన్లలో 334 రోజులు అంతరిక్షంలో ఉన్నారు. 50ఏళ్ల జోయ్ అకాబా మూడు మిషన్లలో కలిపి పది నెలలు అంతరిక్షంలో ఉన్నారు. మరో వ్యోమగామి మార్క్ వాండే తొలిసారి అంతరిక్షంలో ఉండి వచ్చారు.

ఉత్తర కొరియా, అమెరికా మధ్య ప్రత్యక్ష చర్చలు

చైనా ఆశాభావం

బీజింగ్ : ఉత్తర కొరియా, అమెరికా మధ్య ప్రత్యక్ష చర్చలు జరగాలని భావిస్తున్నట్లు చైనా తెలిపింది. త్వరలోనే ఆ మేరకు చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లూ కాంగ్ తెలిపారు. సరైన పరిస్థితుల్లోనే ఉత్తర కొరియాతో చర్చలు జరగగలవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. అమెరికాతో చర్చలకు తాము సుముఖంగానే వున్నామని ఉత్తర కొరియా పేర్కొన్న తర్వాత ట్రంప్ పై రీతిన వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు సడలాయని లూకాంగ్ పేర్కొన్నారు. వింటర్ ఒలింపిక్స్ ముగిసిన తర్వాత ఇరు దేశాల మధ్య కొంతమేరకు అవగాహన వచ్చిందని, అది అలాగే కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చర్చల ద్వారా ఉత్తరకొరియా అణు సమస్యను పరిష్కరించడానికి ఈ పరిస్థితులన్నీ దోహదపడగలవని అన్నారు. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య చర్చలు అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ప్రత్యక్ష చర్చలకు వీలు కలగిస్తాయని చైనా ఆశిస్తోందని లూ పత్రికా సమావేశంలో పేర్కొన్నారు.

అమెరికా సైనిక స్థావరంలో కవర్ కలకలం!

వాషింగ్టన్ : వాషింగ్టన్‌కు సమీపంలోని అమెరికా సైనిక స్థావరానికి వచ్చిన ఒక కవ ర్‌ను విప్పిచూసిన వెంటనే 11మంది నావి కులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే దర్యాప్తు చేపట్టాల్సిందిగా అధికారులు ఎఫ్‌బిఐని ఆదేశించారు. వర్జీనియాలోని ఆర్లింగ్టన్‌లో గల సైనిక స్థావరానికి వచ్చిన ఆ కవర్‌ను ఒక సార్జెంట్ తెరిచాడు. అందులో గుర్తు తెలియని పదార్థం వుంది. వెంటనే చుట్టు పక్కల వారికి చేతులు, ముఖానికి దురదలు మొదలయ్యాయి. ముక్కుల వెంట రక్తం పడిందని నావికాదళ అధికారి తెలిపారు. దాంతో ఆ భవనాన్ని ఖాళీ చేసేశారు. ఆ కవ ర్‌కు అన్ని పరీక్షలు నిర్వహిం చామని, అయితే అందులో ప్రమాదకరమైన పదార్థమేదీ లేదని వెల్లడైనట్లు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తెలిపారు. తదుపరి విశ్లేషణ నిమిత్తం ఆ కవర్ ను క్వాంటికోలోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఎఫ్‌బిఐ తెలిపింది.

బాండ్ చిత్రాల దర్శకుడు మృతి




లండన్ : "ద స్పై హూ లవ్డ్ మి", "యూ ఓన్లీ లైవ్ ట్వైస్" "మూన్‌రేకర్ " వంటి జేమ్స్ బాండ్ చిత్రాలతో ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులను అలరించిన ప్రముఖ నిర్మాత, దర్శకుడు లెవిన్ గిల్బర్ట్ (97) బుధవారం మృతి చెందారు. అల్ఫీ చిత్రంతో హాలీవుడ్‌లో విశేష గుర్తింపు పొందిన గిల్బర్ట్ మృతి వార్తను బాండ్ చిత్రాల నిర్మాతలైన మిచెల్ జి. విల్సన్, బార్బరా బ్రకోలి ధ్రువీకరించారు. ఆయన బ్రిటీష్ చలన చిత్ర పరిశ్రమకు, బాండ్ చిత్రాలకు విశేష సేవలనం దించారని, ఆయన బాండ్ చిత్రాలు బ్రిటన్‌లో మాత్రమే కాదు ప్రపంచమంతటా ఉన్న అభిమానులను విశేషంగా అలరించాయని, మంచి దర్శకుడిని కోల్పోయామని అన్నారు.

లేబర్ పార్టీ ప్రధానకార్యదర్శి పదవికి పెరుగుతున్న పోటీ

లండన్ : ప్రస్తుతం ప్రతిపక్ష లేబర్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఇయాన్ మెక్ నికోల్ వారసులుగా ఎన్నికయ్యేందుకు పోటీ పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తాను ఈ పదవికి పోటీ చేయనున్నట్లు యునైట్ సౌత్ ఈస్ట్ ప్రాంతీయ కార్యదర్శి జెన్నీ ఫార్మ్‌బీ బుధవారం ప్రకటించారు. తాను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైతే పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించి అధికారంలోకి తెచ్చేందుకు, జెరిమీ కార్బిన్‌ను ప్రధానిగా ఎన్నుకునేందుకు కృషి చేస్తానని ఆమె ట్విట్టర్‌లో పేర్కొ న్నారు. ఇదిలా వుండగా మూమెంటమ్ వ్యవస్థాపకుడు జాన్ లన్స్‌మన్ కూడా ఈ పదవికి పోటీ పడే అవకాశాలు న్నట్లు తెలుస్తోంది.

లేబర్ పార్టీ ప్రధాన కార్యాలయ అధిపతిని సంప్రదాయకంగా పార్టీ జాతీయ కార్యవర్గం (ఎన్ఇసి) నియమిస్తుంది. ఈ పదవికి మితవాదులెవరూ పోటీ పడకుండా నివారించేందుకు ఒకరికన్నా ఎక్కువ మంది వామపక్షవాదులు పోటీ చేసేందుకు అవకాశం వుంది. ఎన్ఇసిలో యునైట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫార్మ్‌బీ





మీడియాతో మాట్లాడుతూ లేబర్ పార్టీ బలం ముఖ్యంగా లక్షలాది మంది ఓటర్ల మద్దతు, బ్రిటన్‌లో వున్న అన్ని పార్టీల కన్నా విస్తృత స్థాయిలో వున్న సభ్యత్వం, కార్మిక సంఘాలతో కొనసాగిస్తున్న అనుబంధం వంటి మూడు అంశాలపై పార్టీ బలం ఆధారపడి వుందని అన్నారు. ఈమెతో పాటు ఇటీవల ఎన్ఇసికి ఎన్నికైన లన్స్‌మన్ కూడా పోటీసిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 1981లో పార్టీ ఉప నాయకత్వానికి టోనీ బెన్ పోటీ పడినపుడు ఆమె తరపు ప్రచార నిర్వాహకుడిగా వ్యవహరించిన లన్స్‌మన్, 2016లో జెరిమీ కార్బిన్ తరపున కూడా గట్టిగా ప్రచారం చేసి ఆయన విజయానికి కృషి చేశారు. ఇటీవలి కాలంలో జెరిమీ కార్బిన్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మెక్ నికాల్ కూడా నాయకత్వ మార్పిడి సజావుగాజరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు.

అల్జీరియా చేరుకున్న ఎర్డోగాన్

అల్జీర్స్ : అల్జీరియా పర్యటన నిమిత్తం టర్కీఅధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ మంగళవారం ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం ఆయన అల్జీరియా అద్యక్షుడు అబ్దుల్ అజీజ్ బౌటెఫ్లికాతో ద్వైపాక్షిక సంబంధాలతో సహా వివిధ అంశాలపై చర్చించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపుదలకు అనువైన మార్గాలను అన్వేషించటంతో పాటు సిరియా సంక్షోభం వంటి ఉమ్మడి ప్రయోజనాలున్న ఇతర అంశాలపై కూడా ఇరువురు నేతలూ చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా జరిగిన అల్జీరియన్-టర్కిష్ బిజినెస్ ఫోరమ్ సదస్సుకు ఆయన అల్జీరియా ప్రధాని అహ్మద్ ఓయాహియాతో కలిసి హాజరయ్యారు. టర్కీ అధ్యక్షుడిగా ఎర్డోగాన్ అల్జీరియా సందర్శనకు రావటం ఇది రెండోసారి. .

కొలంబియాలో గెరిల్లా గ్రూపు దాడి

ఐదుగురు సైనికులు మృతి

బొగొటా : ఉత్తర కొలంబియాలోని టిబూ పట్టణంలో నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్ఎన్) గెరిల్లా గ్రూపు జరిపిన దాడిలో ఐదుగురు కొలంబియా సైనికులు మరణించగా, 10మంది గాయపడ్డారని సైన్యం ప్రకటించింది. మంగళవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో పేలుడు పదార్థాలతో సైనికులపై దాడి జరిగిందని సైన్యం తెలిపింది. మార్చి 11న జరగనున్న ఎన్నికల సందర్భంగా కాల్పుల విరమణ పాటిస్తామని సోమవారం ఇఎల్ఎన్ ప్రకటించింది. తిరిగి శాంతి చర్చలు జరపాల్సిందిగా అధ్యక్షుడు జువాన్ మాన్యుయల్ శాంటోస్‌ను కోరింది. కాగా టిబూలో జరిగిన దాడిని అధ్యక్షుడు ట్విట్టర్‌లో ఖండించారు. మన సైనిక యోధులపై ఇటువంటి పిరికిపంద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్తర కొలంబియాలో పోలీసు అధికారులపై ఇఎల్ఎన్ వరుసగా దాడులు జరపడంతో జనవరి 29న శాంటోస్ శాంతి చర్చలను నిలిపివేశారు.

సహేతుక విమర్శలు స్వీకరిస్తా: మదురో



కారకాస్: తాను సహేతుక విమర్శలను స్వీకరిస్తానని, అవి తనను విభిన్నమైన విప్లవ నేతగా తీర్చి దిద్దుతాయని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో చెప్పారు. ఇప్పటి వరకూ రెండు సార్లు అధ్యక్ష పదవిని నిర్వహించిన మదురో మరోసారి ఏప్రిల్‌లో జరుగనున్న ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. బొలివేరియన్ విప్లవ నేత హ్యూగో ఛావెజ్ వారసుడిగా అధికార పగ్గాలు చేపట్టిన మదురో దేశంలో సోషలిస్టు విప్లవ ఫలితాలను, ప్రయోజనాలను అట్టడుగు స్థాయి ప్రజలకు చేర్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. 2004 లో బొలివేరియన్ రివల్యూషనరీ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి 2014 వరకూ గడచిన దశాబ్ద కాలంలో దేశంలో పేదరికాన్ని 49 శాతం మేర, నిరుపేదరికాన్ని 63 శాతం మేర తగ్గించి ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచారు. దేశ సంపదను బూర్జువా వర్గాలకు పందేరం చేసిన గత లిబరల్, కన్జర్వేటివ్ ప్రభుత్వాలకు భిన్నంగా బొలివేరియన్ విప్లవ ప్రభుత్వం బడుగు వర్గాల ప్రయోజనాలకు కృషి చేస్తోందన్నారు. అయితే కేవలం బూర్జువా వర్గాలను పక్కన పెట్టినంత మాత్రాన సోషలిస్టు సమాజ నిర్మాణం సాధ్యం కాదంటున్న వెనిజులా కమ్యూనిస్టు పార్టీ (పిసివి), వారి అధీనంలో వున్న రాజకీయ, ఆర్థిక శక్తిని బద్దలు కొట్టినపుడే అది సాధ్యమవుతుందని స్పష్టం చేస్తోంది. దేశ సంపదను పేద ప్రజల కోసం ఉపయోగిస్తున్న ప్రభుత్వం వారిలో బొలివేరియన్ విప్లవం, దాని నేత పట్ల విధేయతను పెంచేందుకు కృషి చేస్తోంది. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ, మాస్ మీడియాపై కార్పొరేట్ వర్గాల గుత్తాధిపత్యానికి ప్రభుత్వం చెక్ పెట్టలేకపోయిందని ఆయన చెప్పారు. గతంలో కన్నా సగానికి సగం పడిపోయిన చమురు ధరలతో పాటు అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధంతో శ్రామిక వర్గ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనితో పాటు బడా కంపెనీలు దిగుమతులను అక్రమంగా నిల్వ చేసి వాటిని బహిరంగ మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు నిరాకరిస్తుండటంతో నిత్యావసరాల కొరత ఈ పరిస్థితిని మరింత దుర్భరం చేస్తోంది. ఈ నేపథ్యంలో దేశంలోని సంపన్న వర్గాల వద్ద కూడుతున్న సంపదను, వారి అధికార బలాన్ని ఎదుర్కొనేందుకు ఆర్థిక రంగాన్ని జాతీయం చేయటం ఒక్కటే మార్గమని పిసివి సూచిస్తోంది.

మొదటి పేజీ తరువాయి

శ్రీదేవికి తుది వీడ్కోలు

ఆమె పార్థివదేహాన్ని ఎరుపు రంగు కంజీవరం చీరతో, నుదుట బొట్టుతోనూ అలంకరించారు. శ్రీదేవి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నటీనటులు హేమమాలిని, రేఖ, అనుపమ్ ఖేర్, ఐశ్వర్యారాయ్, కాజోల్, టాబు, దిపికా పడుకునే, సిద్ధార్థ మల్హోత్రా, సోహా ఆలీఖాన్, సుస్మితా సేన్, షాహిద్ కపూర్, దర్శక, నిర్మాతలు సంజయ్ లీలా భన్సాలీ, డేవిడ్ ధావన్, మధుర్ భండార్కర్ తదితరులున్నారు. అక్కడ బుట్టల్లో వుంచిన పూలతో పుష్పాంజలి ఘటించిన ప్రముఖులు తమ అభిమాన నటిని కడసారి సందర్శించారు. బోనీ కపూర్‌ను, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.. తమ అభిమాన నటిని కడసారి సందర్శించేందుకు వేలాది మంది అభిమానులు దేశంలోని పలు ప్రాంతాల నుండి ముంబయి చేరుకున్నారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు శ్రమించారు. నటి విద్యాబాలన్, ఆమె భర్త, నిర్మాత సిద్ధార్థరాయ్ కపూర్, నట దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్, నటి దియా మీర్జా, పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ, నటులు అనుపమ్‌ఖేర్, అర్జున్ రాంపాల్ షారూక్‌ఖాన్ తదితరులు శ్రీదేవి మృతదేహాన్ని స్మశాన వాటిక వరకూ అనుసరించి తుది వీడ్కోలు పలికారు.

మరో రెండు దగా కంపెనీలు

తత్సంబంధాలు ఉన్నాయి. సిఎంతో కలిసి ఆయన విదేశాల్లోనూ పర్యటనలు చేశారు. ప్రభుత్వానికి చెందిన పలు కమిటీల్లోనూ పంజా ఉన్నారు. ఓసారి మమతాతో అతిథి హోదాలో పంజా ఢాకా పర్యటనకు వెళ్లి వస్తుండగా ఆ రాష్ట్ర పోలీసులే అరెస్టు చేశారు. అనంతరం రాజకీయ పలుకుబడితో బయట పడ్డారని తెలుస్తోంది.

ఆస్తులు 1500 కోట్లు.. అప్పులు రూ.4వేల కోట్లు

కాన్పూర్ కేంద్రంగా పని చేస్తున్న వస్త్రాల కంపెనీ శ్రీ లక్ష్మీ కొట్సిన్ లిమిటెడ్ దాదాపు 16 బ్యాంకులకు దాదాపు రూ.3,972కోట్ల మేర రుణాలు ఎగవేసింది. కాగా కంపెనీ ఆస్తుల విలువ రూ.1,495కోట్లు మాత్రమే ఉన్నాయి సెంట్రల్ బ్యాంకు కన్సోరియంగా ఉండగా, ఇతర బ్యాంకులు అప్పులిచ్చాయని న్యూస్18 కథనం వెల్లడించింది. ఈ కంపెనీ గ్రూప్ ఛైర్మన్ ఎంపి అగర్వాల్ అప్పులు తీసుకొని ఎగ్గొట్టారని బ్యాంకులు లబోదిబోమంటున్నాయి. దీంతో రికవరీలో భాగంగా ఆ కంపెనీ ఆస్తుల వేలానికి అధికారులు సిద్ధం అయ్యారు. ఈ కంపెనీ దీర్ఘకాలం రుణాల కింద రూ.2,406కోట్లు, స్వల్ప కాల రుణాల కింద మరో రూ.937కోట్లు తీసుకుందని సమాచారం. అప్పులతో పోల్చితే ఆస్తుల విలువేమో పావు వంతు కూడా లేకపోవడంతో అధికారులు బిత్తరపోతున్నారు.

'ఉక్కు' తరహాలో రైల్వేజోన్‌పై పోరాటం

- హోదా కోసం పోరాడితేనే చంద్రబాబుకు భవిష్యత్
- గిరిజన యూనివర్సిటీ ఎందుకు పెట్టడం లేదు
- ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి వల్లే రాష్ట్రానికి నష్టం
- మహాధర్నాలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని విశాఖ రైల్వేజోన్‌పై పోరాడాలని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బి.వి.రాఘవులు ఉద్ఘాటించారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను సాధించుకోవడంలో,సమస్యలు పరిష్కారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యాడని ఎద్దేవా చేశారు. పెట్టుబడుల కోసం డాన్సులు చేయించే చంద్రబాబు ఆయనే ఢిల్లీ వెళ్లి మోడీ ఎదుట డాన్సులు చేస్తే హోదా వచ్చి పెట్టుబడులు కూడా వస్తాయని రాఘవులు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బుధవారం విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన రైల్వేజోన్, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్యాకేజీలపై నిర్వహించిన మహాధర్నాలో రాఘవులు మాట్లాడారు. వామపక్ష పార్టీలు ఐక్యంగా హోదాపై పోరాడడం వల్లే రాష్ట్రంలో ప్రతిపక్షాలు కూడా ఈ పోరాటాల్లోకి వచ్చాయని, చంద్రబాబు ఈ పోరాటాలపై బురద జల్లకుండా కలిసొస్తేనే భవిష్యత్ ఉంటుందని హెచ్చరించారు. గతంలో తెలుగుదేశం పార్టీ హోదా వల్ల లాభాలెన్ని ఉన్నాయో పుస్తకాన్ని ప్రచురించిన విషయాన్ని రాఘవులు గుర్తుచేశారు. దీన్ని అప్పట్లో కేంద్ర ప్రభుత్వానికి సైతం పంపిందని, ప్రత్యేక హోదా వల్ల ఈశాన్య రాష్ట్రాలు ఎంతగా అభివృద్ధి అయ్యాయో దాంట్లో పేర్కొందని అన్నారు. అలాంటి చంద్రబాబు తాజాగా ప్రత్యేక హోదా వల్ల లాభం ఏమిటని ప్రశ్నించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 35 లక్షల మంది ఉన్న గిరిజనుల కోసం యూని వర్సిటీకి స్థలం కేటాయించకుండా వారిని చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. పోలవరం ప్రాజెక్టులో మునిగిపోయిన గిరిజన కుటుంబాల ఇళ్లకు నష్టపరిహారం ఇంతవరకూ ఇవ్వలేదని, ప్రాజెక్టు పనులు, సిమెంటు రేట్లు, కమిషన్లపైనే ప్రభుత్వ దృష్టంతా ఉండడం బాధాకరమని వివరించారు.

ప్రత్యేక హోదాకు దశల వారీ పోరాటం : సిపిఐ రామకృష్ణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యాన మార్చి 1న గుంటూరులో హోదా, విభజన హామీలపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. 2న రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలన్నీ కలిసి దీక్షలు చేపడతామని, 3న తిరుపతిలో వేలాదిమంది విద్యార్థులతో మానవ హారం నిర్వహిస్తామని తెలిపారు. 4న విశాఖ బీచ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేపడతామన్నారు. 5న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నందున ఢిల్లీలో దీక్షలు చేపడతామన్నారు. ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, ఒడిశా మాదిరిగా రాయలసీమకు ప్యాకేజీ ఇస్తామని చెప్పి పంగనామాలు పెట్టారని విమర్శించారు.

ప్రత్యేక హోదా రాష్ట్రానికి కచ్చితంగా వచ్చి తీరుతుంది: నర్సింగరావు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కచ్చితంగా వచ్చి తీరుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు అంతా పదవులకు రాజీనామా చేసి అప్పట్లో రోడ్లపైకొచ్చి పోరాడారని, నేడు కూడా కేబినెట్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పదవులకు రాజీనామా చేసి పోరాడితే కచ్చితంగా హోదా వస్తుందని చెప్పారు. సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, న్యూ డెమొక్రసీ నాయకులు కొండయ్య తదితరులు ప్రసంగించారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు డాక్టర్ బి.గంగారావు, పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

4న 'చలో గుంటూరు'

(మొదటి పేజీ తురువాయి)

జి.జయప్రకాష్‌బాబు తన వాదనలు వినిపించారని, ప్రభుత్వం తరపున గవర్న మెంట్ ప్లీడర్ (జిపి) వాదనలు వినిపించారని, రెండున్నర గంటల పాటు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి ముందు వాదనలు కొనసాగాయని తెలిపారు. వాదనల అనంతరం న్యాయమూర్తి ఈనెల 4న ఆదివారం సభకు అనుమతి ఇవ్వాల్సిందిగా పోలీసులను ఆదేశించిందన్నారు. సభను ఎసి కాలేజి ఎదురుగా ఉన్న ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్‌లో నిర్వహించాలని న్యాయమూర్తి తన ఉత్తుర్వుల్లో ఆదేశించారని తెలిపారు.

100 వ రోజుకు జగన్ పాదయాత్ర

(మొదటి పేజీ తురువాయి)

రు.4000 నుంచి రు.1800లకు తగ్గిస్తానని, పాలిషింగ్ యూనిట్లకు విద్యుత్ యూనిట్ ధర రు.7.5నుంచి రు 3.5కు తగ్గిస్తాననీ హామీ ఇచ్చారు. చంద్రబాబు అన్నింటా విఫలమయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు సుబాబులు ధర క్వింటా రు.4400రేటు పలికితే, చంద్రబాబు పాలనలో రు.1800లకు తెగనమ్ముకొని రైతులు అష్టకష్టాలు పడుతున్నారని వివరించారు పాదయాత్ర 100 కిమీ పూర్తయిన సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన పైలాన్‌ను, వైఎస్ఆర్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు.

దర్యాప్తుకు హాజరు కాలేను

సిబిఐ అధికారులకు తేల్చి చెప్పిన నిరవ్ మోడీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకును 2 బిలియన్ అమెరిక్ డాలర్ల మేర మోసగించిన కేసులో ప్రముఖ నగల వ్యాపారి సిబిఐ ఎదుట హాజరయ్యేందుకు నిరాకరించారు. తాను వ్యాపార కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నందున హాజరు కాలేకపోతున్నానని చెప్పారు. దీనికి సిబిఐ స్పందిస్తూ వచ్చే వారం తమ ఎదుట హాజరు కావలసిందిగా కోరుతూ ఘాటుగా లేఖ పంపింది. ఈ కేసుకు సంబంధించిపిఎన్‌బి ఇంటర్నల్ చీఫ్ ఆడిటర్ ఎంకె శర్మను అరెస్టుచేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో బ్యాంకుకు చెందిన ఆడిటర్‌ను అరెస్టు చేయడం ఇదే తొలిసారి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాడీ హౌస్ శాఖకు సంబంధిచిన ఆడిటింగ్ బాధ్యతలన్నీ శర్మ చూస్తుంటారు. లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఓయు)లు జారీ చేయడం కూడా ఆయన బాధ్యతే. ఆడిటింగ్ లో ఉన్న లోపాలను జోనల్ ఆడిట్ కార్యాలయానికి నివేదిక సమర్పించాలి. నిరవ్ మోడీ ఏ దేశంలో ఉంటే ఆ దేశంలోని భారత దౌత్య కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని, భారత్ వచ్చేందుకు అత్యవసర ఏర్పాట్లుచేస్తోందని సిబిఐ అధికారులు తమ లేఖలో పేర్కొన్నారు. తాము కోరినప్పుడు నిందితుడు తప్పనిసరిగా దర్యాప్తుకు సహకరించాలన్నారు. అంతకుముందు బ్రాడీ హౌస్ శాఖ నుంచి తాను, తన అంకుల్ మెహుల్ చోక్సి కంపెనీలకు సంబంధిచి ఎల్‌ఓ యూలను, లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌సిఎస్)ను మోసపూరితంగా జారీ చేయించుకుని రూ.12, 636 కోట్ల మేర స్కామ్‌కు పాల్పడిన కేసుకు సంబంధించిన కేసులో దర్యాప్తుకు రావాలని నిరవ్ మోడి అధికారిక ఇ మెయిల్ ద్వారా సిబిఐ కోరింది. దీనికి కూడా నిరవ్ మోడీ నిరాకరించారు. తాను విదేశాలలో వ్యాపార కార్యకలా పాలలో నిమగ్నమైనందున తిరిగి రాలేనంటూ తమకు సమాధానమిచ్చినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. మోడీ, చోక్సిల ద్వయం మొత్తం 2 బిలియన్ అమెరికన్ డాలర్ల మోసానికి పాల్పడినట్లు సిబిఐ అధికారులుతెలిపారు. సిబిఐ, పిఎన్‌బి బృందాలు తాజాగా రూ.1,251 కోట్లకు సంబంధిచిన ఎల్‌ఓయులు కనుగొనడంతో ఈ విషయం బయటపడింది. రూ.1,251 కోట్లకు సంబంధించిన ఎల్‌ఓయులు చోక్సికి చెందిన గీతాంజలి గ్రూపు కంపెనీలకు జారీ చేసినట్లు వారు తెలిపారు.

డిస్కంల ముట్టడి విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించాలని విశాఖ ఎల్ఐసి ఆఫీస్ నుంచి ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కార్యాలయం వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకుని సిఐటియు నాయకులు సహా 300 మందిని అరెస్ట్ చేసి వేర్వేరు స్టేషన్లకు తరలించారు. పోలీసులు మఫ్టీలో, యూనిఫాంలో కలియతిరుగుతూ ఈడ్చుకుపోయి వ్యానుల్లో ఎత్తి పడేశారు. దీంతో కార్మికులు సిఎం డౌన్ డౌన్.. సమస్యలు పరిష్కరించాలి, పోలీసుల దౌర్జన్యం నశించాలి.. అన్న నినాదాలతో ప్రాంగణమంతా మారుమోగింది. ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద సుమారు 200 మంది పోలీసులతో అరకిలోమీటరు మేర భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అరెస్టయినవారిలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకర్, జి.కోటేశ్వరరావు, సిఐటియు నగర ఉపాధ్య క్షులు జిఎస్ రాజేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.రాము, ప్రేమ చంద్రశేఖర్‌తోపాటు 300మంది కార్మికులున్నారు. ఇదే జిల్లాలోని అరకు లోయలో పోలీసులు ఐదుగురిని ముందస్తుగా అరెస్ట్ చేసి, మధ్యాహ్నం వరకూ పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొద్దు బాలదేవ్, ఎస్ఎఫ్ఐ అరకు డివిజన్ కార్యదర్శి రామన్న, విద్యుత్ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు నిరంజన్, కార్యదర్శి అప్పలస్వామి, ప్రహ్లాద్ ఉన్నారు.

సిపిఎం, సిపిఐ మద్దతు

విశాఖలో కార్మికుల ఆందోళనా శిబిరం వద్దకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు వచ్చి మద్దతు తెలిపారు. బివి రాఘవులు మాట్లాడుతూ న్యాయమైన హక్కుల కోసం, దళారీ వ్యవస్థను తొలగించమని పోరాడుతున్న కార్మికులను నిర్బంధించిన ఏ ప్రభుత్వమూ నిలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంలో కనీసం మానవత్వం ప్రదర్శించడం లేదని చెప్పారు. 24 గంటలూ విద్యుత్ ఇస్తామని విశాఖలో జరిగిన పెట్టుబడి సమ్మిట్‌లో ప్రకటించారనీ, అయితే విద్యుత్ పంపిణీ చేసే పనిలో కీలకపాత్ర వహించే కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదనీ తెలిపారు. కార్మికుల పోరాటాలకు వామపక్షాలుగా తాము ముందుంటామని భరోసా ఇచ్చారు. 2000లో విద్యుత్ ఛార్జీలు పెంచడం ద్వారా చంద్రబాబును ఇంటికి పంపించారని, ఇప్పుడు ఈ సమస్యలు పరిష్కరించకపోతే మరొకసారి 'షాక్' ఇవ్వాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

తమిళనాడు తరహా విధానాన్ని అమలు చేయాలి : గఫూర్

తెలంగాణా, తమిళనాడు తరహాలో విద్యుత్ విధానాన్ని అమలు చేసి, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక (సిఐటియు) ఆధ్వర్యంలో తిరుపతి డిస్కం కార్యాలయాన్ని వేలాదిమంది కార్మికులు బుధవారం ముట్టడించారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి వచ్చిన వేలాదిమంది కార్మిక వ్యతిరేక విధానాన్ని ఎండగట్టారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ ముట్టడి విజయవంతమైంది. ఈ సందర్భంగా గఫూర్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ..కాంట్రాక్టు కార్మికులు లేకపోతే జెన్‌కో, ట్రాన్స్‌కోలు ఉండవన్న విషయాన్ని విద్యుత్‌శాఖా మంత్రి కళావెంకట్రావు గుర్తించాలని హితవు పలికారు. ఆయన ఆ పదవికి అసమర్థుడని మండి పడ్డారు. సమస్యల పరిష్కారానికి అడ్డుగా ఉన్న యాక్టు 2/94ను తెలంగాణ ప్రభుత్వం సవరించిందని, ఆంధ్రలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంస్థలో థర్డ్ పార్టీ జోక్యం వల్ల 43 శాతం దళారులకు చేరుతోందంటూ మండిపడ్డారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి నాయకత్వం వహించిన అఖిల భారత విద్యుత్ ఉద్యోగ,కార్మిక సమాఖ్య జాతీయనాయకులు ప్రశాంత్‌నందా చౌదరి, తమిళనాడు, కేరళ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు బాలసుబ్రమణ్యం, జయప్రకాష్ సంఘీభావం ప్రకటించారు. సిఐటియు చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశీ, హెచ్180 సంఘం రాష్ట్ర నాయకులు కట్టా నాగరాజు, విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, జేఏసి నాయకులు సుధాకర్, సూరిబాబు, సుదర్శన రెడ్డి, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు, జి బాలసుబ్రమణ్యం, ఎం నారాయణబాబు, ఎఐటియుసి నాయకులు పి మురళి మాట్లాడారు.

పెట్టుబడులపై ఆర్భాటమే

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు మాత్రం ఒప్పందాలు కదుర్చుకుంటున్న సంస్థల్లో కనీసం 50 శాతం వరకు కార్యరూపం దాల్చుతున్నాయని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమేనని చెబుతున్నారు. ఇదే శాతాన్ని పరిగణనలోకి తీసుకున్నా ఇప్పటివరకు లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమై ఉండాలి. అయితే మూడేళ్లనాటి సదస్సుల్లో సాధించింది 50 శాతం ఉందా? అంటే నమ్మశక్యంగా లేదన్న సమాధానమే వస్తోంది. అధికారులు చెబుతున్న మేరకు 2017 సదస్సులో 4.78 లక్షల కోట్ల విలువైన 331 ఒప్పందాలు జరిగాయి. తద్వారా 10 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా వేశారు. 2017 సదస్సులో కూడా 10.4 లక్షల కోట్లతో 665 ఒప్పందాలు జరిగాయి. దీనివల్ల 10 లక్షలకు పైగానే ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. ఈ రెండు సదస్సుల ద్వారా దాదాపు 15 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో 20 లక్షల మందికి ఉద్యోగాలు లభించాలి. తాజా పరిస్థితి గమనిస్తే కనీసం పది శాతం కూడా పెట్టుబడులు ఖరారుకాలేదని, ఉద్యోగాలు కూడా అతి తక్కువ సంఖ్యలోనే వచ్చాయని అంటున్నారు. తాజా సదస్సులో మరో నాలుగున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల విలువ దాదాపుగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంత ఉన్నట్లు కనిపిస్తోంది. ఇలా లక్షలాది కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు జరిగినట్లుగా అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ ఒప్పందాలు చేసుకున్న సంస్థలు తమ పరిశ్రమలను ఏర్పాటుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం, ఆయా శాఖల అధికారులు చొరవ చూపించలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అందువల్లనే రాష్ట్రంతో ఒప్పందాలు చేసుకున్న సంస్థల్లో ఎక్కువ శాతం వేరే రాష్ట్రాలకు వలస పోతున్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. అందుకే వాస్తవంగా సంస్థలు స్థాపించాలని ఆశక్తి చూపిస్తున్న వారిని గుర్తించి, వారితో ప్రత్యేకంగా భేటీలు నిర్వహిస్తే ఫలితాలు వస్తాయని సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

రేపటినుంచి థియేటర్లు బంద్



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు ఫిల్మ్ ఛాంబార్ ఆఫర్ కామర్స్ డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర్ ప్రసాద్, పక్కన సెక్రటరీ ముత్యాల రామదాసు

'ఆల్ ది బెస్ట్ టు ఇండస్ట్రీ' అంటూ సమావేశం మధ్యలో క్యూబ్ అధినేత వెళ్లిపోవడంతో మార్చి 2 నుంచి సౌతిండియా వ్యాప్తంగా కమిటీ థియేటర్లలో సినిమాలు నిలిపివేతకు దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (డిఎస్‌పి) అధికమొత్తంలో ధరల వాత వేయడంతో నిర్మాతలు, పంపిణీదారులకు పెద్ద మొత్తంలో భారం తప్పడం లేదన్నది వాదన. డిఎస్‌పీలు థియేటర్లను గుప్పిట్లో పెట్టుకుని కాంట్రాక్టుల పేరుతో భారీ మొత్తాల్ని గుంజుతున్నారన్న అభియోగంతో బంద్‌కు జేగంట మోగింది. ఇప్పటికే పలుమార్లు డిజిటల్ సర్వీస్ ప్రొడైడర్ల యాజమాన్యలతో దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ చర్చలు జరిపినా విఫలమవ్వడంతో బందుకు సమరశంఖం పూరించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబ ర్‌లో తెలుగు ఫిల్మ్ ఛాంబార్ ఆఫర్ కామర్స్ డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ముత్యాల రామదాసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ ముత్యాల రామదాసు మాట్లాడుతూ, ఈనెల 2 నుంచి థియేటర్లలో సినిమా ప్రదర్శనను నిలిపివేస్తున్నాం. రెండు నెలల నుంచి డిజిటల్ ధరలు భయంకరంగా పెంచేశారు. ఈ నేపథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీ ఛైర్మన్‌గా డి.సురేష్ బాబు, కన్వీనర్‌గా పి.కిరణ్ బాధ్యత తీసుకున్నారు. దీనికిముందు ఆరేళ్ల నుంచి సురేష్ బాబు, సి.కల్యాణ్, ఎన్.వి. ప్రసాద్ అంతా కలిసి పోరాటం చేసినా డిజిటల్ యాజమాన్యాలు దిగిరాలేదు. చివరికి సమావేశాలకు గైర్హాజరయ్యేవారు. ఇలాంటి పరిస్థితుల్లోనే జాయింట్ యాక్షన్ కమిటీ (సౌత్‌లో ఫిల్మ్ ఇండస్ట్రీ అంతా) ఏర్పాటు చేశాం. దాని ఆధ్వర్యంలో హైదరాబాద్, చెన్నై, బెంగుళూరులో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల యాజమన్యాలతో పలు అంశాలపై చర్చలు జరిపాం. అవీ విఫలమయ్యాయి. అలాగే ఈరోజు ఉదయమే తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ దృష్టికి విషయం తీసుకెళ్లాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తరుపున ఎల్లవేళలా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మా పోరాటానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న అన్ని థియేటర్ల యాజమాన్యాలు పూర్తిగా మద్దతునిచ్చాయి. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీదారులు అంతా ఒకే తాటిపైకి వచ్చి పోరాటం చేయడానికి సిద్ధమయ్యాం. థియేటర్ల నిలిపివేత అన్నది ఎన్ని రోజులు కొనసాగుతుందో చెప్పలేం. మా పోరాటానికి ప్రేక్షకులు కూడా సహకరించాలని కోరుకుంటున్నామని అన్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇప్పటివరకూ జరిగిన సమావేశాల్లో ప్రధానంగా మూడు అంశాలపై చర్చలు జరిగాయి. 1.వి.పి.ఎఫ్ ఛార్జెస్ కట్టేది లేదని.. 2. రెండు సినిమా యాడ్లు మాకివ్వాలని, 3. కమర్శియల్ యాడ్లు 8 నిమిషాల నిడివి కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధనలను వాళ్ల ముందుంచాం. వరల్డ్ వైడ్ వి.పిఎస్ ఛార్జెస్ 5 ఏళ్లు మాత్రమే అనుకున్నాం. తర్వాత పూర్తిగా నిషేధించాలని ముందుగా అనుకున్నాం. కానీ అవేవీ అమలు కావడంలేదు. దీనిపై జరిగిన చర్చలన్నీ విఫలమయ్యాయి. క్యూబ్‌కు సంబంధించిన ఓ వ్యక్తి చివరి సమావేశంలో 'ఆల్ ది బెస్ట్ టు ఇండస్ట్రీ' అంటూ వ్యంగ్యంగా మాట్లాడి అంతమంది పెద్దల ముందే లేచి వెళ్లిపోయాడు. మా సినిమా ఇండస్ట్రీ మీద ఆధారపడి బతికే వ్యక్తే అలా మాట్లాడడం ఎంతవరకు సంస్కారమో? అతనికే తెలియాలి. ఇక ఉపేక్షించేది లేదు. దక్షిణాది అన్ని చలన చిత్ర పరిశ్రమల నుంచి పూర్తిగా మద్దుతు లభించింది. మార్చి 2 నుంచి సినిమా ప్రదర్శనలను నిలిపివేయడానికి నిర్ణయం తీసుకున్నాం. కావున ప్రేక్షకులు అంతా సహకరించాలని కోరుకుంటున్నామని అన్నారు.

ఆకలి, ఆశ, కోపం అంశాలుగా 'ఐతే 2.0'



ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మణాల్, మదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా ఈనెల 16న సినిమా విడుదలవుతుంది. కాగా, ఈ సినిమాలో 'నింగిపై...' అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి బుధవారంనాడు హైదరాబాద్‌లో విడుదల చేశారు.


ఈ కార్యక్రమంలో ఇంకా కల్యాణ్ మాలిక్, చిత్ర దర్శకుడు రాజ్ మాదిరాజు, సంగీత దర్శకుడు అరుణ్ చిలువేరు, నరేశ్ అయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ.. పాట విన్నాను. చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమాకు సంగీతం అందించిన అరుణ్ చిలువేరు అద్భుతమైన మెలోడి మ్యూజిక్‌ను అందించాడు. తను గిటారిస్ట్‌గా పని చేస్తున్నప్పట్నుంచీ నాకు తెలుసు. ట్యూన్ చాలా బావుంది. 'ఆశగా ఆశకే ఆయువు పెంచగా..' వంటి సాహిత్యం స్ఫూర్తిదాయకంగా ఉంది. నరేశ్ అయ్యర్ పాటను చాలా చక్కగా పాడాడు. సినిమాలోని మిగిలిన రెండు పాటలు కూడా శ్రోతలను ఆకట్టుకుంటాయనే నమ్మకం ఉందని అన్నారు.

కల్యాణ్ మాలిక్ మాట్లాడుతూ... 'ఐతే' సినిమాకు నేనే మ్యూజిక్ కంపోజ్ చేశాను. ఆ సినిమాలో ఒకే ఒక పాట ఉంటే.. దాన్ని అన్నయ్య కీరవాణి పాడారు. ఇప్పుడు అన్నయ్యతో కలిసి 'ఐతే 2.0' సాంగ్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. అరుణ్ నా మ్యూజిక్ టీంలో గిటారిస్ట్‌గా పనిచేశారు. తనతో పనిచేయడం కూల్‌గా ఉంటుంది. 'ఐతే' సినిమాలాగానే ఈ సినిమా కూడా పెద్ద హిట్ సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. నరేశ్ అయ్యర్ మాట్లాడుతూ... మనం క్యాజువల్‌గా పాడుకునేలా ఈ పాట ఉంటుంది. కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉంది. సాంగ్స్, సినిమా అందరినీ మెప్పిస్తాయని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అరుణ్ చిలువేరు మాట్లాడుతూ... కీరవాణి పాట విడుదల కావడం అదష్టంగా భావిస్తున్నాను. నాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చిన రాజ్ మాదిరాజుకు ధన్యవాదాలు. 'నింగిపై..' అనే సాహిత్యంతో కూడిన ఈ పాటను నరేశ్ అయ్యర్ పాడటం సంతోషంగా ఉంది. కిట్టు మంచి సాహిత్యాన్ని అందించారని అన్నారు.

దర్శకుడు రాజ్ మాదిరాజు మాట్లాడుతూ... ఇందులో మూడు పాటలున్నాయి. ముగ్గురు హీరోలకు సంబంధించిన వివిధ నేపథ్యాల్లో ఈ మూడు వస్తాయి. ఆకలి, ఆశ, కోపం అనే మూడు అంశాలపై ఈ మూడు సాంగ్స్ ఉంటాయి. అరుణ్ ఎంటర్‌టైన్‌మెంట్ మ్యూజిక్ అందించిన మ్యూజిక్ డైరెక్టర్స్ వద్ద అరుణ్ పనిచేశాడు. తనని 'ఐతే 2.0' సినిమా ద్వారా మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేస్తుండటం ఆనందంగా ఉంది. గిటార్ అంటే చాలా అభిమానం. 'నింగిపై...' అనే సాఫ్ట్ రాక్ నెంబర్‌కు కిట్టు విస్సా ప్రగడ చక్కటి సాహిత్యాన్ని అందించారు. తను నాకు 'రిషి' సినిమా నుండి పరిచయం. తను మిగిలిన రెండు పాటలు రాయడమే కాకుండా.. సంభాషణల్లో సైతం సహకారం అందించారు. కరొకే ట్రాక్, స్మైల్ యాప్‌లో కూడా సాంగ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. నిర్మాత విజయ్ రామరాజు మాట్లాడుతూ... ఈనెల 16న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

హీరోగా పోరాటం చేస్తున్న సునీల్




కమెడియన్‌గా కెరియర్‌ని ప్రారంభించి ఆ తర్వాత హీరోగా తనకంటూ గుర్తింపు సాధించుకున్నాడు సునీల్. 1974 ఫిబ్రవరి 28న భీమవరంలో పుట్టిన సునీల్ బుధవారంనాడు తన బర్త్ డే సెలెబ్రేట్ చేసుకున్నాడు. కథానాయకుడిగా కెరీర్ ఆటుపోట్లతో వున్నా... అన్ని సినిమాలు విజయవంతం కావాలనే చేస్తామని తెలియజేస్తున్నాడు. జయాపజయాలు తమ చేతుల్లోలేవని చేసిన పాత్రను మెప్పించడమే తన కర్తవ్యమని అంటూ... సమయాన్ని బట్టి కమేడియన్‌గా చేయడానికి సిద్ధమని ఇటీవలే ప్రకటించాడు. ఆయన కెరీర్‌ను చూసుకుంటే.... 'నువ్వే కావాలి' సినిమాతో సిల్వర్ స్క్రీన్‌కి పరిచయం అయిన సునీల్, తెలుగు ప్రేక్షకుల దష్టిలో పడటానికి పెద్దగా టైమ్ పట్టలేదు. అదే సంవత్సరం రిలీజైన 'చిరునవ్వుతో' సినిమాలోను అవకాశం దక్కించుకున్న సునీల్, తన కామెడీ టైమింగ్ తో ఫిల్మ్ మేకర్స్ దష్టిలో పడ్డాడు. 2001లో రిలీజైన ఫ్యామిలీ సర్కస్, నువ్వు నాకు నచ్చావ్, మనసంతా నువ్వే, చిరుజల్లు, నువ్వు-నేను సినిమాలు సునీల్ స్థాయిని పైమెట్టుకు తీసుకువెళ్ళాలి. సినిమా జోనర్ ఏదైనా సునీల్ కామెడీ ఉండాల్సిందే అనేంతలా ఎట్రాక్ట్ చేశాడు. 2002లో ఏకంగా 17 సినిమాల్లో నటించిన సునీల్, వేసేవి కామెడీ వేషాలే అయినా, ప్రతి సినిమాలో వేరియేషన్ ఉండేలా కేర్ తీసుకునేవాడు. అదే ఏడాదే రిలీజైన నువ్వు లేక నేను లేను, శ్రీరామ్, మన్మధుడు, సంతోషం, నువ్వే నువ్వే... ఇలా చెప్పుకుంటూ పోతే సునీల్ నటించిన ప్రతి సినిమా, సునీల్ కరియర్ గ్రోత్‌లో కీరోల్ ప్లే చేసింది. 2003 లో రిలీజైన 'పెళ్ళాం ఊరెళితే', గంగోత్రి, కళ్యాణ రాముడు సినిమాలలో సునీల్ కామెడీ హైలెట్‌గా నిలిచింది. అప్పటి వరకు జస్ట్ కామెడీ ట్రాక్స్‌లో ఎంటర్ టైన్ చేసిన సునీల్ కోసం, ప్రత్యేకంగా క్యారెక్టర్స్ రాసుకునేంతలా డిమాండ్ క్రియేట్ చేసుకున్నాడు సునీల్. సినిమాల్లో కమెడియన్‌గా నటించి మెప్పించిన సునీల్ తొలిసారి హీరోగా నటించిన సినిమా 'అందాల రాముడు'. 2006లో రిలీజై ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా అతనికి టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అటు హీరోగా, ఇటు కమెడియన్ గా నటిస్తున్న సునీల్ కెరియర్‌లో 'మర్యాద రామన్న' సునీల్ కెరియర్‌ని ఒక్కసారిగా మరో మెట్టుకు ఎదిగేలా చేసింది. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ సినిమా సునీల్‌ని ఒక్కసారిగా కమర్షియల్ హీరోల స్థాయికి చేర్చింది. 'పూలరంగడు, భీమవరం బుల్లోడు, కృష్ణాష్టమి వంటి సినిమాలతో పాటు ఇటీవలే వచ్చిన '2 కంట్రీస్' లాంటి సినిమాల్లో హీరోగా నటించినా కమేడియన్‌గా ప్రేక్షకులు అతని నుంచి ఆస్వాదించేట్లుగా చేసుకున్నాడు. దాంతో హీరోయిజం చూపించినా పాత వాసనలు వెంటాడడంతో విజయం దోబూచులాడుతుంది. కసరత్తులతో ఆహార్యాన్ని తగ్గించుకున్నట్లుగానే హీరోయిజం చూపించడంలో మరింత కేర్ తీసుకోవాలని విశ్లేషకులు తెలియజేస్తున్నారు.

అమెరికాలో 'గూఢచారి'



'క్షణం' చిత్రం అనంతరం అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నేతృత్వంలో అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయు క్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశికిరణ్ తిక్క దర్శకుడు. అడివి శేష్ ఈ చిత్రానికి కథ సమకూర్చగా మిస్ ఇండియా తెలుగమ్మాయి అయిన శోభిత ధూళిపాళ్ళ కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు అభిషేక్ నామా, టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ.. "ఇప్పటివరకూ తెలుగు తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. డిల్లీ, పూణే, హైద్రాబాద్, కాకినాడ, రాజమండ్రి, వైజాగ్, చిట్టగాంగ్ (బంగ్లాదేశ్)లలో చిత్రీకరణ జరుపుకొన్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం అమెరికాలోని కాస్కేడ్ మౌంటైన్స్‌లో జరుగుతోంది. అక్కడి అందమైన, అత్యద్భుతమైన లొకేషన్స్‌లో అడివి శేష్ షూట్ చేస్తున్నారు. అడివి శేష్ ఈ చిత్రంలో ఒక స్పై పాత్రలో కనిపించనున్నారు. విడుదలై ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. హై టెక్నికల్ వేల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతిని ఇస్తుంది. వేసవి కానుకగా చిత్రాన్ని విడుదల చేయనున్నాం" అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బీహెచ్, సినిమాటోగ్రఫీ: షానిల్ డియో, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సహ నిర్మాత: వివేక్ కూచిభోట్ల.

6న 'ది విజన్ ఆఫ్ భరత్'



మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. కాగా, ఈ చిత్రానికి సంబంధించి 'ది విజన్ ఆఫ్ భరత్' అనే టీజర్‌ను ఈనెల 6న విడుదల చేయనున్నారు. మహేష్‌బాబు కెరీర్‌లో మరో మంచి చిత్రం అవుతుందని నిర్మాత తెలియజేస్తున్నాడు. తెలుగు చలనచిత్రరంగంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతుందని దర్శకుడు తెలియజేస్తున్నాడు. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో చిత్రం రూపొందుతోంది. శ్రీమంతుడు తర్వాత మహేష్, కొరటాల కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం కావడంతో మార్కెట్‌పై మంచి అంచనాలున్నాయి. కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌లతోపాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, పాటలు: రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: శ్రీమతి డి.పార్వతి, నిర్మాత: దానయ్య డి.వి.వి., దర్శకత్వం: కొరటాల శివ.

'లవర్'గా రాజ్ తరుణ్



తొలి చిత్రం 'ఉయ్యాల జంపాల'తో సక్సెస్‌ఫుల్ హీరోగా కెరీర్‌ను స్టార్ట్‌చేసిన కథానాయకుడు రాజ్‌తరుణ్. వరుస విజయాలతో తెలుగు ప్రేక్షకులదరికీ చాలా దగ్గరయ్యారు. ఇప్పుడు సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన హిట్ చిత్రాల నిర్మాత దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 'లవర్' సినిమాలో నటిస్తున్నారు. 'అలా ఎలా?' వంటి సూపర్ హిట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ఆకట్టుకున్న దర్శకుడు అనీశ్ కృష్ణ, వెంటనే సినిమా చేసేయాలనే ఆలోచనతో కాకుండా హిట్ సినిమా తీయాలనే దృక్పథంతో వెయిట్ చేసి మంచి కథను తయారు చేసుకున్నారు. మంచి కథకు తగ్గట్లు నిర్మాత దిల్‌రాజు, తరుణ్ సినిమాకు చక్కగా కుదిరారు. ఈ సినిమా ప్రేమలోకి కొత్త కోణాలను టచ్ చేసేలా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ద్వారా రిద్ది కుమార్ హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోన్న ఈ సినిమాను జూన్ 14న విడుదల చేయడానికి నిర్మాత దిల్‌రాజు సన్నాహాలు చేస్తున్నారు.

'దండుపాళ్యం 4' ఫస్ట్‌లుక్ విడుదల

వెంకట్ మూవీస్ బ్యానర్‌పై కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. ఈ సినిమా షూటింగ్ మార్చి 8న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ... దండుపాళ్యం రెండు భాగాలను తెలుగు ప్రజలు ఆదరించారు. వారిచ్చిన స్ఫూర్తితో దండుపాళ్యం 4ను ప్రారంభించాం. దండుపాళ్యంపై క్రేజ్ రోజు రోజుకీ పెరుగుతుంది. ఇప్పుడు దండుపాళ్యం 3కి దర్శకుడు ఎవరనేది తెలియదు. ఆర్టిస్టుల గురించి పెద్దగా తెలియదు. ప్రేక్షకుల ఆశీర్వాదం, నా కృషితో రెండు సినిమాలు ప్రజలకు బాగా రీచ్ అయ్యాయి. దర్శకుడు కె.టి.నాయక్ మంచి ఇంటెలిజెంట్.. హార్డ్‌వర్కర్. ఈయనకు క్రైమ్ జోనర్‌లో సినిమాలు చేయాలంటే చాలా ఇష్టం. ఆయన ఎలా దండుపాళ్యం 4 చేయవచ్చో చెప్పిన తీరు నాకు నచ్చింది. దండుపాళ్యం, బాహుబలి... రెండు సినిమాల రేంజ్ వేరైనా ఈ రెండు సినిమాల సీక్వెల్స్‌కి మంచి క్రేజ్ క్రియేట్ అయ్యాయి. కొందరి వ్యక్తిగత అహాల కారణంగా 'దండుపాళ్యం 2' నేను అనుకున్నట్లుగా రాలేదు. ఆడియెన్స్‌ను ఏమైతే సినిమాలో ఉండాలనుకుని థియేటర్‌కి వచ్చారో అది సినిమాలో లేదు. దాంతో ఓ కసితో 'దండుపాళ్యం 4'ను స్టార్ట్ చేశాను. పక్కా స్క్రిప్ట్ వర్క్‌తో సినిమాను స్టార్ట్ చేస్తున్నాం.

ఈనెల 8న సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది. దండుపాళ్యం4 లో రెండు గ్యాంగ్‌లుంటాయి. మొదటి మూడు పార్ట్స్‌లో నటించిన నటీనటులతో పాటు వేరే గ్యాంగ్ కూడా ఇందులో కనపడుతుంది. దండుపాళ్యం రీసెర్చ్‌లో మాకు దొరికిన సమాచారంతో పది సీక్వెల్స్ తీయవచ్చు. నిజమైన ఘటనను ఆధారంగా చేసుకుని సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఆసక్తికర మైన స్క్రీన్‌ప్లేతో సినిమా సాగుతుందని అన్నారు.

దర్శకుడు కె.టి.నాయక్ మాట్లాడుతూ... నేను నిజామాబాద్ ఆర్మూర్‌లో పుట్టి పెరిగాను. కానీ తమిళనాడు, కర్ణాటకల్లో స్థిరపడ్డాను. నాకు ఇచ్చిన పనిని 100 శాతం నెరవేరుస్తాను. ప్రేక్షకుల అంచనాలకు దీటుగా ఈ సీక్వెల్ ఉంటుందని అన్నారు.


హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ... నా సినిమాల్లో కూడా 'మహాత్మ 2'. 'పెళ్లి సందడి 2' వంటి సినిమాలు చేయాలని చాలామంది అనుకున్నారు కూడా. ఇక దండుపాళ్యంకు ఉన్న క్రేజ్ తెలిసింది. ముందు విడుదలైన సినిమాలు ఎంత పెద్ద సక్సెస్‌ను సాధించాయో అందరికీ తెలిసిందే. ఇందులో విషయాన్ని ఆధారంగా చేసుకుని ఎన్ని పార్టులైనా షూటింగ్ చేయవచ్చు. నిజంగా జరిగిన సంఘటనల ఆధారంగా చేసిన సినిమాలు ఇవి. దండుపాళ్యం 4 పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.




సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



కొంతమంది పల్లెటూరి పోరగాళ్ళకు.. చాలాచాలా డ్రీమ్స్ ఉంటాయి. ఊళ్లో చదువు పూర్తయ్యాక.. వెంటనే పట్నం వెళ్ళిపోవాలి. ఆనక డాక్టరో, యాక్టరో, సాఫ్ట్‌వేరు ఇంజనీరో అవ్వాలి.. ఇలా రకరకాల రంగుల కలలు కనడం కామన్. ఈ కుర్రాడు కూడా అందరిలాగానే.. తను కూడా టెన్త్, ఇంటర్ అయ్యాక పట్నం వెళ్ళాలనుకున్నాడు. ఇంజనీరో, డాక్టరో, యాక్టరో అవ్వడానికి మాత్రం కాదు; చిత్రకారుడు కావాలని.. తనలోని చిత్రకళలకు మరింత మెరుగులుదిద్దుకోవాలని. అలా బొమ్మల్లోనే బతకాలని. ఇంట్లోవాళ్ళు నొసళ్ళు చిట్లించినా.. భుజాన సంచేసుకుని ఆ సంచిలో రెండు మూడు పెన్సిళ్ళు, నాలుగు తెల్లకాగితాలేసుకుని.. హైదరాబాద్ రైలెక్కేశాడు. కట్‌చేస్తే అనేక సినిమా కష్టాల నడుమ.. కృషీవలుడయ్యాడు. మెచ్చుకోదగ్గ చిత్రకారుడయ్యాడు. అందరూ గీసిన దారిలోవెళ్తే ఏంబావుంటందని అనుకున్నాడో ఏమోగానీ.. బ్రష్‌లు, పెన్సిళ్ళు వదిలేసి.. తనకొనదేలిన ముక్కునే కుంచెగా మలచుకుని.. ఎడాపెడా బొమ్మలు గీసిపారేశాడు. ముక్కుతో బొమ్మలా? అంటారా? అందుకే ఆ..యువచిత్రకారుడు సత్యవోలు రాంబాబు బొమ్మల వైచిత్రి గురించి తెలుసుకుందాం!



నాసికా చిత్రకారుడు

ఏందయ్యా నువ్వు.. ముక్కుతో బొమ్మలేస్తావా? అని.. కాస్తంత అనుమానంగా చూసినోళ్లను తన బొమ్మలతో ముక్కున వేలేసుకుని.. ఆ బొమ్మల్నే తదేకంగా చూసేలా చేస్తాడు రాంబాబు. అలా ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోయినవాళ్లలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, మెగాస్టార్ చిరంజీవిలాంటి పెద్దోళ్ళు చాలామందే ఉన్నారు. ఇంతకీ ముక్కుతో బొమ్మలేంటయ్యా బాబూ.. హవ్.. ఇటీస్ పాసిబుల్? అని ఇంగ్లీషులో అడిగిన వాళ్ళూ లేకపోలేదు. ఎక్కడో శ్రీలంక, కొరియా నుంచి ఇతగాడి నాసికాచిత్రాలపై డాక్యుమెంటరీ చేయడానికి విదేశీ ప్రసారసాధనాలు పరుగెత్తుకుని ఇండియాకొచ్చిన సందర్భాలూ ఉన్నాయ్.

ఆయ్.. మాది గోదారి జిల్లాండీ!



పుట్టిపెరిగింది పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల దగ్గర వేగివాడ. అక్కడే పది, పన్నెండు తరగతులు చదువుకున్నాడు. మిగతా స్నేహితులు, బీఈడీ కోర్సులు పూర్తిచేసి బడిపంతుళ్ళు అవ్వాలనుకుంటే.. ఈ.. రాంబాబు మాత్రం.. బొమ్మలేసే ఆర్టిస్టు కావాలనుకున్నాడు. 'ఒరేయ్ రాంబాబు.. నవ్వు భలేగా బొమ్మలేస్తున్నావోయ్.. అని భుజాన చెయ్యేసి.. భీకరంగా పొగిడేసినవాళ్ళే.. బొమ్మలేమైనా కూడుపెడతాయా? అని నిరుత్సాహపరిచిన వైనాలూ ఉన్నాయి. చిత్రకళపై పెద్దగా అవగాహనలేని కుటుంబ సభ్యులు కూడా ఈబొమ్మల సంగతి నీకెందుకురా.. శుభ్రంగా ఏదైనా గవర్నమెంట్ ఉద్యోగం వచ్చే చదువు.. చదువుకోకూడదా? అని కాస్తంత మనేదగా.. అన్నాగానీ, ఎందుకో అవన్నీ రాంబాబు బుర్రకెక్కలేదు. మనసంతా బొమ్మలపై ధ్యాసే. ఆ ధ్యాసే.. ఊళ్ళో కాలు నిలవకుండా చేసింది. ఊరొదిలేసి దాంతో హైదరాబాద్‌లో పడ్డాడు రాంబాబు.

రంగుపడుద్ది!

బొమ్మలేస్తూ బతకాలనుకోవడం అంత ఈజీ కాదు. బొమ్మలేయడం అనేది పెద్ద క్వాలిఫికేషనూ కాదు.. అనే విషయం.. చాలా తొందరగానే అర్థమైంది రాంబాబుకి. ఎందుకంటే.. హైదరాబాద్‌లో రాంబాబులాంటి ఆర్టిస్టులుబాబులు చాలా మందే.. ఉన్నారని.. వాళ్ళు కూడా బొమ్మలంటే తెగపిచ్చితో ఊరొదిలేసి వచ్చినవాళ్ళని.. మెల్లగా అర్థమైంది. కానీ, బొమ్మల పిచ్చోడు కదా.. మనసు పక్కకు మళ్ళకుండా ఏది ఏమైనాసరే బొమ్మలేయడమే జీవితంగా చేసుకోవాలనుకున్నాడు. బ్యాచిలర్‌గా ఉన్నచోటనే ఇరుగుపొరుగు పిల్లలకు బొమ్మలు నేర్పించడం మొదలెట్టాడు. అలా.. కాస్తంత ఆర్థిక ఆసరా తోడయ్యింది. అలా అలా.. సర్కిల్ పెరిగింది. ఫ్రీలాన్స్‌గా బొమ్మలేసే పనులూ వస్తున్నాయి. పర్వాలేదు. బొమ్మల్ని నమ్ముకుంటే.. ఏం కాదులే.. అనే ధైర్యం వచ్చింది. ఇంట్లోవాళ్ళకూ కొడుకు బాగానే ఉన్నాడు అనే ధైర్యమూ వచ్చింది. అలా రోజులు గడిచేకొద్దీ.. హైదరాబాద్ ఆర్టిస్ట్‌లోకంలో తానొక గుర్తింపుగల ఆర్టిస్ట్‌గా మారాడు. తనకు తెలిసిన విద్యకు మరింత పదునుపెట్టుకున్నాడు. వెంకటేశ్వరా ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ నుంచి బిఎంఫ్ఏ డిగ్రీ కూడా పూర్తయ్యింది. ఆర్టిస్ట్‌గా రమ్మని స్కూల్, కాలేజ్, అడ్వర్టైజ్‌మెంట్, ముద్రణ కంపెనీలు పిలిచినా వెళ్ళలేదు. సొంతంగానే డ్రాయింగ్ స్కూల్ పెట్టుకున్నాడు. ఇదంతా.. చాలా శరవేగంగా మనం చెప్పుకున్నాం గానీ.. మధ్యకాలంలో పీతకష్టాలు పీతవన్నట్టు.. రాంబాబు చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. నమ్మిన బొమ్మకోసం కష్టాలూ పడ్డాడు. ఆకలి పస్తుల్నీ చిరునవ్వుతోనే దాటేశాడు. అలా ఆర్టిస్ట్‌గా ఒక్కొక్కమెట్టూ ఎక్కుతూ హైదరాబాద్‌లాంటి మహానగరాన ఆర్టిస్ట్ కమ్ ఆర్ట్ టీచర్‌గా స్థిరపడ్డం మాటలు



కాదు. నిజమే చేతల్లోనే ఊర్లోవాళ్ళకూ.. తోటివాళ్ళకు నమ్మకం కలిగించేలా ఎదిగాడు.

ఇదీ.. ముక్కు కథ

ముందు అనుకున్నట్టు.. మన వేస్తున్న బొమ్మలు.. అంతకుముందు ఎవరో వేసినట్టుగా ఉంటే.. అందులో స్పెషలేముంది? ఆర్టిస్ట్‌గా ఎవ్వరూ చేయని ప్రక్రియలో



బొమ్మలు వేయాలి.. అనే ఆలోచన వచ్చింది రాంబాబుకి. అలాంటి ఆలోచనలోంచి పుట్టిందే నాసికా చిత్రం. ముక్కును రంగుల్లో ముంచి.. ఆ ముక్కునే కుంచెగా చేసుకుని బొమ్మలు వేయాలి. ఆలోచనైతే బ్రహ్మాండం. కానీ అది సాధ్యపడుతుందా? ప్రయత్నించాడు. రాత్రింబవళ్ళు సాధన చేశాడు. కంటి సమస్యలూ వచ్చాయి. మెడ విరిగిపోయేంత నొప్పులూ వచ్చాయి. ఇంట్లోవాళ్ళు, స్నేహితులు వద్దురా బాబూ.. ప్రమాదమన్నారు. కానీ లెక్కచేయలేదు. ముక్కుతో నెమ్మది నెమ్మదిగా బొమ్మలు దిద్దాడు. రంగులూ అద్దాడు. ఫలితంగా ప్రపంచంలో ఎవ్వరూ చేయని ప్రక్రియకు తానే నాంది అయ్యాడు. సంప్రదాయ చిత్రాలు వేస్తూనే.. నాసికా చిత్రాలు గీయడంలో నేర్పరి అయ్యాడు. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం సైతం 'ఔరా.. రాంబాబూ!' అంటూ భుజం తట్టిన సందర్భం, మెగాహీరో చిరంజీవి 'యూ ఆర్ వండర్‌ఫుల్ ఆర్టిస్టు' అంటూ చప్పటు కొట్టిన లాంటి సందర్భాలు రాంబాబు చిత్రజీవితంలో చాలానే ఉన్నాయి. ఈ నాసికాచిత్రప్రక్రియలో పలు రికార్డులూ బద్దలు కొట్టాడు రాంబాబు. వేదికపై నర్తకి శాస్త్రీయ నృత్యం చేస్తుంటే.. అదే వేదికపైనే ముక్కుతో ప్రత్యక్షంగా నాట్యచిత్రాలు గీసి.. ఔరా అనిపించే చిత్రలేఖనసాహసాలూ చాలానే చేశాడు రాంబాబు. తనకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టిన నాసికాచిత్రాలు ఎక ఎత్తైతే.. సంప్రదాయ చిత్రాలు గీయడంలో రాంబాబుది ప్రత్యేకశైలి. ఆయిల్, ఆక్రిలిక్, పెన్సిల్ వాటర్ కలర్.. ఇలా అన్ని ప్రక్రియల్లోనూ ఆరితేరినవాడే.

చిత్రకళాశిక్షణ


ఆర్టిస్ట్‌గా సక్సెస్ అవ్వడం అంటే.. బొమ్మల్లో పరిణిత చెందడం, సొంతకాళ్ళపై నిలబడ్డమే కాదు.. పదుగురికి తాను నేర్చుకున్న కళ ఏదో ఒకరూపంలో ఉపయోగపడాలి. కుటుంబానికి ఆసరాగా నిలవాలి. రాంబాబు అదే పనిచేస్తున్నాడు.. సొంతంగా 'ది సద్గురు స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' పేరుతో పిల్లలకు, చిత్రకళ విద్యార్థులకు, ఔత్సాహికులకు శిక్షణనిస్తున్నాడు. కుటుంబానికి అన్ని రకాలుగా తానో అండగా నిలిచాడు. సుదీర్ఘమైన చిత్రకళాప్రస్థానంలో ప్రోత్సాహక గుర్తింపులు, సత్కారాలు చాలానే ఉన్నాయి. లయన్స్‌క్లబ్ ప్రతినిధిగా సామాజిక సేవలోనూ ముందుంటాడు రాంబాబు. మొత్తానికి తాను కలలు గన్న రంగుల ప్రపంచాన్ని స్వయంకృషితో తనకు తానే సృష్టించుకుని.. విజేత అయ్యాడు. ఇదీ, రాంబాబు రంగుల ప్రపంచం.

- గంగాధర్ వీర్ల











ప్రాధాన్యత పెరుగుతోంది

చిత్రకళ అనేది ఒక అభిరుచిగానే చూడకూడదు. సరియైన ప్రణాళికతో సాధన, అధ్యయనం, విద్యాపరమై అర్హతలు సాధిస్తే.. కచ్చితంగా చిత్రలేఖనంలో చక్కటి కెరీర్ ఉంది. ఇప్పుడు అన్నిరంగాల్లోనూ చిత్రలేఖనకళ ఆవశ్యకత పెరిగింది. రానున్న రోజుల్లో మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. చదువుతోపాటు చిత్రకళ విద్యను ఆసరా చేసుకుంటూ ఫ్రీలాన్సర్‌గానూ రాణించవచ్చు.

-సత్యవోలు రాంబాబు, ఆర్టిస్ట్
ఫోన్: 9959971679

సోషల్ మీడియా

ఏది నిజమో, ఏది అబద్ధమో ..!!

తెలుసుకునే అవకాశం లేనప్పుడు నిజం చాటుగా ఉండిపోతుంది. నిజం ఏమిటో తెలియనప్పుడు – జనం ఏదొకటి అనేసుకోవటం ఒక ప్రహసనంలా నడుస్తుంది. తెలియనిది ఏమిటో తెలుసుకోవటానికి సత్యాన్వేషణ చేసేవాళ్లు ఎప్పుడూ చేస్తూనే ఉంటారు. గాలివాటు కబుర్లను వాళ్లు నమ్మరు. తార్కిక జ్ఞానంతో పుటం పెట్టి– వాస్తవం ఏమిటో తెలుసుకోవటానికి నిరంతరం కృషి చేస్తారు. సత్యాన్వేషణకు కొన్ని పద్ధతులూ, పరికరాలూ అవసరమవుతాయి. ఒకప్పుడు అలాంటి పరికరాల అందుబాటు తక్కువ. ఇప్పుడు ఎక్కువ. ఇంటర్నెట్, పుస్తకాల లభ్యత పెరిగింది. సమాచారాన్ని బేరీజు వేసుకోవటం ఇప్పుడు క్షణాల్లో పని. ఈరీత్యా సోషల్ మీడియాలో అన్నీ నిజాలే ప్రసారం జరగాలి. అన్నీ వాస్తవాలే చెలామణి అవ్వాలి.

కానీ, అలా జరగటం లేదు. సోషల్ మీడియా పెద్దఎత్తున అవాస్తవాలూ, అబద్ధాలూ, కల్పితాల ప్రవాహంలో కొట్టుకుపోతోంది. ఎందుకిలా జరుగుతోంది? అక్షరాస్యత ఉన్నా, ఉన్నత విద్య అభ్యాసకులు పెరిగినా, ఆధునిక కాలంలో ప్రయాణం చేస్తున్నా– ఇలా ఎందుకు జరుగుతోంది? దీనిపై పరిశీలన అవసరం. ఎవరో ఒక పాత హిరోయిన్ ఇప్పుడు అవకాశాలు కోల్పోయిందని, అడుక్కుతినేంత దుస్థితిలో ఉందని సోషల్ మీడియాలో ఒక వార్త. క్షణాల్లో అందరికీ పాకిపోతుంది. ఏడు తలల సర్పం ఒకటి కర్నూలు కనపడిందని ఒక ఫొటో హల్‌చల్ చేస్తూ ఉంటుంది. ఒక దేవుడి బొమ్మను 21 మందికి పంపిస్తే– 24 గంటల్లో ఒక మంచి వార్త వింటారని ఎవరినుంచో సమాచారం వచ్చిపడుతుంది. అది కూడా అలా అలా అనేకమందికి చేరిపోతూ ఉంటుంది. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో రోజూ ఇలాంటి సమాచారాలూ మనకు తారసపడుతూనే ఉంటాయి. వచ్చిన సమాచారం వాస్తవమా? కాదా? అని తర్కించుకోవటం చాలామంది చేయటం లేదు. అదొక విడ్డూరంగానో, వేలంవెర్రిగానో భావించి, షేర్ చేయటం, ఫార్వార్డు చేయటం చాలా సాదాసీదా చేసేస్తున్నారు. కొన్ని మతాలకు, కులాలకు వ్యతిరేకంగా లేదా అనుకూలంగా కూడా ఇలాంటి ప్రచారం యథేచ్ఛగా సాగిపోతోంది. క్షణాల్లో, గంటల్లో సోషల్ మీడియా అబద్ధాలతో నిండిపోతోంది. విజ్ఞానవంతమైన పౌర సమాజం ఏర్పడటానికి ఈ ధోరణి పెద్ద ఆటంకంగా నిలుస్తుంది. అంతకుమించి మనుషుల మధ్య సుహృద్భావం, సహృదయత పెరక్కుండా చేస్తుంది. విద్వేషం, మూర్ఖత్వం పెరిగేలా ప్రేరేపిస్తుంది. శాస్త్రవిజ్ఞానం ద్వారా అభివృద్ధి చెందిన సమాచార వ్యవస్థ అందుకు భిన్నమైన వాతావరణం కల్పించటానికి వినియోగం కావటం అత్యంత బాధాకరం.



మన చదువుల్లోనూ, సమాజంలోనూ తార్కిక జ్ఞానం లోపించటమే ఈ పరిస్థితి ప్రధాన కారణం. మన ఎంపికకు, అభిప్రాయానికి ఒక తార్కిక దృష్టి దోహదపడాలి. ఒక నటుడో, కులమో, మతమో, ప్రాంతమో, పార్టీయో– ఎంపికకు ఆధారమైతే వాస్తవం మరుగునపడుతుంది. ఆ నటుడు ఏది చెబితే అది రైటు, ఆ మతం ఏది ప్రకటిస్తే అది నిజం– అనుకునే ధోరణి ఆలోచించే శక్తిని హరించి వేస్తుంది. అలాగే– వచ్చిన ప్రతి సమాచారాన్ని యథాలాపంగా చదివి, నమ్మేయటం కూడా సమాజానికి చెడునే కలిగిస్తుంది. ఈరకమైన అనుసరణ మారాలి. ఎవరు చెప్పినా, ఏ ఎఫెక్టుతో చెప్పినా– దానిలో నమ్మదగింది ఉందా? లేదా? అనే ప్రశ్న ఉదయించాలి. మరికొన్ని అంశాలతో బేరీజు వేసుకొని నిర్ధారణకు రావాలి. మనకు కూడా ఆ విషయం నిజమే అనిపిస్తే, దానికి ప్రచారం కల్పించటం అవసరమనిపిస్తే– ముందుకు వెళ్లాలి. అబద్ధం అనిపించినప్పుడు– అది తప్పుడు సమాచారం అని పేర్కొని, దానిని అక్కడితో నిలిపివేయాలి. సాంకేతిక సమాచార వ్యవస్థ అరచేతికి అందిన నేపథ్యంలో– ఇది ప్రతి ఒక్కరి బాధ్యత.

కొంతమంది కావాలనే అబద్ధపు సమాచారాన్ని సృష్టించటం అవసరంగా, అలవాటుగా పెట్టుకున్నారు. సంచలనం కలిగించటం కొందరికి సరదా అయితే– అబద్ధాలతో లబ్ధి పొందటం కొందరి వ్యూహం. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వచ్చే సమాచారం, మైనార్టీలకు వ్యతిరేకంగా సాగే ప్రచారం, అభ్యుదయవాదులను కించపరిచే సమాచారం– కొన్ని ప్రగతి నిరోధక శక్తుల పన్నాగం. అలాంటి సమాచారం తప్పుతోవ పట్టించేదిగా, కులమత ఉద్వేగాలను రెచ్చగొట్టేదిగా ఉంటుంది. ఇలాంటి పనిచేయటానికి కొన్ని రాజకీయ పార్టీలూ, సంస్థలూ సోషల్ మీడియాను బలమైన వేదికగా వినియోగిస్తున్నాయి. అంకెలకు అందని, చరిత్రతో పొసగని అబద్ధాలను నిజమే అన్నంత ఉద్వేగంతో వారు ప్రచారం చేస్తారు. ఆలోచనతో కూడిన ప్రశ్నలకు ఏమాత్రమూ అవకాశం ఇవ్వరు. తీవ్రమైన విద్వేషం, అసభ్యకరమైన భాషా ... వారి పోస్టుల్లో కనిపిస్తాయి. వాటిని వ్యతిరేకించే ప్రతి ఒక్కరినీ తీవ్రంగా విమర్శించటం వాళ్ల పనిగా ఉంటుంది. ఇలాంటి వాటిని గమనించటానికి కాస్త వివేచన, విచక్షణ అవసరం. చరిత్రను, సామాజిక అంశాలను తెలుసుకోవడం; శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండటం చాలా అవసరం.

సోషల్ మీడియా ఇప్పుడు అందరిదీ. మన అరచేతిలోనుంచే మనం వార్తలు ఇవ్వొచ్చు. వ్యాఖ్యానించొచ్చు. ప్రచారం చేయొచ్చు. అవాస్తవాలను ఖండించవచ్చు. సమాచార సృష్టి– వ్యాప్తి అనేవి ఎప్పుడూ ఆయుధాలే! ఈ ప్రపంచాన్ని ఇలాగే ఉంచటానికి, అందుకు ప్రజలను మార్కెట్, మతోన్మాదాల్లో ముంచెత్తటానికి కొందరు ప్రయత్నిస్తారు. ఈ ప్రపంచాన్ని ఇంతకన్నా మంచిలోకి మళ్లించటానికి, అభ్యుదయకరంగా విస్తరిల్లటానికి మరికొందరు ప్రయత్నిస్తారు. ఎవరిది ఏ తోవో తెలుసుకోవటానికి జనం మరింత జాగురుతతో, మరింత తార్కిక దృష్టితో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది నిజవె, ఏది అబద్ధమో తెలుసుకోవటమే నేడు పౌరులకు అత్యంత ఆవశ్యకమైన విధి. సోషల్ మీడియా ఇప్పుడు సాదాసీదా కాలక్షేపం కాదు; అది మనలో వికసించే చీకటో, వెలుగో కూడా!

- టి1ా ఖ్మిక

రష్యాపై నిషేధం ఎత్తివేత



వాషింగ్టన్, మాస్కో : రష్యాపై విధించిన నిషేధాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి) బుధవారం ఎత్తివేసింది. డోపింగ్ ఆరోపణలతో తాత్కాలికంగా విధించిన నిషేధాన్ని ఎత్తివేసిన ఐఓసి రష్యా సభ్యత్వాన్ని తిరిగి ఇచ్చివేసింది. ఇటీవల దక్షిణకొరియాలో జరిగిన వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న రష్యా అథ్లెట్ల బృందానికి నిర్వహించిన డోపింగ్ టెస్టులో ఫలితం నెగటివ్‌గా వచ్చిన నేపథ్యంలో ఐఓసి ఈ నిర్ణయం తీసుకుంది. రష్యాపై నిషేధం ఎత్తివేత తక్షణమే అమల్లోకి వస్తుందని ఐఓసి ఒక ప్రకటనలో తెలిపింది. వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా నుంచి మొత్తం 168 మందితో కూడిన బృందం పాల్గొనగా, ఇందులో ఇద్దరు మాత్రమే డోపింగ్ పరీక్షలో దొరికిపోయారు. ఇటీవల ముగిసిన వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా బృందం రెండు స్వర్ణాలతో సహా 17 పతకాలు గెలుచుకుంది. పతకాల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. కాగా, తమపై ఐఓసి నిషేధం ఎత్తివేసిన విషయాన్ని రష్యా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు అలెగ్జాండర్ జుకోవ్ తమ దేశ టీవీలో వెల్లడించారు. ఈ నిర్ణయంతో ఐఓసిలో రష్యా ఒలింపిక్ కమిటీ హక్కులన్నీ పునరుద్ధరించబడినట్లు ఆయన తెలిపారు. 'ఈ నిర్ణయం తమకు చాలా కీలకమైనది' అని ఆయన అన్నారు. రష్యా యాంటీ డోపింగ్ వ్యవస్థలో అవినీతి, అక్రమాలు ఉన్నాయనే ఆరోపణలతో డిసెంబరులో ఐఓసి నిషేధం విధించింది. దీంతో ఇటీవల జరిగిన వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా అథ్లెట్లు తమ దేశ చిహ్నం లేకుండా, తటస్థంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లోనూ రష్యా పతకం ధరించడానికి ఐఓసి అనుమతించలేదు.

సులువైన గ్రూప్‌లో భారత్

ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో జరుగునున్న హాకీ ప్రపంచకపకప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సంఘం బుధవారం విడుదల చేసింది. భారత్‌కు పూల్-సిలో స్థానం దక్కింది. టోర్నీ తొలి మ్యాచ్ భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతుంది. పూల్ దశలో ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. కాగా, ఈ కప్‌లో పాల్గొనడానికి పాకిస్తాన్ ఇటీవలే అంగీకరించిన సంగతి తెలిసిందే.

జట్ల వివరాలు

పూల్ ఎ : అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్
పూల్ బి : ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, చైనా
పూల్ సి : బెల్జియం, ఇండియా, కెనడా, దక్షిణాఫ్రికా
పూల్ బి : నెదర్లాండ్స్, జర్మనీ, మలేషియా, పాకిస్తాన్

షెడ్యూల్ (భారత్ మ్యాచ్‌లు)

నవంబరు 28 : ఇండియా-దక్షిణాఫ్రికా
డిసెంబరు 2 : ఇండియా-బెల్జియం
డిసెంబరు 8 : ఇండియా-కెనడా

క్వార్టర్ ఫైనల్స్
డిసెంబరు 12-13

సెమీ ఫైనల్స్
డిసెంబరు 15

ఫైనల్
డిసెంబరు 16



హాకీ ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ : ఈ ఏడాదిలో స్వదేశంలో జరగనున్న హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు సులువైన డ్రా లభించింది. ఈ కప్‌లో పూల్ సిలో భారత్ తలపడనుంది. ఈ పూల్‌లో భారత్ కంటే మెరుగైన ర్యాంక్ ఉన్న జట్టు కేవలం బెల్జియం మాత్రమే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ 6వ స్థానంలో ఉండగా, బెల్జియం మూడో ర్యాంక్‌లో ఉంది. అలాగే పూల్ సిలో ఉన్న కెనడా, దక్షిణాఫ్రికా జట్లు 11, 15 ర్యాంకుల్లో ఉన్నాయి. ఈ ఏడాది నవంబరు 28 నుంచి డిసెంబరు 16 వరకూ భువనేశ్వర్‌లో హాకీ ప్రపంచకప్ జరగనుంది. బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లను నాలుగు పూల్స్‌గా విభజించారు. ఒక్కో గ్రూప్‌లోనూ నాలుగు జట్లు ఉంటాయి. గ్రూప్ దశలో పూల్‌లో తొలి రెండు స్థానాల్లోనూ నిలిచిన జట్లు క్వార్టర్స్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నాలుగు గ్రూపుల్లో పూల్‌డి కఠినంగా కనిపిస్తుంది. ఇందులో నెదర్లాండ్స్, జర్మనీ, మలేషియా, పాకిస్తాన్ జట్లు ఉన్నాయి. కాగా, ఈ టోర్నీ తొలి రోజున భారత్, దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. ఈ టోర్నీలో మ్యాచ్‌లన్నీ కళింగ స్టేడియంలో నిర్వహిస్తారు. రోజుకు రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.

ఈ మ్యాచ్‌లు సాయంత్రం 5:00, 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. మొత్తం 19 రోజుల పాటు టోర్నీ కొనసాగుతుంది. గ్రూప్ దశలో భారత్ పాల్గొనే మ్యాచ్‌లన్నీ సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

డోపింగ్‌లో దొరికిన దేవిందర్ సింగ్



న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ దేవిందర్ సింగ్ కాంగ్ డోపింగ్ పరీక్షలో పట్టుబడ్డాడు. పటియాలలో జరుగుతున్న ఇండియా గ్రాండ్ ప్రి సందర్భంగా గత వారం దేవిందర్‌కు నిర్వహించి డోపింగ్ పరీక్ష ఫలితం అనుకూలంగా వచ్చింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ అథ్లెట్ల ఫెడరేషన్ అసోసియేషన్ (ఐఎఎఎఫ్)కు భారత అథ్లెట్ల సమాఖ్య తెలిపింది. ఈ కేసులో దేవింద్‌పై నాలుగేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది. ఇదే జరిగితే 29 ఏళ్ల దేవిందర్ కెరీర్ ముగిసిపోయే అవకాశం ఉంది. ఈ ఏడాది జరిగే ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లో దేవిందర్ పతకం సాధించే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత ఏడాది లండన్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో దేవిందర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. దీంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైలన్‌కు అర్హత సాధించిన తొలి భారతీయ జావెలిన్ త్రోయర్‌గా ఘనత దక్కించుకున్నాడు. ఈ ఫైనల్లో అతను 12వ స్థానంలో నిలిచాడు. కాగా, గత ఏడాది నిర్వహించిన డోపింగ్ పరీక్షలోనూ దేవిందర్ దొరికిపోయాడు. అయితే అతని నమూనాలో దొరికిన ఉత్ప్రేరకం నిషేధించిన ఔషధాల జాబితాలో లేకపోవడంతో దేవిందర్‌పై శిక్ష విధించలేదు.

'కామెన్వెల్త్ గేమ్స్'కు బాక్సింగ్ బృందం ప్రకటన

న్యూఢిల్లీ : ఈ ఏడాది కామెన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత బాక్సింగ్ బృందాన్ని బుధవారం ప్రకటించారు. ఎలాంటి సాంప్రదాయ ట్రెయిల్స్ లేకుండా ఈ జాబితాను విడుదల చేశారు. ఇలా చేయడం ఇదే మొదటిసారి. ఆస్ట్రేలియాలోని గోల్డ్ గోస్ట్‌లో ఏప్రిల్ 4 నుంచి 15 వరకూ కామెన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. ఈ నెల 5లోగా జట్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుంది. **భారత బాక్సింగ్ బృందం:** పురుషులు : అమిత్ పంగల్ (49 కేజీలు), మహమ్మద్ హుస్సాముద్దీన్ (56 కేజీలు), మనిష్ కౌషిక్ (60 కేజీలు), మనోజ్ కుమార్ (69 కేజీలు), వికాస్ కృష్ణన్ (75 కేజీలు), సతీష్ కుమార్ (91 కేజీలు), **మహిళలు** : మేరీకోమ్ (48 కేజీలు), లోవ్లినా బోర్గోహిన్, ఎల్. సరితా దేవి (60 కేజీలు)

రెండో వన్డేలో ఇంగ్లాండ్ గెలుపు

మౌంట్ మౌంగనౌ : న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల ఈ సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఈ సిరీస్‌లో మూడో వన్డే ఈ నెల 3న వెల్లింగ్టన్‌లో జరుగుతుంది. రెండో వన్డేలో న్యూజిలాండ్ విధించిన 224 పరుగుల లక్ష్యాన్ని కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి 37.5 ఓవర్లలోనే ఇంగ్లాండ్ అందుకుంది. లక్ష్య సాధనలో ముందుగా ఇంగ్లాండ్ 47 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. బ్రెయిర్‌స్టో 37 పరుగులు చేసి జట్టు స్కోరు 86 పరుగుల వద్ద మూడో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ దశలో మోర్గాన్-స్టోక్స్ జోడీ న్యూజిలాండ్ బౌలర్లపై కదం తొక్కింది. నాలుగో వికెట్‌కు ఈ జోడీ 88 పరుగులు జోడించింది. జట్టు స్కోరు 174 వద్ద మోర్గాన్ నాలుగో వికెట్‌గా అవుటయ్యాడు. 63 బంతులు ఆడిన మోర్గాన్ మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో 62 పరుగులు చేశాడు. ఈ తరువాత స్టోక్స్, బట్లర్ అజేయంగా నిలిచి ఇంగ్లాండ్‌కు విజయాన్ని అందించారు. స్టోక్స్ 74 బంతుల్లో సిక్స్, ఏడు ఫోర్లతో 63 చేయగా, బట్లర్ 20 బంతుల్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 36 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 49.4 ఓవర్లలో ఆలౌటయింది. సాంత్నర్ 63 పరుగులు, గుప్టిల్ 50 పరుగులు చేశారు. 63 పరుగులు, రెండు వికెట్లు తీసిన స్టోక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది అవార్డు లభించింది. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

క్రికెటర్లకు భారీగా పెరగనున్న వేతనాలు



ముంబయి : భారత క్రికెటర్ల వేతనాలు భారీగా పెరగనున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) త్వరలోనే ఆటగాళ్లకు ఈ శుభవార్త తెలపనుంది. బీసీసీఐ బోర్డు పరిధిలో ఆడుతున్న వారందరి జీతాలు భారీగా పెరగనున్నాయి. భారత పురుషుల, మహిళల జట్టుతో పాటు దేశవాళీ, అండర్-19 క్రికెటర్ల జీతాలు పెరగనున్నాయని బీసీసీఐ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. దీనికి సంబందించిన ప్రక్రియ దాదాపు పూర్తైందని సుప్రీం కోర్టు నియమిత పాలకుల కమిటీతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆ అధికారి వెల్లడించారు. ఈ నెల మూడున శ్రీలంక పర్యటనకు టీమిండియా బయలుదేరనుంది. ఈ పర్యటనకు ముందే సుమారు 25 మంది క్రికెటర్లను ఏ,బీ, సీ మూడు కేటగిరీలుగా విభజించి వార్షిక కాంట్రాక్టులు అమలు చేయనున్నారు. జీతాల పెంపునకు ఆర్థిక కమిటీ ఆమోదం తెలుపడమే తరువాయి. ఈ ఏడాది ఐపీఎల్ కన్నా ముందే ఆటగాళ్లకు కాంట్రాక్టులను ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తోంది. ఏడాదికి గ్రేడ్-ఏ క్రికెటర్లకు దాదాపుగా రూ.12కోట్లు, బి-గ్రేడ్ రూ.8 కోట్లు, సీ-గ్రేడ్ నాలుగు కోట్లు ఇవ్వనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. ఎమ్మెస్కే ప్రసాద్ నేత త్వంలోని సెలక్షన్ కమిటీ ఆటగాళ్లకు ఏ స్థాయి గ్రేడ్ ఇవ్వాలనేదాన్ని నిర్ణయిస్తుంది. ఆటగాళ్ల జీతాలు పెంచాలని గతంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ, మహేంద్రసింగ్ ధోనీ, కోచ్ రవిశాస్త్రిలు బీసీసీఐ,పాలకుల కమిటీతో చర్చించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రేడ్ ఏ ఆటగాళ్లు రూ.2 కోట్లు, గ్రేడ్ బీ రూ.1 కోటి, గ్రేడ్ సీ ఆటగాళ్లకు రూ.50 లక్షల వార్షిక వేతనం పొందుతున్నారు. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ గతంలో అగ్ర జాబితాలో ఉండటంపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏ ఆటగాళ్ల ఏ జాబితాలో చోటు దక్కించుకుని ఎంత మేర వేతనాలు అందుకుంటారో తెలియాలంటే బీసీసీఐ ప్రకటించే వరకు వేచి ఉండక తప్పదు.

5 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 8న బడ్జెట్
- భారీ భద్రత
- స్పీకర్ కోడెల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ కోడెల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలను మార్చి 5 నుంచి నిర్వహించనున్నట్లు స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు. శాసనమండలి ఛైర్మన్ ఫరూక్‌తో కలిసి బుధవారం ఆయన అసెంబ్లీలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని, ప్రజాప్రతినిధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులకు సూచించామన్నారు. బడ్జెట్ సమావేశాలకు వైఎస్సార్ సిపి సభ్యుల్ని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాలను వైసిపి బహిష్కరించిన సంగతిని గుర్తు చేసిన ఆయన, సభలో మాట్లాడే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. సమావేశాలకు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పీకర్ కోరారు.

భద్రతా ఏర్పాట్లపై కోడెల, ఫరూక్ సమీక్ష

మార్చి 5 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాలకు గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలని శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, శాసన మండలి ఛైర్మన్ ఎస్ఎండి ఫరూక్ పోలీస్ ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. బడ్జెట్ సమావేశాల భద్రతకు సంబంధించి సచివాలయంలోని అసెంబ్లీ హాల్‌లో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలి ఛైర్మన్, శాసనసభ స్పీకర్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద పని చేసే పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించకూడదని సూచించారు. మొదటి రోజు గవర్నర్ నరసింహన్ వస్తున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని పోలీస్ ఉన్నతాధికారులకు స్పీకర్ కోడెల సూచించారు.

ప్రతి అంగుళమూ సద్వినియోగం

అత్యున్నతమైన అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తున్నందున ప్రతి అంగుళం సద్వినియోగమయ్యేలా ఆకృతుల్ని రూపొందిస్తామని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. సచివాలయంలోని అసెంబ్లీ హాల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులతో ఇప్పటికి మూడుసార్లు భేటీ అయినట్లు తెలిపారు. టవర్ నమూనాలో ఉన్న డిజైన్ బాగుందని, దానికి కొన్ని సూచనలు చేశామన్నారు. అంతకుముందు అసెంబ్లీ భవన నిర్మాణానికి సంబంధించిన నమూనా, డిజైన్లను శాసనమండలి ఛైర్మన్ ఫరూక్, అసెంబ్లీ స్పీకర్ కోడెలకు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు చూపించారు. మూడున్నర లక్షల చదరపు అడుగుల్లో 250 మీటర్ల ఎత్తుమేర ఈ ఐకానిక్ టవర్ నమూనా భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అసెంబ్లీలోకి తూర్పు మార్గం నుంచి ముఖ్యమంత్రి, పశ్చిమం నుంచి మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉత్తర దిశ నుంచి సందర్శకులు, ఇతరులు, దక్షిణం వైపు నుంచి ఉద్యోగులు వచ్చేలా ఆకృతుల్ని రూపొందించినట్లు వారు వివరించారు

మొదటి అంతస్తులో అసెంబ్లీ, శాసన మండలి

మొదటి అంతస్తులో అసెంబ్లీ, శాసనమండలి బ్లాకులు ఏర్పాటు చేసేలా డిజైన్ చేసినట్లు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు తెలిపారు. సిఎం, స్పీకర్, శాసనమండలి ఛైర్మన్‌తోపాటు ప్రధాన ప్రతిపక్ష నేత, మంత్రులు, చీఫ్ విప్‌ల కార్యాలయాలను కూడా అదే ఫ్లోర్‌లో ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ హాల్, బిఎసి సమావేశ గదులు మొదటి అంతస్తులో ఉండేలా డిజైన్ చేశారు. రెండో అంతస్తులో పలు కమిటీలకు పేషీలు ఏర్పాటు చేసేలా డిజైన్‌లో పేర్కొన్నారు. వాటితోపాటు టెక్నికల్ టీమ్ నిర్వహణ, రిక్రియేషన్, జిమ్ ఏర్పాటు చేయనున్నారు. రెండో ఫ్లోర్‌పైన మ్యూజియంను ఏర్పాటు చేసేలా డిజైన్లు చేసినట్లు వారు వివరించారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో అడ్మినిస్ట్రేషన్, లైబ్రరీ

గ్రౌండ్ ఫ్లోర్‌లో అడ్మినిస్ట్రేషన్ సిబ్బందికి రెండు బ్లాకులు కేటాయించేలా డిజైన్లు రూపొందించినట్లు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు తెలిపారు. వారితోపాటు చీఫ్ సెక్యూరిటీ అధికారులు, మీడియా పాయింట్, లైబ్రరీ, ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ డిస్పెన్సరీని కూడా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటయ్యేలా ఆకృతులు డిజైన్ చేసినట్లు వారు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 5,07,903 మంది హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠీ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒకేషనల్, జనరల్‌లో కలిపి 5,25,998 మంది దరఖాస్తు చేయగా, 5,07,903 మంది విద్యార్థులు హాజరయినట్లు ఇంటర్ బోర్డు తెలిపింది.

కాగా తొలిరోజు పరీక్షకు 18,095 మంది గైర్హాజరయ్యారని పేర్కొంది. మచిలీపట్నంలోని పవిత్ర జూనియర్ కలాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఆర్కే జూనియర్ కలాశాల విద్యార్థిని మాల్ ప్రాక్టిస్ క్రింద డిబార్ చేయగా, బాపట్లలోని అభ్యుదయ జూనియర్ కలాశాలకు చెందిన మరొక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ దొరికిపోయాడు.

మమల్ని తెలంగాణా సచివాలయానికి పంపండి

ఎపి సిఎస్‌కు టి.ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణా సచివాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల్ని తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులతోనే భర్తీ చేయాలని తెలంగాణా సమన్వయ కమిటీ (ఎపి సచివాలయంలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు) డిమాండ్ చేసింది. వెలగపూడి సచివాలయంలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణ ఉద్యోగులు ఈ సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఏపీకి కేటాయించిన 233 మంది మూడు, నాలుగో తరగతి ఉద్యోగులు మూడేళ్లుగా ఏపీ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2014లో విభజనానంతరం తమను ఏపీకి కేటాయించారన్నారు. విభజన హామీ ప్రకారం తమను ఏపీకి కేటాయించినా తిరిగి తెలంగాణకు పిలిపిస్తామన్నారన్నారు. కానీ ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చిరుద్యోగులమైన తాము వారానికోసారి తెలంగాణకు ప్రయాణం చేసి రావడం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అలాగే ప్రయాణ ఖర్చులు కూడా అధికమవుతున్నాయన్నారు.

5,6 తేదీల్లో సామూహిక సెలవులు

తెలంగాణ స్థానికులమైన తమను వీలైనంత త్వరగా తెలంగాణ రాష్ట్రానికి తీసుకోవాలని కోరుతూ మార్చి 5, 6 తేదీల్లో సామూహిక సెలవులు పెడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం వారు ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కులాంతర వివాహాలకు అందని ప్రోత్సాహం

- పరిశీలన పూర్తయినా చెల్లింపుల్లో జాప్యం
- వందలాది మంది ఎదురుతెన్నులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కులాంతర వివాహాలు చేసుకున్న నవ దంపతుల్ని ఆర్థికంగా ఆదుకోవడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం సరిగా అందకపోవడంతో ఆందోళనలకు గురవుతున్నారు. ఆర్థిక ప్రోత్సాహకం కింద గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ. 2.38 కోట్లు చెల్లించాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కులాంతర వివాహం చేసుకున్న గిరిజన యువతీ, యువకులకు చేయూతనివ్వాలనే సదుద్దేశంతో ప్రభుత్వం రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే.. కులాంతర వివాహాలు చేసుకున్న గిరిజనులకు గతంలో రూ. 10వేలు చెల్లించే వారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక దీన్ని రూ. 50వేలకు పెంచారు. ప్రభుత్వం అందించే ఈ ప్రోత్సాహకం కోసం 13 జిల్లాల నుంచి సుమారు 990 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కానీ, ఇంత వరకు దరఖాస్తులు కూడా పూర్తి స్థాయి పరిశీలనకు నోచుకోలేదు. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లా నుంచి 256, గుంటూరు జిల్లా నుంచి 159 మంది దరఖాస్తులు చేసుకోగా, కర్నూలు జిల్లా నుంచి 13, ప్రకాశం జిల్లా నుంచి 14 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే మొత్తం దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 882 దరఖాస్తులు మాత్రమే పరిశీలించారు. దాదాపు 108 మంది దరఖాస్తులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇదిలా ఉంటే పరిశీలన పూర్తి చేసిన దరఖాస్తు దారులకు కూడా ఆర్థిక ప్రోత్సాకాన్ని అందించడంలో తీవ్ర జాప్యం నెలకొంది. దీంతో వందలాది మంది సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. సుమారు 543 మంది దరఖాస్తుల పరిశీలన పూర్తయినా, నేటికీ ఆర్థిక ప్రోత్సాహకానికి నోచుకోలేదు. చెల్లింపుల కోసం దాదాపు రూ. 2.38 కోట్లు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దీని కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందని చెబుతున్నారు. కానీ వేల కోట్ల రూపాయల మేర ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మూలుగుతున్నా ఆర్థిక సహాయాన్ని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68